ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. దేవతలారా దీవించండి—వసుంధర
25. మూడో నెంబర్ ఇల్లు—'విపంచి'
38. ప్రేమించు ప్రేమకోసం—చంద్రశేఖర అజాద్
53. అతి జాగ్రత్త—దీపిక
63. ఫోన్ ఫ్రెండ్—బొమ్మిడి అచ్చారావు
84. కళ్యాణ మందిర్—జొన్నలగడ్డ రామలక్ష్మి
105. స్మగ్లింగ్ ప్రాణంతీసింది—ఎమ్.వి.వి.సత్యనారాయణ
119. కర్ఫ్యూలో అతిథి—సరసి
133. కన్నె పరీక్ష—'విపంచి'
146. రతి కాముకులు—ఎమ్.డి. చైతన్య
163. కాంచన శిఖరం (సీరియల్)—ఏ. వీ. మోహన్రావ్

నవలలు (సప్లిమెంట్)

9. గ్రీన్ కార్డ్ హోల్డర్—వసుంధర
49. జీవంవున్న దేవత—అజీజ్
91. రోజా—టెంపోరావ్
130. రాధిక ప్రియుడు—మిస్ కె. మధుబాల
170. విషకన్య (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

దేవతలారా దీవించండి

వసుంధర

సదాశివం చిత్ర నిర్మాత. అయితే నిర్మాతల్లో ఆయన కొక ప్రత్యేక స్థానముంది. ఆయనకు నలుపులో ఎంతుందో, తెలుపులో ఎంతుందో—డబ్బు గురించి ఎవరికీ తెలియదు. అలా తెలియకుండా వుండాలనేమో ఆయనెప్పుడూ తెలుపు

నలుపు చిత్రాలు తీయడు.

సదాశివం వర్ణచిత్రాలు తప్ప తీయడన్నది ఒక నిజమైతే—ఆయన చిత్రాలు భారీగా వుండాలన్నది మరో నియమం. బడ్జెట్ చిత్రాలు తీయడం ఆయన పరువుకు భంగమని—స్వాభిప్రాయం.

తన చిత్రాలకు స్వయంగా దర్శకత్వం వహించకపోయినా—చిత్రం ఏవిధంగా తయారుకావాలో ఆయనే నిర్ణయిస్తాడు అందువల్ల వివిధ దర్శకుల చేతుల్లో తయారైనప్పటికీ ఆయన చిత్రాలకో ప్రత్యేకత వుంది.

సదాశివం కుటుంబ చిత్రాలు తీస్తాడన్న పేరుంది. అయితే సెక్సు, క్రైమ్ ఆయన చిత్రాల్లో ప్రచ్ఛన్నంగా వుంటాయి. ఆయన చిత్రాలు సెన్సారు కత్తెరకు గురికావడం అరుదు. కానీ ఇతర చిత్రాల్లోకంటె అసభ్యకరమూ, అభ్యంతరమూ—అయిన దృశ్యాలాయన చిత్రాల్లో ఎక్కువుంటాయి. ఆయన చిత్రాలు సెన్సారు కత్తెరకు గురికాకపోవడాని క్కారణం—ప్రభుత్వంలో ఆయనకున్న పలుకుబడి అనీ—ఆ పలుకుబడి క్కారణం—ఆయన పార్టీ చందాలుగా ఇచ్చే నల్లధనమనీ కూడా చాలా మంది చెప్పుకుంటారు.

ఏదేమైతేనేం—సదాశివం చిత్రం అనగానే ప్రజలాత్రుతగా విడుదలకోసం ఎదురుచూస్తారు. ఆ చిత్రంపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. పత్రికలు కూడా ఆ చిత్రం గురించి విపరీతంగా విడుదలకు ముందూ—విడుదల తర్వాత కూడా రాస్తారు. చిత్రం చూసినవారెవరైనా—చిత్రదర్శకుడికంటె, చిత్రంలో హీరో హీరోయిన్లకంటె సదాశివాన్నే ఎక్కువగా గుర్తుంచుకుంటారు. ఇది సదాశివం మార్కు చిత్రం అని చూసినవెంటనే చెప్పేయొచ్చు.

సదాశివం శివభక్తుడు. అందుకే ఆయన తీసిన ప్రతీ చిత్రంలోనూ—సదాశివం స్వయంగా శివార్చన చేస్తున్న దృశ్యం తర్వాతనే టైటిల్సు ప్రారంభమవుతాయి.

ఇంతవరకూ సదాశివం అన్నీ సాంఘిక చిత్రాలే తీశాడు. వాటిలో ఒక్కటి కూడా ఫెయిల్ కాలేదు. అయితే ఇటీవల ప్రేక్షకుల అభిరుచిని నిర్ణయించడం కష్టంగా వుంటోంది. ఏ చిత్రం ఎందుకు హిట్టవుతుందో, ఏది ఎందుకు ఫెయిలవుతోందో ఎవరూ చెప్పలేకపోతున్నారు.

సదాశివం చిత్రాలకు మినిమమ్ గ్యారంటీ వుంది. అయినా ఆయనకు భయంగానే వుంటోం దిటీవల. బడ్జెట్ చిత్రాలు తీద్దామా అంటే ప్రిస్టేజికి భంగం. భారీ చిత్రాలు వరుసగా రెండు ఫెయిలయ్యాయంటే నిర్మాతకు పేరు పోతుంది. ఆర్థికంగా పతనమూతప్పదు. ఈ విధమైన ఆలోచనలే ఆయనదృష్టిని పౌరాణిక చిత్రాలవైపు మళ్ళించాయి.

తను నిత్యమూ ఆరాధించుకునే శివుడి కారణంగానే తానింతటివాడినైనాననీ—ఆ మహాదేవుడి లీలల నింత వరకూ సరైన చిత్రరూపంలో ఎవరూ తీయలేదనీ ఆయనకు తోచింది. అటు భగవంతుణ్ణి తృప్తిపరచినట్లూ వుంటుంది—ఇటు చిత్రవిజయావకాశాలూ ఎక్కువుంటాయనే నమ్మకంతో ఆయన వెంటనే భారీ ఎత్తున—"పరమ శివుడు" అనే పౌరాణిక చిత్రం తీయనున్నట్లు పత్రికల వారికి తెలియబరిచాడు.

సదాశివం చిత్రం ప్రారంభించడమంటే అది మామూలు విషయం కాదు. ముందుగా కథ గురించే పెద్ద హడావుడి చేయాలి

ఒక నెలరోజులపాటు సదాశివం స్వయంగా దేశంలోని ప్రముఖ విద్యాలయాల్నీ, శివాలయాల్నీ సందర్శించాడు.

అందుకాయన ప్రత్యేకమైన స్వంత విమానా న్నుపయో గించుకున్నాడు. శివుడి గురించి ప్రచారంలోవున్న కథలను ఒక్కటి కూడా వదిలిపెట్టకుండా సేకరించాడు. ఆయన తన విమాన యాత్రలో తెలుసుకున్న దేమిటంటే—శివుడి గురించి ఎన్నో విశేషాలింకా తెరకెక్కవలసి ఉంది.

"పరమ శివుడు" కథను—ప్రజలను సంభ్రమాశ్చర్యా లలో ముంచెత్తేంత నూతనంగా తయారుచేయవచ్చు. అంతేకాదు—చాలామంది కిలా ఈ చిత్రాన్ని స్టూడియోలో తీయనవసరంలేదు. చాలావరకూ అవుట్‌డోర్లోనే తీయ వచ్చు. ఒక పౌరాణిక చిత్రాన్ని చాలాభాగం అవుట్‌డోర్‌లో తీయాలనుకోవడం గొప్ప సాహసమే అవుతుంది. కానీ సాహసంలేనిదే సదాశివం చిత్రంలో విశేష మేముంటుంది?

తను సేకరించిన సమాచారాన్ని అష్టాదశ పురాణాల తోటీ, నాలుగు వేదాలతోటీ, రామాయణ భారత భాగవతాల తోటీ, ఉపనిషత్తులతోటీ పోల్చి సారవంతమూ, రస వంతమూ అయిన కథను తయారుచేయడాని కాయన— "శివగోష్ఠి" పేరిట ఒక సారస్వత సభ నేర్పరచి సమర్థు లైన కవులనూ, రచయితలనూ దానికి ఆహ్వానించాడు. ఆ "శివ గోష్ఠి"కే లక్షరూపాయల ఖర్చయిందనీ, అదొక అద్భుత సారస్వత గోష్ఠి అనీ ఎన్నో పత్రికలు రాశాయి. శివగోష్ఠి విశేషాలను పోటీలతోసహా ప్రచురించాయి.

"శివగోష్ఠి"—ప్రజల్లో సంచలనం రేకెత్తించింది. శివ గోష్ఠి అనంతరం—"పరమశివుడు" చిత్ర కథ—స్క్రిప్టు తయారుచేయడానికి ఇద్దరు కవులు, ముగ్గురు రచయితలను నియమించాడు సదాశివం.

చిత్ర నిర్మాణాని కింత హడావుడి జరుగుతున్న సమ యంలో—పరమశివుడి పాత్ర కెవరి నెన్నుకోవాలా అన్న

చర్చలు ప్రారంభమయ్యాయి. సదాశివం ఈ పాత్ర కెవరి నెన్నుకుంటాడో—ఎందు కెన్నుకుంటాడో ఊహించవల పిందిగా కొన్ని పత్రికలు ఆకర్షణీయమైన పోటీ శీర్షికలు కూడా నిర్వహించాయి.

అయితే ఈ విషయంలో సదాశివం ఎక్కువగా ఆలో చించలేదు.

పౌరాణిక పాత్రలను ధరించి వాటికి కొత్తవిలువల నాపాదించి ప్రజల మెప్పును పొందడంలో తనకు తనే సాటి అని పేరుబడ్డ రవికుమార్—సదాశివం మిత్ర బృందంలోనివాడే! అయితే రవికుమార్ కిప్పుడు వయసు ముదురుతోంది. పరమశివుణ్ణి నూనూగు మీసాల నూత్న యౌవనుడిగా చూపవలసిన దృశ్యాలు కొన్ని చిత్రంలో ఉన్నాయి. అప్పు డా పాత్రకు రవికుమార్ బొత్తిగా సరి పోడు. బాల్యంలో ఒక నటుణ్ణీ యౌవనంలో మరో నటుణ్ణీ చూపితే ప్రేక్షకు లాదరిస్తారుగానీ—యౌవనంలో ఒక నటుణ్ణీ, నడివయసులో మరో నటుణ్ణీ చిత్రాలలో చూపడం అరుదుగా జరుగుతుంది.

అనవసరపు టపార్థాలకూ, రాజకీయాలకూ దారితీయ కుండా వుండడానికి సదాశివం ముందుగా చిత్రకథను రవి కుమార్‌కి వినిపించాడు. అతడు చిత్రకథను విని—"ఈ చిత్రాన్ని మీరు పదిసంవత్సరాలముందు తలపెట్టివుంటే నేను కొంత న్యాయం చేకూర్చగలిగేవాణ్ణి"—అన్నాడు.

"అది నా దురదృష్టం—" అన్నాడు సదాశివం,

"ఇందులో మీ దురదృష్ట మేమీలేదు. దురదృష్టం నాదే!" అన్నాడు రవికుమార్-"మీరీ రోల్‌కు మనోహర్ని బుక్ చేయండి."

"మీమాట నాకు శిరోధార్యం-" అన్నాడు సదాశివం

సంతోషంగా.

పిసీ ఫీల్డులో వున్న విశేషమదే! అక్కడ ఎవరికేం కావాలో అందరికీ బాగా తెలుసు. సదాశివం మనసులో ఏముందో తెలుసుకుని రవికుమార్ ఆ మాటే చెప్పాడు. రవికుమార్ చేత ఆ మాట చెప్పించడానికే సదాశివం అక్కడకు వచ్చాడు.

మనోహర్ చిత్రజగత్తులో అడుగుపెట్టి ఇప్పటికి మూడు సంవత్సరాలైంది. అతడిది మంచి విగ్రహం. చక్కటి ఉచ్చారణ. నటనలో అతడు రవికుమార్ అడుగుజాడల్లోనే నడుస్తున్నాడు భవిష్యత్తులో తానులేని లోటును పూడ్చ గలిగినది మనోహర్ మాత్రమేనని రవికుమార్ పాత్రికేయు లకు చెప్పివున్నాడు. ఆ మాటకెంతో ప్రచారం లభించింది. మనోహర్ భవిష్యత్తుకది బంగారు బాటవేసింది.

అందుకేనేమో మనోహర్ తన ఆరాధ్య దైవాలపేర్లు చెబుతూ—"భూకైలాసంలో రవికుమార్, కైలాసంలో పరమశివుడు" అన్నాడు.

ఎంతో హడావుడి జరుగుతూ ప్రేక్షక లోకంలో సంచ లనాన్ని సృష్టిస్తున్న పరమశివుడు చిత్రంలో తనకు కథా నాయకుడి పాత్ర లభించినందుకు మనోహర్ పొంగి పోయాడు. అందులోనూ సదాశివం చిత్రంలో అవకాశం లభించడం అదే మొదటిసారతడికి!

తనకువలెనే మనోహర్ కూడా శివభక్తుడు కావడం— సదాశివానికి సంతృప్తిసీ, సంతోషాన్నీ కలిగించింది.

ఇద్దరూ స్క్రిప్టుగురించి బాగా చర్చించారు.

"అన్నీ ముందే సిద్ధంచేసుకుని ఏకబిగిని రెండునెలల్లో చిత్రాన్నిపూర్తి చేద్దామనుకుంటున్నాను—" అన్నాడు సదాశివం మనోహర్‌తో.

"అదే బాగుంటుంది. ఈలోగా నన్ను నేను పరిశుద్ధుణ్ణి చేసుకుంటాను. షూటింగుకు వారం రోజులు ముందు నుంచీ మద్యం మానేస్తాను. వ్యాయామం మానేస్తాను. ప్రతిరోజూ జపంచేస్తాను. మాంసాహారం ముట్టను. పవిత్రమైన జీవితం గడుపుతూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ నిష్ఠగా వుంటాను. అదే నన్ను పరమశివుడి పాత్రకు సంసిద్ధుణ్ణి చేస్తుంది. షూటింగు ప్రారంభమై ముగిసేవరకూ నేనీ పద్ధతిని కొనసాగిస్తాను. అంటే సుమారు పదివారాలు నేను ఇతర చిత్రాల షూటింగుల్లో పాల్గొనను. ఆ విధంగా ఈ పాత్రకు న్యాయం చేయగలననుకుంటున్నాను—" అన్నాడు మనోహర్.

"నీ సిన్సియారిటీ మెచ్చుకోతగ్గది. నీ కా పరమశివుడి దీవెనలు లభిస్తాయి. మన చిత్రవిజయమూ, నీకు పేరు ప్రఖ్యాతులూ తథ్యం—" అంటూ సదాశివం మనోహర్ని మెచ్చుకున్నాడు.

పరమశివుడి పాత్రగురించి మనోహర్ అవలంబిస్తున్న నిష్ఠగురించి పత్రికలన్నీ ఫొటోలతో సహా ప్రచురించాయి. ఆ పాత్రపట్ల అతడికి గల భక్తిశ్రద్ధల నాకాశానికెత్తేస్తూ వర్ణించాయి. అయితే మనోహర్ ప్రచారంకోసంకాక నిజంగానే నిష్ఠను పాటించాడు.

భారీ ప్రయత్నాలలో మేలు తారాగణంతో పరమశివుడు చిత్రం తయారవుతోంది. తెలుగు చలనచిత్ర రంగానికదొక అపూర్వకానుక అని పత్రికలు అభివర్ణిస్తున్నాయి. ఆ చిత్రం షూటింగు వివరాలు చదువుతూ ప్రజలు వెర్రెత్తిపోతున్నారు. అలనాడు భారతదేశానికి స్వాతంత్ర్య మెప్పుడొస్తుందా అని మహాత్మాగాంధీవంటి నాయకులెదురు చూసినంత ఆత్రుతగా జనం పరమశివుడు చిత్రం విడుదలకోసం

ఎదురు చూస్తున్నారు. ఆఫీసుల్లో, విద్యాలయాల్లో, క్లబ్బుల్లో. మహిళామండలిలో,—ఇలా ఎక్కడ చూసినా ఆ సినిమాగురించిన చర్చలే!

మొత్తంమీద పరమశివుడు చిత్రం పూర్తిఅయింది. పూర్తిరంగులతో తయారైన ఆ సినిమాస్కోప్ చిత్రం ఒక శుభముహూర్తాన భారీ ప్రచారంతో విడుదలై ప్రజల మధ్యకు వచ్చింది.

నిజంగానే అది తెలుగువారు గర్వించదగ్గ చిత్రం. ఏభాష వారికైనా—ఇది మా భాషవారు తీసిన చిత్రమని సగర్వంగా చెప్పుకోతగ్గ చిత్రం. ఖండ ఖండాంతరాలలో భారతజాతికీ, హిందూమతానికీ పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టే చిత్రం.

ఎందరో కళాకారులు కలిసి ఎంతో కళాత్మకంగా తయారుచేసిన ఆ చిత్రాన్ని చూస్తూన్నప్పుడు—అందరూ తామున్న కాలాన్ని మరిచిపోయి—పురాణయుగంలోకి వెళ్ళిపోయారు. ఆచిత్రంలో మనోహర్ మనోహర్‌గాకాక పరమశివుడుగానే అందరకూ గోచరించాడు. పండితులు, పామరులు వేనోళ్ళ కొనియాడుతూండగా ఆ చిత్రంతెలుగు దేశంలో విజయభేరి మ్రోగిస్తోంది. ఎన్నిభాషలవారో ఆ చిత్రాన్ని డబ్బింగుకు అడుగుతున్నారు. అంతవరకూ వసూళ్ళ విషయంలో వున్న అన్ని రికార్డులనూ ఆ చిత్రం అధిగమించింది. వాటంచూస్తే అది ఏళ్ళ తరబడి ఆడేలాగుంది.

పరమశివుడు చిత్రంవల్ల సమాశివానికి చేకూరిన లాభం పెద్దగా ఏమీలేదు. చిత్ర నిర్మాతగా ఆయనకున్న పేరు మరి కాస్త పెరిగింది. అప్పటికే అదుపులేకుండా వున్న ఆస్తి పాస్తులు మరికాస్త పెరిగాయి.

ఈ చిత్రంవల్ల పూర్తిలాభం పొందినవాడు మనోహర్. అతడీ చిత్రంతో సూపర్‌స్టారైపోయాడు. ప్రేక్షకుల్లో అతడి

ఇమేజ్ బాగా పెరిగిపోయింది. నిర్మాతల్లో అతడి విలువ ఏ హీరోకూ లేనంతగా పెరిగింది.

ఇప్పుడు మనోహర్ ఒక్కసారిగా పాతిక చిత్రాల్లో నటిస్తున్నాడు. కాల్‌షీట్లు ఇవ్వలేక కొన్ని చిత్రాలు వదులుకున్నాడు కూడా. కొందరు నిర్మాతలైతే అతడెప్పుడు ఊఁ అంటే అప్పుడేనని సంవత్సరాల తరబడి ఎదురు చూడ్డానికి సిద్ధంగా వున్నారు.

పరమశివుడు చిత్రం శతదినోత్సవం జరుపుకుంది. అప్పుడు మనోహర్, సదాశివం ఆ వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర సంచారం చేశారు. ఆ యా ప్రాంతాల్లో మాట్లాడేటప్పుడు సదాశివం—"ఈ రోజు నే నీ స్థితికి రావడానికి కారణం నా ఆరాధ్యదైవం పరమశివుడు. చంద్రుడికో నూలుపోగులా ఆ లీలామానుషవిగ్రహుడికీ చిత్రాన్ని కానుకగా సమర్పించుకున్నాను. నా ప్రయత్నం ఫలించిందంటే ఆ భగవానుడు నా ప్రయత్నాన్ని అభినందించినట్లుగా భావిస్తున్నాను ఆయన సంకల్పంలేనిదే ఈ ప్రపంచంలో ఏమీ జరుగదుకదా!" అన్నాడు.

మనోహర్ తనూ మాట్లాడుతూ—"భగవదనుగ్రహం వల్ల నాకు నటించగల శక్తివుంది. ఆ శక్తితో ఇంతకాలం మిమ్మల్నందర్నీ మెప్పించగలిగాను. అయితే ఇంతకాలం నేను చూపిన నటన ఒకఎత్తు. పరమశివుడు పాత్ర ఒక ఎత్తు. నేను సామాన్య మానవుణ్ణి. ఆయన అసాధారణుడు. ఈ విశ్వాన్నే ఆయన శాసిస్తున్నాడు ఇంటి యిల్లాలినే శాసించలేని అల్పజీవిని నేను. ఆ పాత్రను పోషించడం నా వల్ల నవుతుందా? అందుకే నేను కఠోరనియమాల ననుసరించి నన్ను నేను పవిత్రంగా ఉంచుకుంటూ ఆ దేవాది దేవుణ్ణి ఆహ్వానించాను. ఆయన నన్నావహించాడు.

అందుకే పరమశివుడి పాత్రలో అందరికీ నేను పరమ శివుడిగానే గోచరించాను. ఇకముందు కూడా ప్రతిపాత్రకూ —ఆ పాత్రకు సంబంధించిన నియమాలు పాటిస్తూ ఇలాగే నటనాజీవితాన్ని కొనసాగించగలనని మీ అందరికీ మాట యిస్తున్నాను—" అన్నాడు.

ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు.

తర్వాత "పరమశివుడు" రజతోత్సవం చేసుకుంది. స్వర్ణోత్సవం, వజ్రోత్సవం—ఇంకా యెన్ని వుత్సవాలు చేసుకుంటుందో చెప్పలేము. విడుదలైన చాలా కేంద్రాల్లో ఆ చిత్రం ఇంకా నడుస్తూనే వుంది

అయితే మనమిప్పుడు చెప్పుకోబోయే కథకిది ఉపోద్ఘాతం మాత్రమే! ఈ కథ కింత ఉపోద్ఘాత మెందుకూ అనుకునేవారికి ముందు కథ బదులిస్తుంది.

2

జగన్నాథం నిజంగా గొప్పవాడు. నిజంగా గొప్పవాడని ఎందుకనాల్సొచ్చిందంటే—నిజమైన గొప్ప వాళ్ళు ప్రచారాన్నాశించరు. ఫలితాల నాశించి పనులు చేయరు. ఎప్పుడూ మంచి పనులే చేస్తారు. అటుపైన జీవితంలో దెబ్బతింటాడు కూడా!

జగన్నాథం విషయంలో యివన్నీ జరిగాయి. ఆయనకు లెక్కలేనంత ఆస్తి వుండేది. ఆయనకు దురలవాట్లు లేవు. కూర్చుని తింటే కొండలన్నా కరగొచ్చు కానీ ఆయన ఆస్తి తరగదు. అలాంటి ఆస్తి కరిగిపోయిందంటే అందుకో కారణముంది. జగన్నాథం కూర్చుని తినడానికి బదులు కూర్చుని పంచిపెట్టాడు.

అవసరంలో ఉన్నవాళ్ళను ఆదుకుంటున్నానని ఆయననుకున్నాడు. ఆయనచేత ఆదుకోబడాలంటే అవసరం

కల్పించుకుంటే చాలునని ఇతరు లనుకున్నారు. ఆ విధంగా ఆయన ఆస్తిని కూర్చుని తినేవాళ్ళ సంఖ్య ఒకటి నుంచి పదుల్లోకి వందల్లోకి యింకా చెప్పాలంటే వేలల్లోకి కూడా పాకింది.

భారత ప్రజలందరూ సమంగా పంచుకునే మాటైతే బిర్లా టాటాల ఆస్తి కూడా ఏ మూలకీ చాలదు. ఇక జగన్నాధంగారి దెంత?

ఆయన పేరు చెప్పి ఎందరో పేదవిద్యార్థులు చదువుకుని పైకొచ్చారు. ఎందరో వ్యాపారస్థులకు పెట్టుబడి లభించింది. ఆయన సాయం పొందని వ్యక్తి తెలుగుదేశంలో ఏ రంగంలోనూ లేడు.

జగన్నాధానిది జాలిగుండె. ఆయనకు మనుషులమీద నమ్మకం. ఈ రెండూ కలిపి ఆయన ఆస్తి కరిగించేసరికి ఆయనకు జాలిగుండె మాత్రమే మిగిలింది మనుషులమీద నమ్మకం పోయింది.

జగన్నాధాని కిద్దరే పిల్లలు. పెద్దవాడు సూర్యారావు. అమ్మాయి కుసుమ.

సూర్యారావు తండ్రి నెప్పుడూ యెదిరించలేదు కానీ తండ్రి తీరతడికి నచ్చలేదు. అతడి చిన్నతనమెంతో వైభవంగా గడిచింది అతడి చదువు బియ్యేలయ్యేసరికి తండ్రి పూర్తిగా దివాలా తీశాడు.

తమ ఆస్తంతా యెలా పోయిందో అతడికి తెలుసు. అదింక రాదనీ తెలుసు. వాటికతడు భయపడలేదు. తండ్రి తమ యింట్లో ఒక వాతావరణాన్ని సృష్టించాడు అడవుల పాలైన హరిశ్చంద్రుడి జీవితానికీ వనవాసానికి వెళ్ళిన రాముడి జీవితానికీ తేడా వుంది.

రాముడు అడవుల్లో లక్ష్మణుడి సేవ లందుకుంటూ

సీతతో సుఖిస్తూ హాయిగా రోజులు గడిపాడు. రావణుడు సీతను బలవంతంగా ఎత్తుకుని పోయాడు తప్పితే అందుకు శ్రీరాముడి ఆమోదం లేదు. హరిశ్చంద్రుడు అడవుల్లో అనుక్షణం నక్షత్రకుడి నోట దుర్భాషలు విన్నాడు. ఆలినీ, కొడుకునీ తనే అమ్ముకున్నాడు.

అది పురాణయుగం కాబట్టి కథ అక్కడితో ఆగి పోకుండా హరిశ్చంద్రుడి మెడలో పూలమాలలు పడ్డాయి. ఇప్పుడు మనిషి తన్ను తాను అమ్ముకోవడంతో కథ ముగిసిపోతుంది.

తమ కుటుంబానికి హరిశ్చంద్రుడి జీవితమే రాసిపెట్టి వున్నదని అతడు వ్యథ చెందసాగాడు. తరచుగా అత డా మాటలు చెల్లెలు కుసుమవద్ద అనేవాడు.

"నువ్వు దిగులుపడకు. మంచికి సమాజం సన్మానం చేయదు. కానీ మంచికి చేసినవాడికి తప్పక మేలు జరుగు తుంది. ఎందుకంటే వారికి దేవతల దీవెన లుంటాయి—" అనేది కుసుమ అతడితో.

"దేవతల క్కూడా ప్రచారం కావాలి చెల్లాయ్! ఎవరి వల్ల తమకు ప్రచారంలభిస్తుందో వారినే దేవతలు దీవిస్తారు. మంచిపనులు చేస్తే సరిపోదు. మనం చేసే పనులు మనకు మించి దేవతలకు పేరు తీసుకురావాలి. మన మలాంటి పని ఒక్కటీ చేయలేదు. ఏ దేవతా మనను దీవించదు—" అనేవాడు సూర్యారావు.

అతడి అభిప్రాయాల్లో నిజమెంతుందో చెప్పలేం కానీ- అతడొక కారు యాక్సిడెంట్లో మరణించాడు. అది యాక్సి డెంటు కాదనీ—నిరాశా నిస్పృహలతో ఆత్మహత్య చేసు కున్నాడనీ కొందరనుకున్నారు.

ఎవరేమనుకున్నా చెట్టంత కొడుకు దుర్మరణం జగ

న్నాథాన్ని బాగా కృంగదీసింది. ఆయన బెంగతో మంచం పట్టాడు. అప్పుడాయన్ను చూడ్డానికి చాలామంది వచ్చారు. వారిలో సదాశివం కూడా వున్నాడు.

సదాశివానికి ఒకప్పుడు తల్లీ తండ్రీ లేక నా అన్నవా ళ్ళెవ్వరూ ఆదుకోకుండా వదిలేసిన సమయంలో జగన్నాథం అతడికి ఆశ్రయమిచ్చి బియ్యేవరకూ చదివించి ఉద్యోగం వేయించాడు. ఆ ఉద్యోగరీత్యానే అతడు నిలదొక్కుకుని క్రమంగా స్టుడియోల్లో ప్రవేశించి స్వశక్తితో ఇంతవా డయ్యాడు

ప్రస్తుతం జగన్నాథమున్న పరిస్థితుల గురించి తనకేమీ తెలియనట్లుగా మాట్లాడినప్పటికీ—ఆయన పరిస్థితికి సదా శివం చలించిపోయాడు

"ఇది చాలా అన్యాయం—మేమంతా ఏమైపోయామను కున్నారు? ఒక్కమాట నా చెవిన వేస్తే మిమ్మల్ని హంస తూలికాతల్పాలమీద పడుకోబెట్టి అప్సరసలచేత పరిచర్యలు చేయించేవాణ్ణి కదా—" అంటూ అలవాటైన సినిమా డైలాగు చెప్పేవాడతడు.

"నాకు హంసతూలికాతల్పాలు, అప్సరసలు అవసరం లేదు ఒకరికి సాయపడడమే కానీ ఒకరి సాయమడిగి యెరుగను నేను. ఇప్పటికీ నాకు జీవితం గురించి యే బెంగా లేదు అమ్మాయి కుసుమ గురించే నా బాధంతా!" అన్నాడు జగన్నాథం.

"మీ బెంగేమిటో చెప్పండి. అమ్మాయికి పెళ్ళి చేయాలా—అది నా బాధ్యత అనుకోండి—" అన్నాడు సదాశివం. ఆయన అందుకు్కాడా అంగీకరించడని సదా శివం నమ్మకం. అందుకే ధైర్యంగా ఆ మాటలనగలిగాడు.

ఎవరైనా పైకి రావడానికి ఎందరో కారణభూతు లవు

తారు. అందర్నీ గుర్తుంచుకుని ఋణం తీర్చుకోవాలను కున్నవాడు పళ్ళీ క్రిందకు రాక తప్పదు. పైకి పోతున్న వాడికి కింద చూపుండకూడదన్నది సదాశివం సిద్ధాంతం.

వెంటనే కుసుమ ఆ సంభాషణలో కలగజేసుకుని—

"నాన్నకున్న ఏకైక ఆలంబన నేను. నాకు పెళ్ళి జరిగితే నాన్న ఏకాకి అయిపోతాడు. ఇప్పట్లో నేను పెళ్ళి చేసుకోను...." అంది.

"అయితే మా యింటికి వచ్చి మా కుటుంబసభ్యుల్లో ఒకరుగా వుండండి—" అన్నాడు సదాశివం లోపల భయపడుతున్నా పైకి తడకుండా.

"నా కాళ్ళమీద నేను నిలబడే అవకాశ మిప్పించం డంకుల్! ప్రస్తుతాని కదొక్కటే మీరు మాకు చేయగల ఉపకారం—" అంది కుసుమ.

"అందుకు నేనేం చేయగలనో కూడా నువ్వే చెప్పు!" అన్నాడు సదాశివం.

"నాకు సినిమాల్లో అవకాశ మిప్పించం డంకుల్!" అంది కుసుమ.

కుసుమ కను, ముక్కుతీరు బాగుంటుంది. ఏ అలంకరణా లేకుండానే అందంగా వుంటుందామె. అటుపైన తీయని గొంతు. జగన్నాధం కుటుంబసంస్కారం వలన ఆమెలో రాచఠీవి కూడా వుంది. చిత్రసీమకు అరుదైన నటి అవుతుంది.

సినీఫీల్డనగానే జగన్నాధం అంగీకరించలేదు. అది స్త్రీలు ప్రవేశించాల్సిన రంగంకాదని ఆయన అభ్యంతరంచెప్పాడు. కళాసేవలో అటువంటి భావన వుండరాదనీ—స్త్రీలెందరో సినీరంగంలో వున్నారనీ వారందరికీ దేశంనిండా

గౌరవప్రతిష్ఠలున్నాయని సదాశివం జగన్నాధానికి నచ్చజెప్పాడు. అప్పుడు కుసుమ కలగజేసుకుని — "నాన్నా! సినీరంగంలో డబ్బుకోసం, పేరుకోసం—ఎందరో ఆడవాళ్ళు ప్రవేశిస్తున్నారు. అందుకోసం వారేమైనా చేయవలసి వచ్చే సందర్భాలూ ఉంటాయి. కానీ మన విషయంలో అలా కాదు. మనకు అవసరానికి మించిన డబ్బక్కర్లేదు. పేరు గురించి బాధలేదు. నాలో నటనా సామర్థ్యముంది. పాత్రలకోసం నేను కాని పనులు చేయనవసరం లేదు. మనకు అంకుల్ ద్వారా పాత్రలు లభిస్తాయి. ఆ విధంగా ఎంతో గౌరవంగా బ్రతకొచ్చు" అంది.

"అమ్మాయి పరిస్థితి నర్ధం చేసుకుని చక్కగా చెప్పింది" అన్నాడు సదాశివం.

ఏమనుకున్నాడో జగన్నాధం అందుకంగీకరించాడు.

సదాశివం రికమెండేషన్ వల్ల కుసుమకు అయిదారు చిత్రాల్లో పాత్రలువచ్చాయి. ఆ పాత్రలు చిన్నవే అయినప్పటికీ సమర్థురాలైన నటిగా ఆమెకు కొంత పేరు వచ్చింది.

చూసిచూసి కుసుమవంటి అమ్మాయికి పెద్ద పాత్రనివ్వలేడు. తన చిత్రాల్లో చిన్న పాత్రలకు బుక్ చేస్తే బాగుండదు. అందుకే సదాశివం ఆమెకు ఇతరుల చిత్రాల్లో అవకాశ మిప్పించాడు. అయినప్పటికీ ఆయనకు బోలెడు పేరు ప్రఖ్యాతులు వచ్చాయి.

ఒకనాడు తన నాదుకున్న వ్యక్తిని గుర్తుంచుకుని కష్టకాలంలో ఆదుకున్న సదాశివం ఔదార్యాన్నీ, కృతజ్ఞతా భావాన్నీ పత్రికలు పలురకాలుగా ప్రశంసించాయి. ఈ విశేషం ప్రచారం కావడానికి సదాశివం కూడా తెర వెనుక నుంచి కృషిచేశాడు.

మంచినటిగా కుసుమకు కాస్త పేరు రాగానే సదాశివమే

ఆమెకో మంచి అవకాశ మివ్వచ్చుగదా అని నలుగురూ అనుకోసాగారు. ఆయన అవకాశ మివ్వకపోతే ఆమెకిక భవిష్యత్తుండదన్న టాక్ కూడా వచ్చింది.

అలాంటి పరిస్థితుల్లో సదాశివం తన చిత్రంలో కుసుమను బుక్ చేశాడు. అదీ ఆయన పరమశివుడు చిత్రం నడుస్తూండగానే ప్రారంభించాలనుకున్న సాంఘిక చిత్రంలో. అందులో హీరో మనోహర్. హీరో చెల్లెలి పాత్ర కుసుమది ఆ పాత్రకు చిత్రంలో హీరోయిన్‌కు మించిన ప్రాధాన్యత ఉంటుంది.

అయితే ఇక్కడే అనుకోని ఇబ్బంది వచ్చింది.

3

మనోహర్ సదాశివాన్ని కలుసుకుని — "మీరు నాకు గురుతుల్యులు. మీవల్ల నేనీ స్థితికి వచ్చాను. కానీ ఈ చిత్రంలో చెల్లెలు పాత్రకు బుక్ చేయబడిన కుసుమ అంటే నాకు ఎలర్జీ. సినిమా అంతా ఆ పాత్ర పట్ల ప్రేమాభిమానాలనూ ఆత్మీయతనూ నేను ప్రదర్శించవలసి వుంది. ఆమెను తొలగించి వేరెవరినైనా ఆ పాత్రకు ఎన్నుకుంటే తప్ప నేను నా పాత్రకు న్యాయం చేకూర్చలేనని భయంగా వుంది—" అన్నాడు.

సదాశివం దెబ్బతిన్నాడు. ఇదాయనకూహించని పరిణామం. మామూలుగా అయితే ఇదంత పెద్ద సమస్యకాదు. కుసుమ మంచి నటే కానీ ప్రముఖ నటి కాదు. ఆమెను తప్పించడం వల్ల చిత్రానికేం నష్టముండదు. ఉన్న బాధల్లా ఆమె జగన్నాధానికి కూతురు కావడం!

సినీఫీల్డులో అంతా గాలివాటం. అదృష్టం బాగున్నవారి చుట్టూ అందరూ తిరక్క తప్పదు. మనోహర్ సదాశివాన్ని గురుతుల్యుడనవచ్చు. కానీ కుసుమను చిత్రం నుంచి తొల

గించకపోతే వారిద్దరికీ చెడిపోవడం తథ్యం. ఒక్క కుసుమ కోసం వ్యవహారాన్నంత దూరం వెళ్ళనివ్వడం సదాశివాని కిష్టం లేదు.

ఆయన బాగా ఆలోచించి కుసుమను తన చిత్రంలోంచి తీసేయాలని నిర్ణయించుకున్నాడు. జాప్యం చేయకుండా ఆ విషయమామెకు తెలియబరిచాడు.

కుసుమ దెబ్బతిని—"ఈ పాత్రమీదా, ఈ చిత్రంమీదా చాలా ఆశలు పెట్టుకున్నాను. మీవల్లనే నాకు సినీనటి అయ్యే అవకాశం వచ్చింది. మీ చేతుల్లోనే నా భవిష్యత్తును నాశనం చేయకండి" అంది.

"ఇందులో నేనేమీ చేయగలిగింది లేదు" అన్నాడు సదాశివం.

కుసుమ తండ్రివద్దకు వెళ్ళి జరిగింది చెప్పుకుని—"ఓ గొప్ప అవకాశం వచ్చినట్లే వచ్చి నా చేయిజారిపోతుంది. ఇది పోనిచ్చానంటే అధఃపాతాళానికి కృంగిపోతాను. మీరు చెబితే ఆయన కాదనడు. ఎలాగో ఆయనకు నచ్చజెప్పి నా భవిష్యత్తుకు బంగారు బాట వేయండి—" అంది.

జగన్నాథం ముందు నిర్లిప్తంగా ఉన్నా కూతురిబాధలో అర్థముందన్న విషయం తర్వాత గుర్తించాడు. ఆయన కుసుమను తీసుకుని సదాశివం ఇంటికి వెళ్ళాడు. సదాశివం ఆయనకు సకల మర్యాదలూచేసి—"మీ రాకతో ఈ యిల్లు పావనమైంది. నేను మీ దాసుణ్ణి. ఆజ్ఞాపించండి—" అన్నాడు.

"ఆజ్ఞాపించడమే ఎప్పుడూ నా అలవాటు. కానీ ఈ రోజు నిన్నర్థిస్తున్నాను. నా కూతురికి నీ సినిమాలో అవకాశం ఇప్పించు." అన్నాడు జగన్నాథం.

"నన్ను మన్నించి ఇంకేదైనా అడగండి." అన్నాడు

సదాశివం.

"దానికి అందముంది. నటనా సామర్థ్యముంది. మంచి విగ్రహముంది. శ్రావ్యమైన గొంతుంది. నీ కేమిటి అభ్యంతరం?" అన్నాడు జగన్నాథం.

"దయచేసి వివరాలడగొద్దు. నేను అసహాయుణ్ణి."

"అలాగనవద్దు నిన్నింతవాణ్ణి చేసినందుకు కృతజ్ఞతగా నాకీ సాయం చేసిపెట్టు" అన్నాడు జగన్నాథం.

అదాయన చేసిన పొరపాటు ఫలితాన్ని కోరే మంచి తనం గౌరవాన్ని కోల్పోతుంది. ఆయన మాటలు సదా శివం ధైర్యాన్ని పెంచాయి. అతడు సంకోచిస్తున్నట్లుగానే తా ననదల్చుకున్నది అన్నాడు.

"ప్రాజ్ఞులు మీరు. మీకు నేనేం చెప్పగలను? మీరు విత్తనం నాటారు. అంతవరకే మీరు చేయగలిగింది కూడా! మీరు నాటిన విత్తనం మామిడి అయితే మామిడి మొక్క మొలుస్తుంది. చిక్కుడు అయితే చిక్కుడుపాదు లేస్తుంది. నా జీవితం మీవల్ల నిలబడ్డమాట నిజం. అటు పైన నేను నా స్వశక్తితో పైకి వచ్చాను. మీచేత సాయ పడిన ప్రతి ఒక్కడూ నా దశకు చేరుకోలేకపోయాడుకదా! ఆ విషయ మలాగుంచండి. ఆర్థికంగా మీకు నేను సాయ పడుతునే వున్నాను. మీ అమ్మాయిని సినిమాల్లో నేనే నిల బెట్టాను. ఒకసారి నేను నిలబెట్టాక ఎంతసేపూ నా ఆసరా మీదే నిలబడాలని ఆమె అనుకుంటే—భవిష్యత్తుండదు...."

"నువ్వన్నది నిజమే! కానీ నువ్వే యిప్పుడు నా కూతుర్ని నిలబడకుండా తోసేస్తున్నావు. కాదంటావా?" అన్నాడు జగన్నాథం.

"కాదు...." అన్నాడు సదాశివం.

"అయితే దానికి నీ చిత్రంలో పాత్ర ఇవ్వడానికి

ఏమిటి నీ అభ్యంతరం?"

"మీ అమ్మాయికీ మా హీరోకీ పడడంలేదు. అతడు వద్దనడం వల్లనే ఆమెను తొలగించవలసివచ్చింది. ఇందులో నేను చేయగలిగిం దేమీలేదు. ఆ హీరో ఒప్పుకుంటే ఇప్పుడైనా నాకే అభ్యంతరమూ ఉండదు...." అన్నాడు సదాశివం.

జగన్నాథం ముఖం ఎర్రబడింది. "మనోహర్‌తో కుసుమకు గొడవెందుకొచ్చిందో నీకు తెలుసా?"

"జగన్నాథంగారూ—మీరు ప్రాజ్ఞులని మళ్ళీమళ్ళీ నేను చెప్పక్కర్లేదు. ఇది చలనచిత్ర రంగం. మడికట్టుక్కూర్చోవాలనుకునే వాళ్ళిందులో అడుగు పెట్టకూడదు. ఈ విషయం మనం ఎంతసేపు చర్చించినా ప్రయోజనముండదు. మీ రింకా మాట్లాడాలనుకుంటే కాసేపు నాకు సెలవు ఇప్పించక తప్పదు. నా అభివృద్ధికి కారకుడైన పరమశివుడి కిది పూజా సమయం" అన్నాడు సదాశివం.

"నువ్వెళ్ళి పూజచేసుకో—ఇంకేం మాట్లాడక్కర్లేదు." అంటూ లేచాడు జగన్నాథం.

ఆయన కుసుమతో-"నువ్వు సదాశివం మాటలువిన్నావు కదా—ఇంకా నీకు నటిగా నిలబడాలని ఉన్నదా?"అన్నాడు.

"ఉంది" అంది కుసుమ నెమ్మదిగా.

జగన్నాథం ఆశ్చర్యంగా—"నిజంగానా?" అన్నాడు.

"నాన్నా! ఈ ప్రపంచం డబ్బును దేవుడిగా భావించి నమస్కరిస్తుంది. ఆ డబ్బును మీ రలక్ష్యం చేశారు. చిత్రరంగంలో నాకు మంచి భవిష్యత్తుందని అంతర్వాణి చెబుతోంది. మీరు పోగొట్టుకున్నదంతా తిరిగి లభించాలంటే అందుకు చిత్రరంగమే దారిచూపగలదు. ఇందులో లబ్ధానికి నేనేమైనాసరే చేయాలనుకుంటున్నాను...."

అంది కుసుమ.

జగన్నాథం కోపంగా "నీ ఆలోచనలు నిన్ను అధః పాతాళానికి తీసుకుని వెడతాయి" అన్నాడు.

"నాన్నా! మీ రన్నీ మంచిపనులే చేశారు. అవి మిమ్మల్నెక్కడకు తీసుకుని వెళ్ళాయి? తన లక్ష్యం తనకు తెలియనప్పుడు తన గమ్యం తా నెరుగనప్పుడు మంచి చేసినా చెడుచేసినా మనిషికి పతనం తప్పదు. నాకు నా లక్ష్యమూ తెలుసు. నా గమ్యమూ తెలుసు. అందువల్ల నాకు పతనముండదు" అంది కుసుమ.

"ఇంత తెలిసినదానివి నీ కింకేమీ చెప్పలేను. నీ కెలా తోస్తే అలా చేయి...." అన్నాడు జగన్నాథం.

"నేను మనోహర్ని కలుసుకుని మాట్లాడతాను. నాకు మీ ఆశీర్వాదం కావాలి" అంది కుసుమ.

జగన్నాథం ఆమెను ఆశీర్వదించాడు. మనసులో మాత్రం ఏమేమో గొణుక్కున్నాడు.

4

"నేనంటే ఎందుకు నీ ఎలర్జీ?" అంది కుసుమ.

"అందని ద్రాక్షలు పులుపని నీకు తెలియదా?" అన్నాడు మనోహర్.

"నన్ను మన్నించు మనోహర్. నాకు నీ చిత్రంలో నీ పక్కన చెల్లెలిపాత్ర వేయాలనుంది పరమశివుడి పాత్ర కోసం పరమునిషను వహించిన అపురూప నటుడివి నువ్వు. నేనా పాత్ర వేయడానికి మనమేం చేయాలో చెప్పు...." అంది కుసుమ.

"ఇలాగా?" అన్నాడు మనోహర్.

కుసుమ అతడికి దగ్గరగా వెళ్ళింది.

"నేను చెప్పినట్లు వింటావా?" అన్నాడు మనోహర్.

కుసుమ తల ఊపింది.

"తెరపై నీవునా చెల్లివి. ఇక్కడ నీవు నా చెలివి...." అంటూ అతడామెను దగ్గరగా తీసుకున్నాడు.

"నేనంటే ఎలర్జీలేదా?" అంది కుసుమ.

"అందిన ద్రాక్ష తీయన...." అన్నాడు మనోహర్ ఆమెను బలంగా తన కౌగిలిలో బంధిస్తూ. కుసుమ అభ్యంతరం చెప్పలేదు.

సదాశివం చిత్రంలో కుసుమకు మనోహర్ చెల్లెలి పాత్ర లభించింది. ఆ చిత్రంలో అన్నాచెల్లెళ్ళుగా మనోహర్ కుసుమలు అత్యంత సహజంగా నటించినట్లు ప్రేక్షకులు భావించారు. ఆ చిత్ర విజయాన్ని పురస్కరించుకుని వారిద్దర్నీ అన్నా చెల్లెళ్ళ పాత్రల కెన్నికచేసి చాలా చిత్రాలు తయారవుతున్నా యిప్పుడు.

కుసుమ నటిగా నిలదొక్కుకుంది.

సదాశివం ఇప్పుడు మళ్ళీ మరో పౌరాణిక చిత్రం తీయాలనుకుంటున్నాడు. ఇప్పుడు మనోహర్ బిజీస్టార్ అయినప్పటికీ—మూడు నెలలపాటు నిష్ఠగావుండి కేవలం సదాశివం చిత్రంలోనే నటించడంకోసం తన కాల్‌షీట్లు అడ్జస్టు చేస్తున్నాడు. అదే సమయాన్నుపయోగించుకోవడం కోసం మరికొందరు చిత్ర నిర్మాతలు పౌరాణిక చిత్రాలను ప్లాన్ చేయసాగారు.

దేవతలకొకనీతి మనుషులకొకనీతి పాటించడం ఒక్క చలనచిత్ర రంగంలోనేకాదు అన్నిరంగాల్లోనూవుంది. ఎందుకంటే మనుషులు అసహాయులు. దేవతలైతే శపించగలరు, దీవించగలరు. మనోహర్. సదాశివం వంటి నిష్ఠాగరిష్ఠులను, పరమభక్తులను వారు సదా దీవిస్తూనే ఉంటారనడానికి ఈనాటి పవిత్ర భారతదేశమే సాక్ష్యం! □

'విపంచి'

మూడో నెంబర్ ఇల్లు



చలిగాలి విసురుగా వీస్తుంది.

భరించలేనంత విసురుగా—

చలి శరీరంలో వణుకు పుట్టిస్తోంది.

ఆ చుట్టుప్రక్కల ప్రాంతంలో ఎక్కడా చెట్లులేవు.

ఆకాశంలోకేసి చూసాను. ఆకాశం నల్లటి మబ్బుల ఆక్రమణలో వుంది. వర్షం ఏ క్షణాన్నైనా కురిసే ప్రమాదముంది.

ఆ విషయం నాకు బాగా తెలుసు.

అయినా ఏం చెయ్యలేని పరిస్థితి!

నేనక్కడ నిలబడక తప్పదు.

మరోమారు చల్లగాలి నన్ను తాకీ తాకనట్టు స్పృశించి, ముందుకి కదిలింది.

ప్యాంటు జేబులో చెయ్యిపెట్టాను.

అరనిమిషం తర్వాత నా చేతిలోకి బీడీలకట్ట, అగ్గిపెట్టె వచ్చింది.

బీడీ నోట్లోపెట్టుకుని, వెలిగించాను.

చివరకి సిగరెట్లనుండి బీడీలకి ఎలా దిగజారిపోయాను?

క్షణకాలం నా మీద నాకే జాలేసింది.

నా దగ్గర డబ్బులు అయిపోవచ్చు. మహావస్తే యింకో రెండు, మూడు రోజులు.

నాలుగో రోజు వుదయానికి డబ్బులు సంపాదించ లేకపోతే.... వూహించుకోవటం నాకిష్టం లేకపోయింది.

చీకటి బాగా ముసురుకొచ్చేసింది.

ఆ ప్రాంతంలో వీధి దీపాలు లేవు. కాని కరెంట్ వుంది — ఆ మూడోనంబర్ యింటిలో.

బీడీ త్రాగుతుంటే గుండెలనిండా వెచ్చదనం వచ్చింది.

పొగ వదుల్తూ, మూడోనంబర్ యింటికేసి తదేకంగా చూడసాగాను.

ఆ యింటి తలుపు దగ్గరకి వేసివుంది.

దక్షిణంవైపు కిటికిలోనుండి కన్పిస్తున్న ఆ అమ్మాయి తల....

ఆ అమ్మాయి అందానికి అర్థంలా వుంటుంది.

అఫ్‌కోర్స్, ఆవిడకి పెళ్ళయ్యింది!

పెళ్ళయ్యి బహుశా సంవత్సరం కూడా అయివుండదు.

నేనలా అనుకోవటానికి కారణం—వాళ్ళకి పిల్లలు లేకపోవటం.

ఆ చుట్టుపక్కల ప్రాంతంలో ఆ మూడోనంబర్ ఇల్లు మాత్రమే వుంది.

ఆకుపచ్చలోని చిన్నడాబా! ఇంటిచుట్టూ ఏవో పూల మొక్కలు, చెట్లు ..

ఆ మూడోనంబర్ యింటిచుట్టూ ఖాళీప్రదేశం .... విశాల మైన మైదానంలా వుంటుంది ఆ ప్రాంతం.

ఆ ప్రాంతం సమతలంగా వుండదు. అక్కడక్కడా మట్టి దిబ్బలు ...

ఆ డాబామీద 3/43 అనే అంకె చూసాను. అప్ప ట్నుండి ఆ డాబాని 'మూడోనంబర్ యిల్లు'గా వ్యవహరిం చటం ప్రారంభించాను.

ఆ మూడోనంబర్ యింటికి కొంచెం బాగా దూరంలో ఏవో గుడిసెలున్నాయి. ఆ గుడిసెవాసుల్లో ఏ ఒక్కడూ ఎట్టి పరిస్థితుల్లో మూడోనంబర్ యింటి దగ్గరకి రాడు.

ఇవీ నేను గత వారంరోజులుగా తెలుసుకున్న, తెలుసు కుంటున్న వివరాలు—

బీడీ అయిపోయింది.

దూరం నుండి స్కూటర్ శబ్దం లీలగా నా పాము చెవుల్లో ధ్వనించింది.

అంటే—అతను వస్తున్నాడు!

అతను ఆ మూడోనంబర్ యింటి యజమాని.

చకచకమని అడుగులు వేసాను—ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళిపోవడానికి.

కొంచెం దూరం వెళ్ళిన తర్వాత వెనక్కి తిరిగి చూశాను.

అతను యింటిముందు స్కూటర్ దిగుతున్నాడు. ఏదో బ్యాగ్‌తో యింట్లోకి నడిచాడు.

ఒక్కసారి నా గుండెలు గుబగుబలాడాయి.

ఇదే అవకాశం అన్పించింది.

అంతలోనే వివేకం నా మూర్ఖత్వాన్ని వారించింది.

నేనెట్టి పరిస్థితుల్లో తొందరపడకూడదు. ముఖ్యంగా వాళ్ళని ముఖాముఖీ దోచుకోకూడదు.

వాళ్ళు నా రూపురేఖల్ని గుర్తుపట్టడం నాకిష్టంలేదు.

నా ఖర్మ కాలితే, పట్టుబడటం అంతకన్నా యిష్టంలేదు.

ఈ మధ్య విపరీతంగా పోలీసులు నాగురించి వేట సాగిస్తున్నట్లు గురవయ్య చెప్పాడు.

అందుకే నా జాగ్రత్తలో నేనుంటున్నాను.

పోలీసులింతగా నా గురించి వెదికేవాళ్ళే కాదు—కాని నేను చేసిన వెధవపని వల్ల.

ఆ వెధవ పని—ఎస్పీ యింటిలో దొంగతనం చెయ్యటం.

పేరు గొప్ప, వూరు దిబ్బ అన్నట్లు ఆ ఎస్.పి. ఇంటిలో రెండువేలకన్నా ఎక్కువ దొరకలేదు.

దొంగతనం చేసినంతసేపు పట్టలేదు—ఖర్చుపెట్టటం.

ఆఖరి పదిరూపాయలు మాత్రం నా జేబులో వున్నాయి-ప్రస్తుతం.

పోసీ. కొన్నాళ్ళపాటు దొంగతనం చెయ్యకుండా అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోదామంటే....డబ్బు!

నాకు డబ్బు కావాలి!

ఈ పరిస్థితుల్లో నగరంలో దొంగతనం చెయ్యటం నాకు

ప్రమాదంగా పరిణమిస్తుంది.

ఆ భయంతోనే నగరానికి దూరంగా వున్న ఈ మూడో నంబర్ యింటిని ఎన్నుకొన్నాను.

అతడి వివరాలన్నీ సేకరించాను.

ఆ మూడోనంబర్ యింటి యజమాని పేరు రత్నాకర రావు. అతనికి "భాగ్యలక్ష్మి చిట్ ఫండ్స్" అనే స్వంత వ్యాపారముంది. రోజూ అతని కలెక్షన్ మూడువేలకి తక్కువుండదు.

ఆ మూడువేల రూపాయిలు యింటికి తీసుకొచ్చేస్తాడు- బూడిద రంగు బ్యాగ్‌లో.

మధ్యదారిలో కాపుకాసి, మూడువేలు కొట్టెయ్యడం పెద్ద కష్టం కాదు.

కాని రిస్క్ వుంది.

ఒక్కడ్ని—స్కూటర్ మీద వెళ్తున్న అతన్ని అటకా యించటం.

కేవలం మూడువేల కోసం రిస్క్ తీసుకోవటం నా కిష్టం లేకపోయింది.

ఎలాగైనా దోస్తే, ఆ మూడోనంబర్ యిల్లునే దోచుకో వాలని నిర్ణయించుకున్నాను.

రత్నాకరరావు భార్య వంటిమీద చాలా నగలున్నాయి. బహుశా డబ్బుకూడా ఎక్కువే వుండివుండాలి.

ప్రొద్దున్న తొమ్మిదిన్నరకి అతను స్కూటర్ మీద ఆఫీసుకి వెళ్తాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చి, వెళ్ళి మళ్ళీ సాయంత్రం ఆరు దాటుతుండగా వస్తాడు.

వారం రోజులగా రత్నాకరరావు దినచర్య యిదే:

భార్యనిగాని సినిమాకి తీసుకెళ్ళుంటే, నాకు అవకాశం చిక్కివుండేది—ఆ యింట్లో దొంగతనం చెయ్యడానికి.

"టప్!"

భుజంమీద పడిన వానచినుకులకి నా ఆలోచనలు చెల్లా చెదురైపోయాయి.

వర్షం కురవటం ప్రారంభించింది.

ఆకాశంలో ఓ మేఘం గర్జించింది. వర్షపు ధారలతో భూమి తన మొహాన్ని కడుక్కొంటుంది.

రెండు నిమిషాలకే తడిసి, ముద్దయిపోయాను.

వెనక్కి పరుగు ప్రారంభించాను.

తల దాచుకోడానికి ప్రదేశాన్ని వెదుక్కుంటూ.

పరిగెడుతున్నానన్న మాటే కాని నాలో ఆలోచనలు.

మూడో నంబర్ యిల్లుని ఎలా దోచుకోవడం? ఎలా??..!

మళ్ళీ మూడో నంబర్ యిల్లుని చేరుకొన్నాను. చేరుకొనే టప్పటికి బాగా తడిసిపోయాను. అప్పటికి కొంచెం వర్షపు వేగం తగ్గింది.

గుమ్మం దగ్గర నిలబడ్డాను.

అన్ని తలుపులు వెయ్యబడి వున్నాయి.

"చంద్రకళా! ఈ వాతావరణంలో యాలకుల టీ తాగితే అద్భుతంగా వుంటుంది. కొంచెం పెట్టు."

నవ్వు—"యాలకుల టీయా? మరిందాక ఏదో సెల విచ్చారు శ్రీవారు?"

"అదీ వుంది। ముందు టీ!"

లోపల్నుండి మాటలు వినబడుతున్నాయి.

ఆ అమ్మాయి పేరు చంద్రకళన్నమాట....

మరో మూడు నిమిషాలు గడిచిపోయాయి.

వర్షం చినుకుల రూపంలో మాత్రమే మిగిలిపోయింది.

"ఏయ్....ఏమిటది? అబ్బా .... ప్చ్! టీ త్రాగండి ముందు...."

ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో...."

ఆ భార్యాభర్తల్ని వూహించుకొన్నాను.

బహుశా ఆ చంద్రకళ, రత్నాకరరావ్ ఎదురెదురెగా కూర్చుని యాలకుల టీ త్రాగుతూ, కిటికిలోనుండి కురుస్తున్న వర్షాన్ని చూస్తూ....ఆ తర్వాత తమలోని ఒంటరితనాన్ని పారద్రోలటానికి వాళ్ళు చెప్పుకునే కబుర్లు, వెచ్చటి కౌగిలింతలు, చెక్కిళ్ళు....

ఎందుకో తెలియదు—బాధేసింది.

నా చదువు అయిపోయిన వెంటనే వుద్యోగం దొరికుంటే, బహుశా నేనుకూడా యిలాగే పెళ్ళిచేసుకుని....తల విదిలించాను.

'ఇలా దొంగలా బయట నిలబడే వుండేవాడ్ని కాదు!'

నన్ను చూస్తుంటే, నాకు చాలాసార్లు జాలివేస్తుంటుంది.

నాకు అనుమానం వేస్తుంటుంది తరచుగా—నేను దొంగతనాలు చెయ్యడానికి భయపడటానికి కారణంకూడా యిదేనేమో.

ఇంతలో తలుపు చప్పుడయ్యింది.

ఊపిరి బిగబెట్టాను. "ఇదే....ఇదే అవకాశం! అతను బయటికి రాగానే ఒకే ఒక్క కత్తిపోటుతో రత్నాకరరావ్‌ని పొడిచేసి, ఆ యింటిని దోచెయ్యటం?" ఎక్కడో మనసు వికృతంగా అరిచింది.

తలుపు తెర్చుకొంది.

చంద్రకళ బయటికొచ్చింది. నన్ను చూడగానే షాక్‌తో ఆమె అలాగే నిలబడిపోయింది.

"ఎవరు మీరు?" అదురుతున్న ఆమె పెదవులు అడిగాయి.

ఆ వెనకనే వచ్చాడు రత్నాకరరావ్.

"వర్షం కురుస్తుంటుంటే...." చిరునవ్వు నవ్వబోయాను.

కాని చంద్రకళ కళ్ళు నన్ను అదోలా చూస్తున్నాయి.

తలకి నూనెలేక రాగిరంగులో ఎండిపోయిన జుట్టు, బాగా పెరిగిపోయిన గడ్డం, నలిగి, చినిగిపోయిన నా బట్టలు ఇవి చాలు నాపట్ల ఆమెలో అనుమానాన్ని రేకెత్తించడానికి.

నేనిక ఒక్క క్షణం కూడా అక్కడ వుండదల్చుకోలేదు.

గబగబా అక్కడ్నుంచి వచ్చాను.

ఎవరో నన్నే వెన్నాడుతున్న అనుభూతి....

వెనక్కి తిరిగి చూసాను.

మూడోనంబర్ యిల్లు ముందు నిలబడి, నన్నే చూస్తున్న చంద్రకళ, రత్నాకరరావ్.

2

మరోరోజు వ్యర్థంగా గడిచింది.

ఆ తర్వాతి రోజు....

నే నెన్నాళ్ళగానో ఎదురుచూస్తున్న అవకాశం రానే వచ్చింది.

అదృష్టం నా తలుపు తట్టింది.

చంద్రకళ, రత్నాకరరావు యింటి దగ్గరుండని సమయంలో నేను ఆ మూడోనంబర్ యిల్లుని దోచుకోదల్చుకున్నాను.

ఆ రోజుకూడా రత్నాకరరావుని అనుసరించాను.

మధ్యాహ్నం ఒంటిగంటకి అతను ఆఫీసు నుండి బయటపడ్డాడు.

ఇంటికి వెళ్ళకుండా తిన్నగా టెలిగ్రాఫ్ ఆఫీసుకి

వెళ్ళాడు.

ఆశ్చర్యంతో నేను అతడ్ని అనుసరించాను.

టెలిగ్రాఫ్ ఆఫీసులో అతడు ఆ ఫారాన్ని పూర్తి చేస్తుండగా చూసాను.

"మే మిద్దరం ఈ రోజు సాయంత్రమే బెంగుళూరు వస్తున్నాం. తగిన ఏర్పాట్లు చూడు" ఇదీ ఆ టెలిగ్రామ్ సారాంశం.

అక్కడ్నుండి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాడు.

ఆ రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకి బెంగుళూరు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ కరెక్ట్ టయిమో కాదో అడిగి, తెలుసుకున్నాడు

నాలో సంతోషం ఎక్కువై పోయింది.

ఎగిరి, గంతులెయ్యాలన్పించింది.

ఆ రోజు సాయంత్రం నాలుగుగంటలకి చంద్రకళ, రత్నాకరరావు యింటినుంచి బయటికొచ్చేస్తారు.

అంటే ఈరోజు రాత్రి....

నేను నిరభ్యంతరంగా.

పెద్దగా అరిచాను.

కొంతమంది నాకేసి చిత్రంగా చూశారు.

అవి నేనేమాత్రం పట్టించుకోలేదు.

ఎక్కడెక్కడో తిరిగి, ఏడింటికి నేనుంటున్న యింటికి (ఇల్లు అనకూడదు, గుడిసె) చేరుకొన్నాను.

పాత ట్రంకుపెట్టె తెరిచి, నాకు కావలసిన పరికరాలు వెతుక్కొన్నాను.

తాళాల్ని సులభంగా వూడదీయగల సూదివంటి పరికరం, చిన్న గునపం, భుజానికి వ్రేలాడదీసిన సంచీలో

వేసుకున్నాను.

కత్తికూడా తీసుకుందామనుకున్నా కాని అదెక్కడుందో నాకు సమయానికి కన్పించలేదు.

కత్తికి పని తగలదని తీర్మానించుకుని, మూడోనంబర్ యింటికి బయల్దేరాను.

ఆనందంతో నా అడుగులు వేగంగా పడ్డాయి.

మూడోనంబర్ యిల్లుని దోచుకొని, ఆ దొంగతనం చేసిన వస్తువులతో వూరి పొలిమేరలు దాటెయ్యటం (కాలి నడకనే), ఆ తర్వాత ఏదో పల్లెటూళ్ళో గుట్టుచప్పుడు కాకుండా ఈ వస్తువులు అమ్మేయ్యటం....

నా ఆలోచనలకి బ్రేకు పడింది.

"అదిగో. వాడే! దొంగ రాస్కెల్... ఇప్పటికి దొరి కాడు!! రేయ్ 302, 114 వాడ్ని తప్పించుకోనివ్వకుండా చూడండి."

మైక్ సెట్‌లాంటి ఎస్సై గొంతు విన్పించింది

తత్తరపడి, నేను తప్పించుకుందామనేటప్పటికే ఆలస్య మైపోయింది.

నా చేతులకి సంకెళ్ళు పడ్డాయి.

తర్వాత లాకప్ ...కోర్టు....జైలు....తుదకి సెంట్రల్ జైల్లో తేలాను.

జడ్జి నాకు రెండున్నర సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించాడు.

ఇంకా నా జైలుశిక్ష పూర్తిచేసుకోవడానికి ఆర్నెల్లు గడువు—

3

హఠాత్తుగా మెలకువ వచ్చింది.

నిద్రలో ఎవరో వీపుమీద కొరడాతో కొట్టినట్లుగా

పులిక్కిపడ్డాను.

నా జైలుగది చీకటిని కావిలించుకొని వుంది.

ఎక్కడా రవ్వంత వెలుతురుకూడా లేదు.

క్షణంపాటు చెవులు రిక్కించి, వింటే తెలిసింది.

అది కొరడా శబ్దం కాదు!

జైలు గంటలు!!

అప్పటికి ఉదయం అయిదు కావస్తుందేమో!!

నాలాగే నాతోటి ఖైదీలు చాలామందికి మెలకువ వచ్చి నట్లుంది.

ఊచల దగ్గరికి వచ్చి, వరండాకేసి చూస్తున్నారు.

వరండాలోని లైట్లు ఒక్కసారిగా వెలిగాయి.

దూరంగా బూట్లచప్పుడు వినపడింది. లయబద్ధంగా, ఆ నిశ్శబ్దం ప్రతిధ్వనించేలా.

ముందుగా ఇద్దరు సెంట్రీలు....

ఆ వెనకగా బక్కచిక్కిపోయిన ఖైదీ.

ఆ ఖైదీ ప్రక్కన డాక్టర్, మేజిస్ట్రేట్, జైలు సూపరింటెండెంట్ ....వరుసగా.

నా జీవితంలో అంత ఆశ్చర్యాన్ని నేనెప్పుడూ పొంద లేదు.

ఆ ప్రభాతం ఉరిశిక్ష అనుభవించటానికి వెళ్తున్న వ్యక్తి రత్నాకరరావు....మూడో నంబర్ యిల్లు!

మరో గంట తర్వాత ఓ గంట మ్రోగింది.

నాకు తెలిసిన రత్నాకరరావు ఉరితీయబడ్డాడు.

"ప్రొద్దున్న ఉరి తీసారే, ఏ కారణంచేత వురితీసారు?" సెంట్రీని అడిగాను.

సెంట్రీ శేఖరం రెండుక్షణాలు మౌనంగా వుండి పోయాడు.

ఆ తర్వాత చెప్పాడు.

"ఉరి తీయబడ్డ వ్యక్తి పేరు రత్నాకరరావు! అత నిది వరకు ఏదో 'చిట్ ఫండ్' కంపెనీ నడుపుతుండేవాడట. రత్నాకరరావుకి పెళ్ళాముంది ఊరికి దూరంగా అతని యిల్లట! వయసు, అందం వున్న భార్య వున్నప్పటికి, రత్నాకరరావు తన ఆఫీసులోని టైపిస్టుతో వ్యవహారం రహస్యంగా నడిపాడట.

ఆ టైపిస్టు అమ్మాయి అంటే రోజురోజుకి ప్రేమ ఎక్కువై పోయింది రత్నాకరరావులో. భార్య అడ్డు తొల గించుకొని టైపిస్టుని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. తన మీదకి అనుమానం రాకుండా వుండటానికి పకడ్బందీగా సాక్ష్యాలు సృష్టించబోయాడు...."

శేఖరం ఒక్క-క్షణం ఆగాడు.

ఆత్రుతతో వింటున్నా అతడు చెబుతున్నది.

"రత్నాకరరావు యిల్లు దోచుకోవాలని ఓ దొంగ ప్లాన్ వేసాడట! రత్నాకరరావుకి ఆ దొంగమీద అనుమానం కలిగి. అతడ్ని వెంబడించి, ఆ దొంగ గురించి పూర్తిగా తెలుసుకున్నాడు. ఆ దొంగ యింట్లోని కత్తిని దొంగిలించి వేలిముద్రలు పడకుండా గ్లవుస్ తొడుక్కొని భార్యని హత్యచేశాడు. దొంగ అనవసయానికి యింట్లో దొంగ తనానికొస్తాడని అతనూహించాడు ఆ దొంగమీద అను మానం కలిగేలా అతడు వాడే బీడీలు యింట్లో పడేసాడు.

ఆ రోజు—హత్యచేసిన సాయంత్రం టైపిస్టుతో బెంగు ళూరు వెళ్ళిపోయాడు.

అయితే అతడు చేసిన పొరబాట్లు రెండు—రత్నాకర రావు దురదృష్టం కొద్దీ ఆ దొంగని పోలీసులు అరెస్టు చేశా రట. రెండో పొరబాటు—ఆ బీడీలపై రత్నాకరరావు వేలి

ముద్రలున్నాయి. నాలుగు తగిలించేసరికి నేరాన్ని వొప్పుకున్నాడు.

హత్యచేసినందుకు, చేసి, చట్టాన్ని తప్పుద్రోవ పట్టించబోయినంచుకు....పాపం! ఉరి" ఆకాశంలోకేసి చూపి విట్టూర్చాడు శేఖరం.

వెన్నులో ఒక్కసారిగా గగుర్పాటు పుట్టుకొచ్చింది. ఆ రోజు నా అదృష్టం బావుండి, పోలీసులకి పట్టుబడ్డాను గాని లేకపోతే చెయ్యని నేరానికి....'అతను' బయటుంటే డబ్బు వెదజల్లి నన్ను ఉరికంబం ఎక్కించేవాడు.

"అవును! హంతకుడు దురదృష్టవంతుడు" చెప్పాను బీడీ దూరంగా విపిరేస్తూ. □

పాల వెల్లువ!



ప్రేమించు ప్రేమ కోసం

చంద్రశేఖర అజాద్

"ప్రియతమా !

మనం ముందే ఊహించినట్లుగా ప్రేమను గుర్తించదీ లోకం. నా అనుభవం ఈ విషయాన్ని మరోసారి నిజం చేసింది. కానీ కాలం మారిందనే విషయం ఈ పెద్దలు

గుర్తించకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. పాత విలువలు ఏవి ఉంటున్నాయి కనుక. తమ పెద్దరికం ఎక్కడ నిలిచింది కాబట్టి.

చరిత్రలో ఎందరో ప్రేమికుల్లా మనం కూడా విలపిస్తూ కూర్చోలేం చెట్లనూ, పుట్లనూ, మేఘాల్ని తిడుతూనో, వేడుకుంటూనో కాలం గడపలేం. తరాల అంతరాల్ని చీల్చుకుంటూ ముందుకే పోతుంటాం.

నీకు గుర్తుందా! కృష్ణా తరంగాల అందం చూస్తూ మనం పరవశించిపోయాం. మనం కలిసి అడుగులు వేశాం. ఎన్నెన్నో కలలు కన్నాం మన ప్రేమకో రూపం ఏర్పడుతుందనుకున్నాం. కానీ.... కానీ ...ఏమిటీ రాద్ధాంతం! వీళ్ళింతగా కరుడుగట్టుకు పోయారెందుకని? వీళ్ళ జీవితాల్లో యాంత్రికత్వానికి మించి ప్రేమభావాలకే చోటులేదా?

ప్రేమను ప్రేమించు ప్రేమకోసం. నిజమే. మనం ప్రేమించుకున్నాం. ప్రేమ కొరకు. అందుకే ఈ ప్రేమ కోసం అన్నింటిని వదులుకొని నేను తయారుగా ఉన్నాను. మిగతా బంధా లేవీ నన్ను పట్టివుంచలేవు. మా పెద్దల ఆరాటం నన్ను మార్చలేదు. ప్రేమ వాటికన్నింటి కతీతం అని వారింకా గుర్తించలేకపోవచ్చు. అంతగా అయితే కృష్ణా తరంగాలలో కలిసిపోవటానికి నేను సిద్ధం—రాజీ పడటానికి మాత్రం కాదు.

యువతరం ప్రేమిస్తుంది.
యువతరం ఆరాధిస్తుంది.
అందుకు తమ ప్రాణాల్ని సైతం బలిచేస్తుంది.

ఈ విషయాన్ని పెద్దలు గ్రహించగలిగితే ఎంత బాగుంటుంది!

ప్రియతమా! బదులివ్వగలవు.

సీ

నీరజ"

"ఈ లేఖ కొంత వెరైటీగా వుంది సార్! అందులోనూ ఓ యువతి రాసింది. ఇది పాఠకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది" అంటూ అందించాడు అసిస్టెంట్ ఎడిటర్ కుమార్.

మౌనంగా అందుకొన్నాడు ఎడిటర్ మనోహర్.

సాంతం చదివేక ఫైల్ టేబుల్‌మీద పెట్టి కణతలు రుద్దుకున్నాడు.

"ఈ వారం ప్రచురిద్దామా" తిరిగి అడిగేడు.

"కానీండి... నాకీ ప్రేమకోసం శీర్షిక నచ్చటం లేదు. రాను రానూ దీని స్వరూపమే మారిపోతూంది."

"మన పత్రికను యువతరం ఇంతగా అభిమానించటానికి కారణం కేవలం ఈ శీర్షికే సార్. ఎప్పుడో ఆగిపోవాల్సిన ఈ శీర్షిక ఇంకా కొనసాగుతుందంటే, అంత వెర్రిగా జనాల్ని ఆకర్షిస్తుంది కాబట్టే. మిగతా పత్రికలన్నీ ఈ శీర్షికనే మారుపేర్లతో ప్రవేశపెట్టాయి. మీరు గమనించే వుంటారు" అన్నాడు కుమార్.

"అఫ్‌కోర్స్...."

"శీర్షిక మారటం సహజమే కదా. మన సీరియల్సే మారుతున్నాయి పాఠకుల రెస్పాన్స్‌నుబట్టి"

"నిజమే అయినా మనం ఓసారి ఉద్యోగంలో చేరాక మన ఇష్టాలతో సంబంధం ఏముంటుంది" అన్నాడు మనోహర్

కుమార్ ఆయనకేసి చూశాడు. ఏ విషయంలోనో అతను బాధపడుతున్నట్లుగా వున్నాడు. ఈ నడుమే ఆయన

అలా వుంటున్నాడు. కారణమేమిటో కుమార్ ఊహించ లేక పోతున్నాడు.

"బెదిబై మిస్టర్ కుమార్! ఈ శీర్షిక మొత్తం మీరే చూసుకోండి. నాదగ్గరకు తేకండి. అయితే ఒక్క విషయం. మరీ దారుణంగా వుండే లేఖలు ప్రచురించకండి" అన్నాడు మనోహర్.

"అలాగే సార్" అంటూ ఫైల్ తీసుకొని వచ్చేశాడు కుమార్.

మనోహర్ 'ప్రేమకోసం' శీర్షిక ఆరంభించినప్పుడు వచ్చిన రెస్పాన్స్ ఓ రకంగా వుంది. మొదట్లో ప్రము ఖులు సైతం తమ పాతరోజుల్ని, మూగప్రేమల్ని గుర్తుకు తెచ్చుకున్నారు. తర్వాత ఆ శీర్షిక మారుతూ వచ్చింది. విచిత్రమైన లేఖలు కూడా ప్రచురిస్తున్నారు. ప్రేమికులకు మంచి వేదికగా ఈ శీర్షిక తయారయింది.

మనోహర్ ఎప్పటికప్పుడు అనుసరించే క్రొత్త పద్ధ తులవల్ల పత్రిక అనతికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. 'ఎడిటర్'గా పాఠకులు ఆయన్ను గుర్తించారు. కొన్ని వర్గాల్లో ఆయనపట్ల పెద్ద క్రేజ్ వుంది. ఆయన్ను తమ సంస్థలోకి తీసుకోవటానికి ఎందరో పత్రికా యజ మానులు ఆరాటపడుతున్నారు. అందుకు వారు ఇవ్వజూపు తున్న మొత్తాలు ఆకర్షణీయంగా వున్నాయి.

మనోహర్ ఆలోచనలు మరో రకంగా వున్నాయి. ఆయన ఎడిటర్‌గా నూతనంగా ఓ కుటుంబ వారపత్రిక, రాజకీయ పత్రిక స్థాపించటానికి ఓ లక్షాధికారి ముందు కొచ్చాడు. ఆధునిక యంత్రాల్తో పెద్ద ప్రెస్సు తీసుకో దల్చారు. పార్టీ మంచివాడు. నష్టాలు భరించటానికయినా సిద్ధపడుతున్నాడు. పైగా తనకు నాలుగోవంతు వాటా

ఇస్తానంటున్నాడు. ఏ విషయమూ తేల్చి చెప్పమని గొడవ చేస్తున్నాడు. పత్రికను విజయవంతంగా నడపగలననే నమ్మకం మనోహర్‌కుంది.

ఇప్పుడు మనోహర్ ఆందోళన చెందుతుంది ఆ విషయం గురించి కాదు.

అది తన కుటుంబ సమస్య!

అది తన బిడ్డ సమస్య!

ప్రేమ సమస్య!

ప్రేమను ప్రేమించాలా ...ప్రేమ కోసం!?

2

డైనింగ్ టేబుల్‌ముందు మనోహర్, అతని భార్య కూర్చున్నారు. ఇటీవల కాలంలోనే ఈ దృశ్యం కనబడుతుంది.

ఆ ఇంట్లో వారంతా కలిసే భోంచేస్తారు. మనోహర్‌కు ఇద్దరే పిల్లలు. రజనికి ఈ సంవత్సరమే గ్రాడ్యుయేషన్ పూర్తయింది. సునీల్ పదవ తరగతి చదువుతున్నాడు. ఈ నడుమే తన అభిరుచుల కనుగుణంగా మనోహర్ ఓ ఇల్లు నిర్మించుకొన్నాడు.

రజని విషయంలో ఆయన కెన్నో ఆశలున్నాయి. ఆ అమ్మాయిని ఇంకా చదివించాలని పి. హెచ్. డి., చేయించాలని అతని కోర్కె.

రజనీ వీరేంద్రను ప్రేమించిన విషయంలోనే అభిప్రాయబేధాలొచ్చాయి. ఆరోజు రజని వీరేంద్రను పరిచయం చేసినప్పుడు మనోహర్ క్యాజువల్‌గా మాట్లాడాక అతను వెళ్ళిపోయాడు. అప్పుడు వెళ్లాడు మనోహర్ కూతురు గదికి.

"రజనీ.... వీరేంద్రతో నీ స్నేహం ఎలాంటిది."

అంత డైరెక్టుగా అడగటంతో ఆమె కొంత కంగారు పడింది.

"డాడీ" అంది తడబడుతూ.

"అతన్ని ప్రేమిస్తున్నావా? అతని గురించి వివరాలు తెలుసా? అతనేం చేస్తున్నాడు? ఎప్పుడు కలిశాడు? ఎలా పరిచయం అయింది? వాడ్డూయూ మీన్ బై లవ్."

ప్రశ్నల వర్షం.

"ఐ లవ్ హిమ్ డాడీ" అంది మెల్లగా రజని.

"రజనీ నువ్వు చిన్నపిల్లవు" సౌమ్యంగా అన్నాడు.

"నీ దృష్టిలో నే నెప్పుడూ చిన్నపిల్లనే డాడీ" అంది రజని మామూలుగా.

"బట్....ఇది జీవితం రజనీ. నీకు తెలియదు. త్వర పడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకు."

"నేను బాగా ఆలోచించాకే ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రేమించటం ఓ ఆర్ట్. ప్రేమించబడటం ఓ వరం. అవి రెండూ నేను సాధించాను."

"లవ్ ఈజ్ బ్లైండ్" అన్నాడు మనోహర్.

"ప్రేమను ప్రేమించు ప్రేమకోసం."

"ర....జ....నీ"

"అవును నాన్నా, మన పత్రికలో వస్తున్న లేఖలు చూశాక అర్థమయింది. ప్రేమలో ఇంత మాధుర్యం, నిరీక్షణలో ఇంత అనుభూతి ఉంటుందనే విషయం. వీరేంద్రకు మంచి భావాలున్నాయి. అతని విషయంలో నాకు పూర్తి నమ్మకం వుంది. మీరు మా వివాహానికి అంగీకరించగలరని నా ఆశ!"

మనోహర్ స్థాణువులా వుండిపోయాడు. తన బిడ్డ తనను సవాల్ చేస్తోంది! ప్రేమ గొప్పదే. కాదని తా

వనలేదు. వారం వారం లక్షలాది పాఠకుల్లో ఈ భావాన్నే తాను ఇంజెక్ట్ చేస్తున్నాడు. మొదటిసారిగా తన విధా నాన్ని పరిశీలించుకోవలసిన అవసరం ఏర్పడింది.

"చూడమ్మా— పత్రికల్లో రాసేవాటిని జీవితంతో ఎనలైజ్ చేసుకోకూడదు. హిపోక్రసికి చెందిన విషయా లవి. నువ్వు జీవితంలో సాధించాల్సిందెంతోవుంది. ప్రేమ పేరుతో వాటిని వాయిదా వెయ్యటం దారుణం. ట్రాష్. వీరేంద్రనుగాని.... మరొకర్నిగాని నువ్వు ప్రేమించటానికి మరికొంతకాలం ఆగాలి. నువ్వు పి. హెచ్. డి సాధిం చేక వాటిగురించి ఆలోచించవచ్చు. మైండిట్ —"

"డాడీ! ఇంతకంటే హిపోక్రసి మరెక్కడ ఉంటుంది. మీరు కులంకోసం, ఆస్థికోసం, హోదా వున్నవాడికోసం పెర్చ్ చేస్తున్నానని చెప్పండి. నిజాయితీగా ఉంటుంది. అంతేగాని నామీద మీకు నమ్మకం లేకగాని. ..పెళ్ళయితే నేను సాధించలేనని ఎందు కనుకుంటున్నారు." అంది రజని పట్టుదలగా.

అప్పటిదాకా వున్న ప్రశాంత వాతావరణం ఒక్క సారిగా మారిపోయింది.

"రజనీ....డోంటాక్ రబ్బిష్ .... నేను ఇలాంటి ప్రేమల్ని హర్షించను. మేం జరిపిన సర్వే ప్రకారం తొంభై తొమ్మిది పెళ్ళిళ్ళు ఫెయిలయ్యాయి. ఎందుకో తెలుసా? వుద్రేకంలో నిర్ణయాలు తీసుకుంటారు కాబట్టి ... జీవితానికి ప్రేమ, పెళ్ళి కాదు ముఖ్యం. గుర్తుంచుకో" విసురుగా వెళ్ళిపోయాడు మనోహర్.

"సర్క్యులేషన్ ముఖ్యం" గొణుక్కుంది రజని.

"ఏమంటుంది రజనీ" అన్నాడు మనోహర్ ఆలోచనల నుండి తేరుకొంటూ.

"ఏమో. ఏమీ మాట్లాడటంలేదు. ముభావంగా వుంటుంది."

"నాలుగు రోజులుపోతే అదే మారుతుందిలే."

"ఏమో నాకయితే నమ్మకం లేదు."

"నువ్వు రజనీని ఓకంట కనిపెడుతుండు."

"ఏం కనిపెట్టటమో, అతని గురించి కనుక్కున్నారా"

"కనుక్కున్నాను. పూర్తి వివరాలు అందటంలేదు. ప్రస్తుతం అతను ఊరు వెళ్ళాడు. అక్కడకు వెళితేగాని తెలియదు. ఏవో అర్జెంటు పనులు....కొంచెం తీరిగ్గా చూడాలి" అన్నాడు మనోహర్.

భోజనం పూర్తయింది.

తన గదికి వెళ్తూ రజని గదిలోకి తొంగిచూశాడు.

ఆమె తదేకంగా చదువుతూంది!

ఆరోజే వచ్చిన తమ పత్రిక!

3

మనోహర్ నిలువెల్లా వణికిపోవటం స్పష్టంగా కనబడు తోంది. అతను తనను తాను కంట్రోల్ చేసుకోవటానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు.

మనోహర్ భార్య ఏడుస్తోంది. సునీల్ ఓ ప్రక్క నిల బడి ఉన్నాడు. అతని బుగ్గలమీద నుండి కన్నీళ్ళు కారు తున్నాయి.

రజని కనిపించటంలేదు.

అప్పటికి తమకు తెలిసిన వారందరి యిళ్ళకూ ఫోన్ చేసి కనుక్కున్నారు. ఎవరూ రాలేదని చెప్పారు. ఈ విషయం పోలీసులకు తెలియచెయ్యాలా వద్దా అని ఆలోచన. ఈ వార్త బయటకు పొక్కితే ఏర్పడే పరిణామాల గురించి ఆలోచిస్తున్నాడు మనోహర్.

ఇంతలోనే ఈ విషయం యింత సీరియస్‌గా మారుతుందని అతను ఊహించలేదు. ఆ రోజుతో రజని ఈ విషయంలో తిరిగి ఆలోచించుకొంటుందని భావించాడే గాని యిలా జరుగుతుందనుకోలేదు. అలక్ష్యం.... ఆలస్యం మూలంగా ఎన్ని ప్రమాదాలు జరుగుతాయో తలుచుకొంటే అతని కేడుపొస్తోంది.

"ఊరుకో....ఊరుకో" అన్నాడు భార్యని.

"అది యేమయిందోనండి" అంటూ ఆమె బావురుమంది.

"ఏమవుతుంది. రజనీ ధైర్యంగల పిల్ల. రజనీకేం కాదు. ముందు నువ్వు కంగారుపడకుంటే మనమేదయినా చెయ్యటానికి అవకాశం వుంటుంది."

ఆమె కళ్ళ నీళ్ళు తుడుచుకుంది.

"పోలీసు రిపోర్టు యిచ్చేముందు నేను వీరేంద్ర ఊరు వెళతాను. అప్పుడు ఏం చేయాలో నిర్ణయించుకుందాం" అన్నాడు.

"నేనూ వస్తానండి" అందామె.

"నువ్వు రావటం కాదు. ఈలోపు అమ్మాయి వస్తే యెలా? ఏదయినా ఫోన్ రావచ్చు. నువ్వూ, సుశీల్ యిక్కడే వుండండి. నేను కారులో బయలుదేరుతున్నాను."

ఆమె కన్నీళ్ళు తుడుచుకొని "ఏ విషయం ఫోన్ చేసి చెప్పండి." అంది.

"అలాగే" మనోహర్ ముందుకు నడిచాడు.

వెళ్ళి కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు. ముందు వీరేంద్ర గదిదగ్గరకు వెళ్ళాడు. ఆ యింటి ఓనర్ని అడిగి అతని ఊరు తెలుసుకున్నాడు. అతనికి వెంటనే తన

మిత్రుడు డి. యస్.పి. నారాయణ్ గుర్తొచ్చాడు. వెంటనే నారాయణ్ ఇంటివైపుకు దూసుకుపోయింది కారు. ఆయన యింట్లోనే వున్నాడు. ఆయనకు అన్ని విషయాలు చెప్పి తిరిగి కారులో కూర్చున్నాడు

పెద్ద కుదుపుతో దూసుకుపోయింది కారు.

రజని యెంతపని చేసింది. ఖచ్చితంగా అతన్తో కలిసి వెళ్ళిపోయుంటుంది. మరో భాషలో చెప్పాలంటే 'లేచి పోవటం.' ప్రముఖ సంపాదకుడి కూతురు 'లేచిపోవటం' ఎంత సెన్సేషనల్ న్యూస్! రేపటినుండి వివిధ పత్రికలు తనను 'విలన్'గా చిత్రిస్తూ రాసే రాతలు తలుచుకుంటే దుఃఖం పెల్లుబికి వస్తోంది.

"లవ్ ఈజ్ బ్లైండ్" గొణుక్కున్నాడు.

కారు వేగంగా వెళుతోంది.

అంతకంటే వేగంగా ఆలోచనలు!

ఏం జరిగుంటుంది? రజనికేం కాదుగదా? తన గుండెల మీద పెంచుకున్న తన బిడ్డ.... ప్రేమించి .. ప్రేమ కోసం ఏం కానుంది?

కారు వేగంగా ఊర్లోకి దూసుకుపోయింది.

వీరేంద్ర గురించి తెలుసుకోవటానికి ఎక్కువసేపు పట్ట లేదు. ఓ పాతకాలపు పెంకుటిల్లు మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబించే ఆ లోగిలిలో యెవరో పడుకున్నారు— దూరంగా కారు రావటాన్ని విచిత్రంగా చూస్తూ.

కారాపి దిగాడు మనోహర్.

వేగంగా నడిచివచ్చాడు.

"వీరేంద్ర వున్నాడా?" ఆ కంఠంలో యెందుకో కరుకు దనం?

"లేదు బాబు. ఎవరు మీరు?" అన్నా డా మనిష

లాయన

"అతను మా అబ్బాయి స్నేహితుడు. ఓసారి కలుసు కుందామని" అన్నాడు

"అయ్యో నిలబడ్డారే. కూర్చోండి!" అంటున్నా డాయన.

"ఫర్వాలేదు లెండి."

"వాడు ఊరెళ్ళాడు నాయనా....యెవరో స్నేహితుల దగ్గర కెళ్ళొస్తానన్నాడు."

మనోహర్ చటుక్కున లేచాడు.

"అమ్మాయి" అంటూ పిలుస్తున్నాడతను.

"ఇప్పుడు వారిని పిలవకండి. ఈ ఊరు ప్రక్కగా వెళ్తూ మా అబ్బాయి చూసిరమ్మంటే వచ్చాను. మరోసారి వస్తాను" సమాధానంకేసి చూడకుండా పరుగున వచ్చి కార్లో పడ్డాడు.

'మంచి తీర్థమయినా' వెనకనుండి ముసలాయన అరుస్తున్నాడు.

ర్‌య్ మంటూ కారు స్టార్టయింది. రివర్స్ చేశాక ముందుకు దూసుకుపోయింది.

'డామిట్! యిద్దరూ యెక్కడకో వెళ్ళుంటారు. ఎంత ధైర్యం!'

వెంటనే కోపం వచ్చింది చల్లటి గాలి మేనును తాకుతున్నా చెమటలు కారుతున్నాయి. అతని మనసులోకి ఎందుకో తన పత్రిక స్ఫురించింది ...

నాలుగు నెలలపాటు తాను ఊరించి 'నాకో మొగుడు కావాలి' అన్న సీరియల్ ప్రచురించాడు. అదో విప్లవాత్మక నవలగా పబ్లిసిటీ యిచ్చాడు. ఆ సీరియల్‌లో విషయం గుర్తొచ్చి కుంచించుకుపోయాడు.

కారు వెళ్తోంది వేగంగా....

తల నొప్పిగా వుందనిపించింది.

ఓ చేత్తో స్టీరింగ్ పట్టుకొని మరో చేత్తో తలకేసి రుద్దుకున్నాడు.

తళుక్కుమన్న ఓ మెరుపు!

రజనీ డైరీ రాస్తుంది.

అందులో ఆమె వివరాలు దొరకొచ్చు.

ఆ డైరీ యింట్లో వుంటే!

4

గదంతా చిందరవందరగా వుంది. అంతా తెగ వెదికాడు. డైరీ ఎక్కడా కనపడటంలేదు.

"ఫోన్ వచ్చింది" అంటూ వచ్చింది మనోహర్ భార్య.

"ఎవరు?"

"డి.ఎస్ పి. గారట."

"హలో ...మనోహర్ హియర్."

"నేను నారాయణ మాట్లాడుతున్నా. నువ్వోసారి రాగలవా?"

"వాట్ హేపండ్."

"నథింగ్. చిన్న ఇన్ఫర్ మేషన్ కావాలి."

"ఇప్పుడే వస్తున్నా" ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కడికండి" అందామె.

"నా మిత్రుడు పిలుస్తున్నాడు. ఈ వ్యవహారం అతనే చూస్తున్నాడు. ఈలోపు నువ్వు అమ్మాయి డైరీ యెక్కడైనా దొరుకుతుందేమో చూడు."

మనోహర్ వెంటనే బయలుదేరి వెళ్ళిపోయాడు.

డి.ఎస్.పి. నారాయణ్ ఎంతోసేపు ఎదురుచూస్తున్న వాడిలా వున్నాడు.

"మనోహర్.... మనం తిరపతి వెళుతున్నాం" అన్నాడాయన.

"ఎందుకు. ఏమయింది?"

"నో క్వశ్చన్స్" అంటూ బయలుదేరాడు

మనోహర్ మౌనంగా అనుసరించాడు.

కారు గాలితో సమానంగా పరుగెడుతూంది.

నారాయణ సీటు వెనకాల ఆని పడుకున్నాడు.

అతన్ని మాట్లాడించాలంటే భయంగా వుంది.

"రజనీ యెక్కడయినా పట్టుబడలేదు గదా" ఆలోచన మొదలయింది మనోహర్‌కి.

తిరుపతి వెళ్ళేదాకా ఎవరూ మాట్లాడుకోలేదు.

కొండమీదకి దూసుకుపోయింది కారు ..

కారు ఆగాక నారాయణ దిగాడు.

"వెయిట్!" అని చెప్పి తలుపు మూసి వెళ్ళాడు.

కాటేజి ముందు పోలీసు ఉన్నారు. అతన్తో నారాయణ ఏదో మాట్లాడాడు. ఆ తర్వాత గదిలోకి వెళ్ళాడు. అక్కడ రెండు సూట్‌కేసు లున్నాయి. తిరిగి ఎవరితోనో మాట్లాడి వచ్చాడు....

కారులో కూర్చున్నాక కదిలింది....

నారాయణ చేతిలో వున్న డైరీ చూడగనే మనోహర్ ఉలిక్కిపడ్డాడు.

అది రజనీది!

కారు కొండ దిగుతూంది....

మలుపుల్లో కీచుమంటూ బ్రేకుల శబ్దం.

వేగంగా పేజీలు తిరగేస్తుంటే....మనోహర్ గుండెల

చప్పుడు వినపడుతోంది.

"డాడీతో ఈ రోజు ఘర్షణ జరిగింది. ఇలా అవుతుందని నేను ఊహించలేదు. వీరేంద్రతో పరిచయం నాన్నగార్కి యిష్టంలేదు. అయినా సరే నేను వీరేంద్రనే ప్రేమిస్తాను. పెళ్ళాడితీరతాను."

"వీరేంద్రకు సమాచారం పంపాలి. మా యిద్దరికీ 'కోడ్'లో లెటర్స్ రాసుకోవటం అలవాటే. నాన్నగారి పత్రిక మేం రెగ్యులర్‌గా చదువుతాం. అందులో 'ప్రేమ కోసం' అనే శీర్షిక బాగుంటుంది. బాగుంటుంది అనే కంటే వంతెనలా వుంటుంది. లెటర్స్ రాసుకుంటే ఇంటి దగ్గర వారు నానా గొడవ చేస్తారు. ఈ శీర్షిక ద్వారా ఒకరి కొకరు సందేశాలు ఇచ్చుకోవచ్చు. అందుకే నీరజ పేరుతో పత్రిక్కి లేఖ రాశాను. అది అచ్చయితే వీరేంద్ర జవా బిస్తాడు."

"వీరేంద్ర బదులిచ్చాడు. ఇంక మాకు భగవంతుడే మిగిలాడు. తిరుపతిలో వివాహం చేసుకోవాలి. ముహూ ర్తాలు నిర్ణయించుకొనేది మేమే. అది తెలియచేసేది నాన్న గారి పత్రికే!"

"నిజంగా మా యిరువురి లేఖలు నాన్నగారి పత్రికలో ప్రచురింపబడటం మా అదృష్టం. నాన్న మరలా మాట్లా డకపోయినా మొఖంమీద యేదో ప్లానులో ఉన్నాడు. ఇంకా యెన్ని రోజులు తిరుపతిలో పెళ్ళి చేసుకొంటాం. అప్పుడు ఏమంటాడో చూస్తాను. అయినాసరే ఈ అంశం కూడా వ్యాపారానికి వాడుకునే తెలివితేటలు నాన్నగారి కున్నాయి. 'ప్రేమకోసం' శీర్షిక చేసిన పెళ్ళి అంటూ మా ఫోటోలు ప్రచురిస్తాడేమో!"

"నిజంగా ఈ రోజు ఎంత బాగుంది. నేను స్వేచ్ఛా

ప్రపంచంలోకి వెళుతున్నాను ప్రేమించాను ప్రేమకోసం. ప్రేమకోసమే వెళుతున్నాను వీరేంద్ర అంటే ప్రేమ కాబట్టి ప్రేమే వీరేంద్ర కాబట్టి తిరుమలలో మా రెండు జీవితాలు కలిసి సాగిపోవటానికి ప్రమాణం తీసుకుంటాం. నాన్నగార్కి కొంత షాక్ ట్రీట్మెంటయినా తప్పటంలేదు."

మనోహర్ చేతులనుండి జారిపోయిన కాయితాలు గాలికి టపటప కొట్టుకుంటున్నాయి.

కారు వేగంగా హాస్పిటల్ వైపు దూసుకుపోయింది.

* * *

స్ట్రెచ్చర్‌మీద తెల్లటి గుడ్డలు కప్పిన శవాలు....

తొలగిస్తే

"రజనీ "

మనోహర్ కేక

నారాయణ కళ్ళనుండి రాలుతున్న కన్నీటి చుక్కలు.

"రాక్షసులు. రజనీని రేప్‌చేసి మరీ చంపేశారు. దాంతో పాటు ఆ కుర్రాడ్ని కూడా చంపేశారు. ఆ హంతకుల్ని ఉరికంబం ఎక్కించందే నిద్రపోను—"

పిచ్చివాడిలా చూస్తున్న మనోహర్ కదిలాడు.

హంతకు లెవరో కాదు నేను. నన్ను శిక్షించాలి. నన్ను ఉరి తియ్యాలి!

మొఖం కప్పుకొని ఏడుస్తున్న మనోహర్ ఎందుకో తలెత్తాడు....

అంతలోనే పిచ్చెక్కినవాడిలా అరుస్తూ పరిగెత్తాడు.

నారాయణ ఆందోళనగా చూశాడు....

ఎవరో చదువుతున్న ఈవార వారపత్రికను లాక్కొని ...ముక్కలు ముక్కలుగా చేసి విసురుతున్నాడు మనోహర్. □

అతిజాగ్రత్త

దీపిక



ట్రాఫిక్ సిగ్నల్ ఎర్రలైటు చూసేసరికి కారు ఆపేడు ప్రభాకరరావు. తను యిప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే, ఏ ట్రాఫిక్ పోలీసో కారాపితే? అసలే డిక్కీలో సుశీల శవం వుంది.

అంతా న్యూసెన్స్. తను జాగ్రత్తగా కారు నడిపితే అంతా సవ్యంగా జరిగిపోతుంది గ్రీన్‌లైట్ వెలిగేవరకూ ఓపిగ్గా కూర్చుని గేరు మార్చి కారు పోనిచ్చాడు.

కారుని స్పీడ్ లిమిట్స్‌లోనే నడుపుతున్నాడు. బస్ డిపో దగ్గరికి రాగానే టర్న్ సిగ్నల్ యిచ్చి కారుని హైవే లోకి మళ్ళించాడు.

హైవేమీద ట్రాఫిక్ ఎక్కువగా లేదు. ఎదురుగా వచ్చే కార్లకి లైట్ డిమ్ చేస్తున్నాడు. ఇంకా పదినిమిషాలు డ్రైవ్ చేస్తేకాని తను వెళ్ళవలసిన చోటు రాదు. కొద్ది రోజుల ముందే ఆ స్థలం ఎన్నుకొన్నాడు. అక్కడ ఒక గొయ్యి కూడా త్రవ్వి వుంచాడు. ఆ గొయ్యి సుశీలకోసం ఎదురుచూస్తోంది.

ఆమె అంతర్థానం అందరికీ సాధారణంగా అనుమానం తెస్తుంది. పోలీసులకి కూడా. కొంత కాలమయ్యాక, సుశీల ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది—అనే నిర్ణయానికి వస్తారు. డ్రైవ్ చేస్తూ తనకి, పోలీసులకి మధ్య జరగబోయే సంభాషణ గురించి ఆలోచిస్తున్నాడు.

తను డ్యూటీనుంచి యింటికి వస్తాడు: తలుపులు దగ్గరికి వేసివున్నాయి. సుశీల కనపడదు. తను యిల్లంతా వెతుకుతాడు. ఇంకా పనిమనిషి రాలేనట్లుగా వుంది. ప్రక్క యిల్లవాళ్ళని, బంధువులనీ, స్నేహితులనీ అందరినీ అడుగుతాడు. ఫలితం వుండదు. ఎవరికీ కూడా ఆమె ఎక్కడికి వెళ్ళిందో, యేమయిందో తెలీదు. పోలీసు రిపోర్టు యిస్తాడు.

"మీ భార్య యింట్లో లేనట్లుగా యెప్పుడు తెల్సుకొన్నారు?" ఇన్‌స్పెక్టర్ మొదటి ప్రశ్న వేస్తాడు.

"నేను నైట్ డ్యూటీనుంచి ఉదయం ఆరుగంటలకు

యింటికి వచ్చినప్పుడు సుశీల యింట్లో లేదు" తను అంటాడు విచారవదనంతో.

"ఆమె ఏ స్నేహితులతోనో సెకెండ్ షోకి వెళ్ళి వది లేక వాళ్ళ యింట్లో పడుకోవచ్చుగా? మీరు యింటికి వచ్చే సరికి ఆమె తిరిగి రాకపోవచ్చుగా?" అంటాడు ఎస్ ఐ.

"లేదు. అలా జరిగివుండదు. ఎందుకంటే ఆవిడ సినిమాకి వెళ్ళేటట్లుంటే ముందుగా నాకు చెప్తుందిగా. అదే కాక సుశీల యెప్పుడూ సెకండ్ షోకి రానంటుంది. నేను మా బంధువుల యింటికి, స్నేహితుల యింటికీ, అందరి వద్దకు వెళ్ళి అడిగాను. ఎవరూ కూడా తెలీదన్నారు. ఒక వేళ యెవరి బలవంతం వల్లనో సినిమాకి వెళ్ళినా, తలుపు లన్నీ జాగ్రత్తగా తాళంవేసి వెళుందిగా? నేను యింటికి వచ్చేసరికి తలుపులు దగ్గరిగా వేసివున్నాయి."

ఇనస్పెక్టరు అనుమానంతో అడుగుతాడు, "మీకు, మీ భార్యకు ఏమైనా మనస్పర్థలు ఉన్నాయా? ఈమధ్య మీ రిరువురూ ఏ విషయంలోనైనా తగవు పడ్డారా?"

"లేదు. మా వివాహం అయి 6 సంవత్సరాలనుంచి మేము ఎప్పుడూ అంతగా కలహించుకోలేదు. ఎప్పు డయినా కలహించుకున్నా కూడా, ఇల్లొదలి వెళ్ళిపోవలసి నంత పెద్ద తగువులు ఏమీలేవు."

"మీకు నైట్ డ్యూటీస్ ఉంటాయా?" ఇన్‌స్పెక్టర్ తన ప్రశ్నలను కొనసాగిస్తూ అంటాడు.

"అవును మా ఫ్యాక్టరీ రౌండ్-ది-క్లాక్ పనిచేస్తుంది. మూడు షిప్టులు వుంటాయి. నాలుగు రోజులుగా నేను నైట్ డ్యూటీ చేస్తున్నాను. నైట్ డ్యూటీ 10 గంటల నుంచి 6 గంటల వరకు. నేను 9 గంటలకే భోజనంచేసి 9-30 కి డూటీకి బయలుదేరుతాను. ఈవేళ ఒక అరగంట

ముందుగా బయలుదేరి వచ్చేసాను." ఇన్‌స్పెక్టరుకి, తను వివరాలు అడగకుండానే చెప్పేస్తాడు.

ప్రభాకరరావు తన ఆలోచనలు ప్రక్కకునెట్టి, కారు వేగం తగ్గించాడు. హైవే ప్రక్కగానున్న చిన్న మట్టి రోడ్డులోకి కారు త్రిప్పాడు. ఓ వందగజాల దూరం వెళ్లాక అక్కడేవున్న పొదల వెనుక కారు ఉంచాడు.

క్రిందకు దిగి, డిక్కీ మూతతీపి సుశీల శవాన్ని, 2 సూట్‌కేసులను తెచ్చి గోతిలోకి త్రోశాడు. గోతిని తను కూడా తెచ్చిన పారతో, గోతి ప్రక్కనే వున్న మట్టితో నింపాడు. గోతిని పూర్తిగా పూడ్చి పారను శుభ్రంగా తుడచి కారు డిక్కీలో పడేశాడు. దగ్గరలోవున్న రాళ్ళను ఆకులను, ఎండుపుల్లలను తెచ్చి గొయ్యి పూడ్చిన చోట పడేసాడు. చుట్టు పక్కల కలయ చూశాడు. ఎవరూ లేరు. తను చేసిన పని తనకు తప్ప ఎవరికీ తెలీదు.

సుశీలకు రోజూ రాత్రి పడుకునే ముందు విస్కీ త్రాగటం అలవాటు. ఎప్పుడు అలవాటు అయిందో ఏమో. తను, తనకోసం యింట్లో దాచుకున్న స్టాకు అంతా ఆవిడే పూర్తి చేస్తుంది. ఆ విషయమై యిద్దరికీ పెద్ద గొడవ అయింది. ఆ విషయమే కాదు, ప్రతీ చిన్న విషయానికి తనతో ఆమెకు గొడవే.

సుశీల వంటింట్లో సామాను చక్కబెట్టున్నప్పుడు, ప్రభాకరరావు తను కష్టంమీద సంపాయించిన నిద్ర మాత్రలు, విస్కీసీసాలో పడేసి, శుభ్రంగా అవి కరిగే వరకు షేక్ చేశాడు. పగిలిపోకుండా ఆ సీసాని శుభ్రంగా కడిగి అందులో కొంచెం విస్కీ పోసి షెల్ఫ్‌లోవుంచాడు ఎవరికీ అనుమానం రాకుండా. ఇంతవరకూ తను చాలా తెలివిగానే వ్యవహరించాడు. ఇకముందు కూడా చాలా

జాగ్రత్తగా వుండాలి. లేకపోతే ప్రమాదం.

ఇలా ఆలోచిస్తూ రెండడుగుల దూరం వెళ్ళి పరిశీలించాడు. ఫరవాలేదు యెవరికీ అనుమానం రాదు, అని నిర్ధారణ చేసుకుని, కారు వద్దకు వెళ్ళి కారు స్టార్టు చేసుకుని బయలుదేరాడు.

తమ వివాహమై ఆరేళ్ళు గడిచింది. తమిద్దరి జీవితం యెప్పుడూ కలహాంతోనూ, వాదాలతోనూ గడచిపోయింది. తను యెంత శాంతపరుడో, ఆమె అంత కోపిష్ఠి. ప్రతీ చిన్న విషయానికి తనతో పోట్లాడేది. మద్యం అలవాటు అయిన తరువాత ఆమె బాధ మరీ యెక్కువైంది. విడాకులు ఇద్దామని అనుకున్నాడు. కానీ. ఆమెకు అంత చిన్న శిక్ష సరిపోదు. ఇన్నాళ్ళుగా తనను పెట్టిన నరకయాతనకు ఆమెకు యిదే శిక్ష.

ఆ చిన్న దారిలోంచి హైవేకి కారు త్రిప్పాడు. ఆలోచనలు, మరల ఇన్‌స్పెక్టర్‌కి, తనకు జరగబోయే సంభాషణమీదకు మరలాయి.

అనుమానం లేదు, ఇన్‌స్పెక్టర్ అడుగుతాడు, "మీరు మీ భార్య పేరున ఏమైనా ఇన్సూరెన్స్ చేయించారా?"

తను "లేదు. నా పేరునే రెండు పాలసీలు వున్నాయి" అంటాడు.

ఇన్‌స్పెక్టర్, "లేదు," అని నోట్ బుక్‌లో రాసుకుంటాడు.

"మీరు పది నుంచి అయిదుముప్పైవరకు ఫ్యాక్టరీలోనే వున్నారా?"

"యస్! ఇన్‌స్పెక్టర్. నేను 9-30 కి బయలుదేరి 5 నిమిషాలు తక్కువగా పది గంటలకు ఫ్యాక్టరీ చేరుకుంటాను రోజూ. సరిగ్గా పదిగంటలకు మా కార్లు వుంచే

పార్కింగ్ ప్లేస్ మూసేస్తారు "

"అదేం?"

"సుమారు ఆరునెలల క్రితం మా ఫ్యాక్టరీలోని రెండు కార్లు దొంగలించబడ్డాయి. అవి మా ఫ్యాక్టరీలో పనిచేసే వారివల్లే జరిగిందని మా యాజమాన్యం అనుమానిస్తోంది. అప్పట్నుంచి పార్కింగ్ ప్లేస్ చుట్టూ ఫెన్సింగ్ కట్టి ఉత్తరం వైపుగా, దక్షిణం ప్రక్కగా ఒకటే మొత్తం రెండు గేటు కీపర్లని అపాయింట్ చేశారు.

సరిగ్గా షిఫ్టు ప్రారంభమయ్యే టైముకి గేట్లు మూసేస్తారు. ఇంకొక 5 నిముషాలలో షిఫ్టు పూర్తవుతుంది అనగా గేట్లు తీస్తారు. 3 షిఫ్టులకి ఆ పార్కింగ్ ప్లేస్‌లోనే 3 స్థలాలు కేటాయించారు. ఏ షిఫ్టువారు ఆ స్థలాన్నే వినియోగించుకోవాలి. కారునిగానీ, స్కూటరుగానీ సైకిలుగానీ గేటువద్ద ఆపి స్వంతదారుడిని నేనే అని పాస్ చూపించి నిర్ధారణ చేసుకోవాలి."

"ఒకవేళ యెవరయినా కొన్ని కారణాలవల్ల ఆలస్యంగా వెళ్తే?" ఇన్‌స్పెక్టర్ అడగక మానడు.

"కొన్ని రోజులు అందరూ టైముకి వచ్చేవారు. ఆ తరువాత గేట్‌కీపర్లకి అందరూ గుర్తే. మరీ ఆలస్యంగా వచ్చినవారికి కార్లు లోపలపెట్టే అనుమతి లేదు. కాంపౌండులో మరెక్కడో పెట్టుకోవలసినదే. ఆ కార్లకిగానీ మారే వాహనాలకైనా కంపెనీ బాధ్యత వహించదు" తను అంటాడు ఏమాత్రం జంకు కనపడకుండా.

"మీ కారు రాత్రి పదిగంటల నుంచి ఉదయం 6 గంటలవరకు ఫ్యాక్టరీ పార్కింగ్ ప్లేస్‌లోనే వుందా?"

"అఫ్‌కోర్స్! నేను డ్యూటీలోనే వున్నానుగా."

"గేట్‌కీపరు వద్దకు ఎవరయినా వెళ్ళి షిఫ్టు మధ్యలో

బయటకు వెళ్ళాలి వాహనం తీసుకుంటాం గేటు తెరు అని అడిగితే గేటు తెరుస్తాడా?"

"రూలు ప్రకారం అయితే గేటుకీపరు అలా అడిగిన వారి పాస్ చూపి అతను ఏ డిపార్టుమెంటో తెలుసుకొని ఆ డిపార్టుమెంటుకి ఫోన్‌చేసి మధ్యలో వెళ్ళటానికి పర్మిషన్ వుందో లేదో తెల్సుకొని గానీ గేటు తీయడు. అప్పుడయినా అతని పేరు హోదా, లైసెన్సు, వాహనం పేరు, నెంబరు, టైము తనవద్ద నున్న పుస్తకంలో నోట్ చేస్తుంటాడు. అప్పుడు వాహనం తీసుకొని పోవచ్చు ఏ రకంగానైనా వాహనం పోకుండా ఈ జాగ్రత్త."

"గేట్‌కీపరు ఎప్పుడూ గేటువద్దనే వుంటాడా?" ఇన్‌స్పెక్టర్.

"ఎస్. ఈ విషయంలో మేనేజిమెంటు చాలా కఠినం."

కానీ అది నిజం కాదు. సౌత్‌గేటు వద్దుండే రాములు, గేటు మూసేసిన తరువాత నార్తుగేటు వద్దనున్న జగ్గారావు వద్దకు వెళ్ళి బాతాఖానీ వేస్తాడు, ఉబుసుపోకకు. రాములుకి తెల్సు ఎవరయినా షిఫ్టు మధ్యలో కారులో బయటకు వెళ్ళాలంటే నార్త్‌గేటు లోంచే వెళ్తారని. ఆ గేటు ప్లాంట్‌కి దగ్గర.

ఒకవేళ ఇన్‌స్పెక్టరు వెళ్ళి రాములుని ప్రశ్నించినా రాములు నిజం చెప్పడు. అలా చెప్తే అతని ఉద్యోగం పోతుంది. జగ్గారావుకూడా రాములునే సమర్థిస్తాడు. ఆ ఏంగిల్ సేఫ్‌సైడు.

నిన్నరాత్రి తను డ్యూటీకి ముందుగా వెళ్ళి కారుని పార్కింగ్ ప్లేస్‌లో సౌత్‌గేటుకి దగ్గరగా వుంచాడు. రాత్రి 12 గంటలకు టీ బ్రేక్ అయిన తరువాత ఓ అరగంట

ఆగి నార్తు గేటువద్ద చూశాడు. రాములు, జగ్గారావు చాలా సీరియస్‌గా ఏదో మాట్లాడుకుంటున్నారు.

తను సౌత్‌గేటు వద్దకు వచ్చి మెల్లగా శబ్దం లేకుండా గేటుతాళం తీసి కారుని బయటకు కొంతదూరం త్రోసుకొని వచ్చి మరల గేటు తాళం యధాప్రకారం వేసాడు. పది హేను రోజులుగా గేటు డూప్లికేట్ తాళం చెవి తనవద్దే వుంది. ఆ తాళం చేవి పోయినట్లుగా రాములుకి తెలియనే తెలియదు. ఫ్యాక్టరీకి వెళ్ళగానే ఆ తాళంచెవులు యధా స్థానంలో వుంచేయాలి.

ఇన్‌స్పెక్టర్ మరల అడగవచ్చు.

"నిన్న ఏ కారణం చేతనైనా మీరు మీ కారుని పార్కింగ్ ప్లేస్‌లోంచి తీశారా? మీరు డ్యూటీలోంచి మధ్యలో యెక్కడికైనా వెళ్ళారా?"

"లేదు" తను విసుగ్గా ముఖంపెట్టి, "కావాలంటే మీరు ఎంక్వయిరీ చేసుకోవచ్చు"

"మీ కారు నెంబరు?"

"AAA 1212."

"మీ హోదా ఫ్యాక్టరీలో."

"నాది షిఫ్టు సూపర్‌వైజర్ డెజిగ్నేషన్."

ప్రభాకరరావు తన వెనుక వస్తున్న గ్రే కలర్ కారుని గమనిస్తున్నాడు. 5 నిమిషాలుగా అది తన వెనుకే వస్తోంది. ఎక్కడ్నుంచి వెంబడిస్తోందో ఏమిటో? ఆలోచనలు తిరిగి ఆ కారుమీద నుంచి మళ్ళాయి

"షిఫ్టు సూపర్‌వైజర్ అంటే?" ఇన్‌స్పెక్టర్ అడుగు తాడు.

"అంటే, ప్రతీ షిఫ్టుకి ఒక సూపర్‌వైజర్ వుంటాడు. ప్రతీ సెక్షను మేము ఒక కంట కనిపెడుతూ వుండాలి.

ప్రతీ గంటకు టైము నోటు చేసుకొని వర్క్ ప్రోగ్రెస్ ఎలా వున్నదీ రిపోర్టు వ్రాసుకోవాలి."

"మీరు ప్లాంట్ అంతా తిరగాలి. అంటే నిన్నరాత్రంతా మీరు ప్లాంట్‌లోనే వున్నట్లు చాలామంది సాక్ష్యం యివ్వ గలరు. అవునా?"

"అఫ్‌కోర్స్."

తనకు ఎలిబీ వుంది. కానీ యెక్కడో చిన్న వీక్‌నెస్ వుంది. అయినా ఫర్వాలేదు ఒకే మనిషి ఒకే సమయంలో రెండుచోట్ల వుండలేడు గదా.

ప్లాంట్ ప్రత్యేకమైన నాలుగు షెడ్సులో నాలుగు సెక్షనులుగా విభజింపబడి వుంది. తను వచ్చే ముందే రెండు రౌండ్లు పూర్తిచేశాడు. గంటా, గంటన్నవరకు తను రౌండ్స్‌కి వెళ్ళకపోయినా ఫరవాలేదు.

రియర్‌వ్యూలో మరల చూశాడు ఆ కారు యింకా తన వెనుకే వస్తోంది. తను మెల్లిగా డ్రైవ్ చేస్తున్నాడు ఓవర్ టేక్ చేస్కుంటూ వెళ్ళిపోవచ్చుగా.

బస్ డిపో వద్దకు రాగానే కారు స్లో చేసి కారు మలుపు త్రిప్పాడు. వెనుక వస్తున్న కారు కూడా మలుపు తిరి గింది.

ప్రభాకరరావుకి చెమటలు పట్టాయి. కొంపతీసి పోలీస్ కారు కాదుకదా? పోలీస్ కారుకి ఆ రంగు వుండదే మరి మఫ్టీలో నున్న పోలీస్ ఆఫీసరా? స్పీడోమీటరు చూశాడు. స్పీడు లిమిట్స్‌లోనే తను వెళ్తున్నాడు మరి?

ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారు ఆపి రియర్‌వ్యూలో చూశాడు. ఆ కారు కూడా ఆగింది. గ్రీన్ సిగ్నల్ చూసి కారు స్టార్టు చేశాడు. వెనుక కారు కూడా బయలుదేరింది. తన వెనుకే వస్తోంది.

కొంతదూరం వరకు వెనకే వస్తున్న గ్రే కలర్ అంబాసిడర్ ప్రక్క సందులోనికి తిరిగింది. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొన్నాడు.

ఫ్యాక్టరీ దగ్గరవుతున్నది అనగా హెడ్ లైట్సు ఆర్పి, ఫ్యాక్టరీ కాంపౌండ్ లోకి కారు త్రిప్పి, మెల్లగా పార్కింగ్ ప్లేస్‌వద్ద కారాపి, కారు దిగి సౌత్ గేటు తాళంతీసి కారుని యథాస్థానంలో వుంచి, గేటు తాళంవేసి, తాళంచెవులు తీసిన చోటునే వుంచి, తన గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. దారిలో ఎవరికీ తను తారసపడలేదు.

2

గ్రే కలర్ అంబాసిడర్ కారు ఒక రెండంతస్తుల భవనం ముందు ఆగింది.

ఆ భవంతికి "దినతంతి" పత్రికా కార్యాలయం అనే బోర్డు వుంది. ఇంతవరకూ ఆ కారుని డ్రైవ్ చేస్తున్న వ్యక్తి కారు ఆపి, ఆ భవనంలోకి నడిచాడు "ఎడిటర్" అన్న చిన్న బోర్డు వున్న గదిలోకి తలుపు తోసుకొని వెళ్ళాడు.

"సర్! రాత్రి ఒంటిగంట నుంచి 3 గంటల వరకు జాగరణ చేసి, ఓ కారుని ఫాలో అయ్యాను. ఇదిగో ఆ కారు నెంబరు AAA 1212."

"గుడ్! ఆ అదృష్టవంతు డెవరో తెల్సుకో. రేపు ఉదయం ట్రాఫిక్ వారోత్సవాల సందర్భంగా మనం మొదటి పేజీలో వేయబోయే శీర్షికలో అతని ఫోటో, వివరాలు ముద్రించి, "ట్రాఫిక్ రూల్స్‌ని ఏ మాత్రం ఉల్లంఘించకుండా కారు నడిపే వ్యక్తి." అని వేద్దాం. గుడ్‌నైట్!"

□

ఫోన్ ఫ్రెండ్

బొమ్మిరెడ్డి అచ్యుతరావు

అతను అడుగులో అడుగు వేసుంకుటూ స్మశానంలోనికి ప్రవేశించాడు.

చుట్టూ ఎటుచూపినా సమాధులు. ఓ పక్కగా శవం యింకా కాల్తూనే వున్నది. దానిగురించి పట్టించుకునేవాళ్ళు లేరు. ఎక్కడ్నుంచో తీతువు వికృతంగా అరుస్తోంది.

ఆకాశం మేఘావృతమై వున్నందువల్లనో యేమో గాఢాంధకారం నేలమీద పరుచుకుని వున్నది.

అతను మళ్ళీ చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. మెల్లిగా తనక్కావలసిన చోట ఆగాడు. ఒకటికి రెండు సార్లు గుర్తులు సరిచూసుకుని తను త్రవ్వాల్సిన స్థలం అదే నని నిర్ధారణ చేసుకున్నాడు.

తనవెంట తెచ్చుకున్న గడ్డపలుగుతో ఆ స్థలం తవ్వటం ప్రారంభించాడు. ఇంతలోనే తన వెనగ్గా అలికిడి!

అతను తవ్వటం ఆపి చటుక్కున వెనుతిరిగి చూశాడు. గుండె దడదడ కొట్టుకుంటోంది. ఓ మూలగా వున్న దిరిశెన చెట్టు దగ్గర్నుంచి వచ్చిందా సవ్వడి! కళ్ళు చికిలించి చూశాడు చీకట్లోకి. ఎవరూ కనిపించలేదు. అంతా తన భ్రమ అని గ్రహించాడు.

అతను ఒంగి మళ్ళీ తవ్వటం మొదలుపెట్టాడు. ఎక్కడ్నుంచో రివ్వు రివ్వున గాలి తెరలు తెరలుగా వీచింది. అతని చెవిదగ్గర ఏదో గుసగుస ధ్వని వినిపించింది. నివ్వెరపోయి ఓ నిముషం చేస్తున్నపని ఆపి పక్కలకు చూశాడు. తనున్నది స్మశానం అన్నది గుర్తురాగానే సన్నగా వణుకు ప్రారంభమయ్యింది. కాని అదీ కొద్దిసేపే! తిరిగి తన పనిలో నిమగ్నమయిపోయాడు.

అకస్మాత్తుగా నక్కలు ఊళలువేస్తూ అటు యిటు పరుగెత్తసాగాయి. వాటి ఊళలు చాలా వికృతంగా కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి. ఎక్కడో సమాధుల్ని కాళ్ళతో రక్కి మట్టి బయటకు లాగుతున్నట్టున్నాయి. అప్పటికే శవాల్ని బయటకు లాగిన నక్కలు ఎముకలు కొరుకుతున్న సూచనగా పటపట మన్న సవ్వడి వినిపిస్తోంది. ఓ పక్క శవాలు యింకా కాల్తున్నట్టు కవురు కంపు.

ఇన్నిటి మధ్యా అతను తన పని కొనసాగిస్తూనే వున్నాడు. పట్టుదలగా తవ్వుతున్నాడు. అప్పటికి అడుగున్నర తవ్వాడు. ఇంకా లోతున పాతిపెట్టినట్టున్నారు నక్కలకి దొరక్కుండా వుండాలని!

చుట్టుపక్కల ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎముకలు విరుగుతున్నట్టు ఫటఫట మని శబ్దాలు! ఎవరో నడచివస్తున్నట్టు తనని చుట్టుముడుతున్నట్టు లోలోపల భయాందోళనలు! అయినా అత నీసారి దేన్నీ లెక్కచేయకుండా అలా తవ్వుతూనే వున్నాడు. తల పక్కల కూడా తిప్పటం లేదు!

మరో అయిదు నిమిషాలు తవ్వేసరికి అతని శ్రమ ఫలించింది! శవం కనిపించింది. మట్టి పెళ్ళగించి కర్రలా చల్లగా బిగిసిపోయి వున్న శవాన్ని పైకి తీసి గొయ్యి పక్కనే వెల్లకిలా పరుండబెట్టాడు. అది ఓ స్త్రీమూర్తి శవం!

రెండురోజుల క్రితం పాతిపెట్టబడినట్టుంది. చెడిపోతున్న వాసన వస్తోంది. అది శవమనిగాని, దాన్నుంచి దుర్గంధం వస్తున్నదనిగాని, స్మశానం నడిబొడ్డున, అర్ధరాత్రి సమయంలో తను శవం పక్కన నిల్చున్న సంగతి గాని అతని కప్పుడు గుర్తులేదు! ఆత్రుతగా ఆమె శరీరాన్ని తడుముతున్నాడు.

సరిగ్గా అప్పుడే ఆ ప్రదేశమంతా సెర్చి లైట్ల వెలుగుతో నిండిపోయింది! పట్టపగలుగా మారిపోయింది.

ఆ వ్యక్తి నిర్ఘాంతపోయి చూశాడు.

ఎదురుగా పోలీసులు! గజగజ లాడిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ చేతిలో లాఠీతో రుద్రుడిలా వున్నాడు. "మిస్టర్! ఏం చేస్తున్నావిక్కడ? నువ్వెవరు?

ఆ శవంతో నీకేం పని?" అన్నాడు ఉరుముతున్నట్టు.

ఆ వ్యక్తి గజగజ వణికిపోయాడు. "నేను.... నేను.... చదువుకున్న నిరుద్యోగిని సార్! నా పేరు కనకారావు. సాయంత్రం ఒకాయన కనిపించి. 'నీకు డబ్బు కలిసొచ్చే పని చెపుతాను చేస్తావా?' అనడిగాడండి. వారంరోజులుగా అర్థాకలితో పడున్నాం యింటిల్లపాదిమీ అందుకని వెంటనే సరేనన్నాను.

'అయితే స్మశానంలో ఫలాని దిరిశెన చెట్టు సమీపంలో కొత్తగా పాతిన సమాధిలోనించి శవాన్ని పైకి తీసి, శవం ఒంటిమీదున్న బంగారు వస్తువులు ఏరుకో!దాదాపు అయిదు వేలు విలువగలవి!' అని చెప్పాడండి. బంగారంతో శవాన్ని ఎవరయినా పాతిపెడతారా? అని నేను అనుమానం వ్యక్తం చేస్తే 'నీకు కావాలంటే పోయి నేను చెప్పినట్టు చెయ్యి. డబ్బక్కర్లేదంటే మానెయ్యి దరిద్రంతో బాధపడుతున్నావని నీకి దారి చూపించాను. నీ యిష్టం!' అన్నాడండి.

ఆశతో ఈ అర్ధరాత్రిపూట శవాల అవశేషాలని తొక్కుకుంటూ ఆశ భయాన్ని జయించగా యీ సమాధి తవ్వి శవాన్ని పైకి తీశానండి!" అన్నాడు.

శ్రీనివాస్ పకపక నవ్వాడు. "కథ బాగా అల్లావు. ఏదయినా పత్రికకి పంపించు పారితోషికం యిస్తారు.... చూడు బాబూ, నీ కథలు నమ్మేటంత తెలివితక్కువవాళ్ళెవరూ లేరిక్కడ! సరే, నువ్వు చెప్పిందే నిజమనుకుందాం. మరి; శవం ఒంటిమీద చిన్నమెత్తు బంగారం కూడా లేదేం! బంగారంతో శవాన్ని పూడ్చే మూర్ఖులెవరు?" అన్నాడు వ్యంగ్యంగా.

కనకారావుకి ముచ్చెమటలు పోశాయి. "నిజం సార్, నేను చెప్పింది అక్షరాలా నిజం! బంగారముందనే ఆశ

తోనే భయాన్ని లెక్కచేయకుండా సమాధి తవ్వి శవాన్ని పైకి తీశాను. నన్ను నమ్మండి సార్!" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమయిపోయాడు.

"ఆ సంగతులన్నీ స్టేషన్‌లో చెప్పుదువుగాని, పద, వీడ్ని అరెస్టు చేసి వేన్‌లో పడెయ్యండి!" అంటూ కానిస్టేబుల్స్‌ని ఆదేశించాడు శ్రీనివాస్.

"శవాన్ని పూడ్చెయ్యమంటారా సార్...." కానిస్టేబిల్స్ అడిగారు.

శ్రీనివాస్ దృష్టి శవంమీద కేంద్రీకరించింది. అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. శవం గొంతుమీద, ఛాతీమీద కత్తిపోట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రక్తం గాయాల చుట్టూ గడ్డకట్టుకు పోయి వికృతంగా కనిపిస్తోంది.

శ్రీనివాస్ కనకారావువంక తీక్షణంగా చూసి, "ఈ యువతిని హత్యచేసి పూడ్చిపెట్టావు నిన్నో మొన్నో! తర్వాత మాకు తెలిసిపోతుందని నీకు ఎందుకో నమ్మకంగా అనిపించింది, శవాన్ని కాల్చెయ్యాలనే ఉద్దేశంతో, సాక్షాధారాలు దొరక్కుండా చెయ్యాలనే సంకల్పంతో యీ అర్ధరాత్రి పూట సమాధి తవ్వి పైకి తీశావు. మేము రావటం ఓ పదినిమిషాలు ఆలస్యం చేస్తే, శవాన్ని తగలపెట్టేసి వుండేవాడివి! నువ్వు హంతకుడివి! నో డౌట్!.... చెప్పు, ఈమె నెందుకు హత్య చేశావు? ఈమె నీకేమవుతుంది? వివరంగా చెప్పు!" అన్నాడు కోపంగా.

కనకారావు నిలువునా కూలిపోయాడు. చేతులతో ముఖాన్ని కప్పుకుని ఏడుస్తూ, "నాకే పాపమూ తెలియదు సార్! నేను హంతకుడ్ని కాదు! ఈ చనిపోయిన యువతి ఎవరో నాకు నిజంగా తెలియదు. కేవలం బంగారం మీది

ఆశతోనే నే నీ పనికి పూనుకున్నాను. నన్ను నమ్మండీ సార్, నమ్మండి!" అంటూ గోల పెట్టాడు.

శ్రీనివాస్ సార్జంటు శివాన్ని చూసి, "శవాన్ని స్టేషన్ కి తరలించు. ఇతనికి బేడీలు వేసి వేన్ లో తీసుకురండి!" అంటూ గొయ్యిదగ్గర నిల్చుని లోపలకు తొంగిచూశాడు. గొయ్యిలో యెలాంటి అనుమానించదగ్గ వస్తువులుగాని, ఆధారాలుగాని కనిపించలేదు.

తల పంకించి, స్మశానం బయట పార్కు చేసిన తన బుల్లెట్ యెక్కి ముందు కురికించాడు.

బుల్లెట్ శరవేగంతో స్టేషన్ వైపు దూసుకుపోయింది.

2

స్టేషన్ కొచ్చి సీట్లో కూచున్నాడు ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్.

తెల్లవారుఝాము సమయం.

టెలిఫోన్ గణగణ మోగింది.

"హలో, క్రైంబ్రాంచ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ హియర్!" అన్నాడు ఫోనెత్తి.

"సుప్రభాతం సార్! హంతకుడు దొరికాడనుకుంటాను!?" అని వినిపించింది అవతల్నుంచి.

శ్రీనివాస్ వెంటనే గుర్తుపట్టాడా గొంతుని. గంట క్రితం అతనే ఫోన్ చేసి స్మశానంలో క్షుద్రశక్తుల్ని కొలిచే ఓ మాంత్రికుడు శవాల్ని పైకి తీసి పూజలు చేస్తున్నాడనీ, వెంటనే వెళ్తే దొరుకుతాడనీ, చెప్పాడు. ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోగలరని చెప్పి మరీ ఫోన్ పెట్టేశాడు. తనెవరో చెప్పలేదు.

"మిస్టర్, మీరెవరో తెలియదుగాని, మాతో అబద్ధమెందుకు చెప్పారు?" అడిగాడు శ్రీనివాస్.

"అబద్ధమా? మీకు శవాన్ని పైకి తీసిన వ్యక్తి దొరి కాడా లేదా?"

"దొరికాడు. కాని యిందాకా మీరు ఫోన్‌చేసినపుడు క్షుద్రశక్తుల్ని ఆవాహన చేసుకునే మాంత్రికుడని అబద్ధం చెప్పారు కదా!"

"క్షమించండి సార్! అలా అయితే మీరు వెంటనే స్పాట్‌కి వెళ్తారని చెప్పాను. అఫ్‌కోర్స్ హత్య కేసు అని చెప్పినా వెళ్తారనుకోండి! తక్షణం వెళ్తారని అలా చిన్న అబద్ధమాడాను, అంతే! మీ దృష్టిలో ఆ శవం పడాలన్న నా ఉద్దేశ్యం నెరవేరింది!"

"కనకారావు ఆ స్త్రీని హత్య చేయగా మీరు చూశారా? అతను శవాన్ని పూడ్చిపెట్టడం కూడా మీరు చూశారా?"

"కనకారావు నిర్దోషి. అతన్నేం చెయ్యకండి. అతను నిమిత్తమాత్రుడు మాత్రమే!"

శ్రీనివాస్ విస్తుపోయి, "అదేమిటి మళ్ళీ ప్లేటు ఫిరాయిస్తున్నారు?" అడిగాడు.

"అవును సార్! కనకారావు హత్య చెయ్యలేదు. నేనే అతన్ని బంగారం ఆశపెట్టి స్మశానానికి పంపించాను. అత నెవరో కూడా నాకు తెలీదు. నేను హోటల్ సంధ్యాలో టిఫిన్‌చేసి వస్తుంటే ఆ హోటల్ మేనేజర్ని ఏదయినా ఉద్యోగం యిమ్మని అడుగుతున్నాడు. మేనేజర్ ఖాళీలేదు పొమ్మంటే సర్వరు ఉద్యోగమయినా యిమ్మని బతిమాలు తున్నాడు. మేనేజర్ కసురుకుని పొమ్మన్నాడు. అతను డీలా పడిపోయి బయటి కొచ్చేశాడు.

అప్పుడు అతనికి కడుపునిండా టిఫిన్ పెట్టించి, స్మశా నానికి వెళ్ళి శవాన్ని పైకి తీస్తే శవం ఒంటిమీదున్న బంగారం నీకు దక్కుతుందని ఆశపెట్టి స్మశానం వెళ్ళ

టానికి ప్రోత్సహించాను. నీకు బంగారం దక్కే యోగ ముంది కాబట్టే నీ పేరు చిన్నప్పుడే కనకారావని నిర్ణయ మయిపోయిందని ఛలోక్తులు వేశాను. నన్ను నమ్మి కనకారావు నేను చెప్పినట్టే చేసి మీ చేతుల్లో చిక్కుకు పోయాడు."

"మీరు చెప్పిందంతా చాలా డొంకతిరుగుడుగా వుంది. మీరు శవం గురించి మాకు ఇన్ఫర్మేషన్ యివ్వాలను కుంటే యిది తప్ప మరోదారి లేదా? అసలు యింతకీ ఎవరి దా శవం? హంతకు డెవరు?"

"అవన్నీ తెల్సుకోవలసింది మీరు! గుడ్ బై!" అంటూ ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

శ్రీనివాస్ నిర్ఘాంతపోయాడు—అంత త్వరగా అతను డిస్కనెక్ట్ చేస్తాడని అనుకోలేదు. కేసని అయోమయ స్థితిలో పారేసి అతను ఫోన్ పెట్టేశాడు.

"డామిట్!" కోపంగా నేలని బూటుకాలితో తన్నాడు శ్రీనివాస్. సార్జంట్ శివాన్ని పిలిచాడు.

"మార్చ్యురీకి తరలించాం సార్ శవాన్ని. డ్యూటీ పాథాలజిస్ట్ పోస్ట్‌మార్టంకి అటెండయ్యారు. బరియల్ గ్రౌండ్ వాచ్‌మన్‌ని ఎంక్వయిరీ చేశాను. ఆ శవాన్ని పూడ్చటం తను చూస్తుండగా జరగలేదని, దొంగతనంగా పూడ్చిపెట్టి వుంటారనీ చెప్పాడు" అన్నాడు శివం.

శ్రీనివాస్ తలూపి "డాక్టర్ రిపోర్టు వస్తేనేగాని యీ కేసులో ముందుకు సాగటానికి వీల్లేకుండా వున్నది. వీలయి నంత త్వరగా రిపోర్ట్ తయారుచేసి యిమ్మని పాథాలజిస్ట్‌కి చెప్పు" అన్నాడు.

శివం వెళ్ళిపోయాక, తలా తోకా లేని ఆ కేస్ గురించి సింహావలోకనం చేసుకున్నాడు శ్రీనివాస్.

అసలు ఆ యువతి ఎవరు? ఫోన్ చేసి చెప్పిన వ్యక్తికి ఆమెకి ఏమిటి సంబంధం! కనకారావు నిజంగా నిమిత్త మాత్రుడేనా? ఫోన్ వ్యక్తి కనకారావు గురించి చెప్పిన విషయం యెంతవరకు నిజం? ఫోన్ వ్యక్తికి యీ హత్యతో ఎలాంటి సంబంధముంది?

ఆమెను ఫోన్‌వ్యక్తి హత్య చేసివుంటే కావాలని శవం పాతిపెట్టబడ్డ విషయం తమ దృష్టికి తీసుకురాడు! కనకారావు నిర్దోషి అని తనకు ఫోన్ చేసి మరీ చెప్పాడు గాబట్టి కనకారావుపట్ల అతనికి కక్ష యేదీలేదు. అయితే అతని కక్ష ఆ యువతిని హత్యచేసిన వ్యక్తిపట్ల వుండి వుండాలి!

కరెక్టు! ఫోన్‌వ్యక్తికి హంతకుడు శత్రువై వుండాలి. అందుకే హత్య జరిగిన సంగతి తమ దృష్టికి తెచ్చి కేసును మలుపు తిప్పాడు.

ఇంతకీ ఎవరా ఫోన్‌వ్యక్తి?

శ్రీనివాస్ మస్తిష్కం ఆలోచనలతో వేడెక్కి పోయింది తల విదిలించాడు అసహనంగా.

అప్పుడే పూర్తిగా తెల్లవారింది.

3

శ్రీనివాస్ తన చేతిలోని పోస్టుమార్టం రిపోర్ట్సు మరో సారి చదివాడు.

"కత్తిపోట్లవల్ల విపరీతంగా రక్తస్రావం జరిగి ఆమె ప్రాణం పోయింది. ఆమెను హత్యచేయటానికి ముందు సామూహిక మానభంగం చేశారు. హత్య జరిగి కనీసం నలభై యెనిమిది గంట లయివుంటుంది. ఫోరెన్సిక్ రిపోర్టులో పూర్తి వివరాలు లభించగలవు" అని వున్నదా రిపోర్టులో.

హత్యకు మోటివ్ దొరికింది. సామూహిక మాన భంగం! దుండగులు ఆమెని యెలాగో ఎత్తుకుపోయి మాన భంగం చేసి, ఆ తర్వాత కత్తితో పొడిచి భూస్థాపితం చేశారు. అయితే ఆ అమ్మాయిని ఎత్తుకుపోయినట్టుగాని, కనిపించకుండా పోయినట్టుగాని ఏ పోలీసు స్టేషన్‌లో నయినా ఫిర్యాదు చేయబడి వుండాలి! రెండురోజుల క్రితం అలాంటి కేసు ఏదయినా నమోదు చేయబడిందేమో కనుక్కోవాలి!

శ్రీనివాస్ చకచక పోలీస్‌స్టేషన్స్ అన్నిటికీ రింగ్‌చేసి ఎంక్వయిరీ చేశాడు.

త్రీటౌన్ స్టేషన్ నుంచి కావలసిన సమాచారం అందింది. సరిగ్గా రెండురోజుల క్రితం యిరవై రెండేళ్ళ యువతి కనిపించకుండా పోయినట్టు ఆమె భర్త సుకుమార్ రిపోర్టిచ్చాడు. ఆమె పేరు రేవతి. ఆమె ఫొటో అడ్రస్ తదితర వివరాలు వెంటనే స్పెషల్ మెసెంజర్‌తో పంపమని చెప్పి ఫోన్ పెట్టేశాడు శ్రీనివాస్.

సరిగ్గా అరగంటలో వివరాలందాయి.

ఫోటోలో వున్న రేవతి, హత్య చేయబడిన యువతి ఒక్కరే!

శ్రీనివాస్ ఊపిరి బిగబట్టి వివరాలు చదివాడు.

ప్రతాప్‌నగర్ వాటర్‌టాంక్ దగ్గరుంది సుకుమార్ యిల్లు. సోమవారం సాయంత్రం రేవతి షాపింగ్ కోసమని మెయిన్‌బజార్‌కి వెళ్ళింది. రాత్రి పది దాటినా ఆమె యింటికి తిరిగిరాకపోవటంతో సుకుమార్ త్రీటౌన్ స్టేషన్‌లో రిపోర్టు చేశాడు.

సుకుమార్ ప్రభుత్వోద్యోగి. రేవతి గ్రాడ్యుయేట్. ప్రేమ వివాహం. అయినా యిరుపక్షాల పెద్దల ఆమోద

ముద్రతోనే చేసుకున్నారు. పిల్లల్లేరు. వివాహమయి నాలు గేళ్ళు కానస్తోంది. ప్రతాప్‌నగర్‌లో యిల్లు అద్దెకు తీసుకుని వుంటున్నాడు సుకుమార్. ఇంట్లో వాళ్ళిద్దరే వుంటు న్నారు.

శ్రీనివాస్ మరుక్షణం బుల్లెట్ మీదున్నాడు. మరో పది నిమిషాల తర్వాత బుల్లెట్ సుకుమార్ యింటి ముందు న్నది.

సమయం ఏడుగంటల పదినిమిషాలయింది. రేడియోలో నుంచి వార్తలు వస్తున్నాయి.

శ్రీనివాస్ కాలింగ్‌బజ్జర్ నొక్కాడు. రెండు నిమిషాల తర్వాత ముప్పయ్యేళ్ళ యువకుడు బయటికొచ్చాడు. అంత క్రితమే మేల్కొన్నట్టు బద్ధకంగా వున్నాడు. శ్రీనివాస్‌ని ఆశ్చర్యంగా చూసి, అంతలోనే తన భార్య గురించిన సమాచారం తెచ్చాడేమోనని సాదరంగా ఆహ్వానించాడు లోపలికి.

"మీ పేరు సుకుమారేనా?" అడిగాడు శ్రీనివాస్.

"అవును సార్!"

"మీ భార్య తప్పిపోయినట్టు రిపోర్టిచ్చారు కదూ!"

"అవును సార్! సోమవారం రాత్రిచ్చాను. ఏమైనా వివరాలు తెలిశాయా సార్!?"

"చెపుతాను. మీకు శత్రువు లెవరైనా వున్నారా?"

"మాకా? అబ్బే, మా కెవరితోను శత్రుత్వం లేదండి. మేమిద్దరం కూడా కామ్‌గోయింగ్! ఏం సార్ అలా అడి గారు?"

"ఊరికినే. తెలుసుకుందామని, ఆc.... రేవతిగారికి డైరీరాసే అలవాటేమయినా వుందా?"

"ఆc....రాస్తుందిసార్! అయితే అందులో శత్రువుల

విషయమేదీ....”

“ఉండదంటారా? అయినా ఓసారి చూస్తే మనకే దయినా ఆధారం దొరకొచ్చు.”

సుకుమార్ డైరీ తేవటానికి లోపలికి వెళ్ళాడు. రేవతి మరణించిన విషయం అతనితో ఎలా చెప్పాలా అని తర్జన భర్జనలు పడుతున్నాడు శ్రీనివాస్. అసలే ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఈ షాక్ భరించగలడా? నెమ్మదిగా అతను షాక్ అవకుండా విషయం చెప్పాలి.

రెండు నిమిషాల తర్వాత సుకుమార్ రేవతి డైరీతో వచ్చాడు. శ్రీనివాస్ డైరీ పేజీలు తిరగేశాడు:

దాదాపు ప్రతిపేజీ ఖాళీగానే వున్నది. అక్కడక్కడ ఆమె తన మనస్సులోని భావాలు అందమయిన అక్షరాల రూపంలో గుదిగుచ్చుకున్నది ఎక్కువ భాగం సుకుమార్ పట్ల ఆమెకు గల అవ్యాజమైన ఆరాధన, అనురాగం, ప్రేమను చాటుతున్నది సుకుమార్ అదృష్టవంతుడు ఆవిధంగా! కాని అంతటి అదృష్టమూర్తిని పోగొట్టుకుని దురదృష్టవంతుడు!

శ్రీనివాస్ దృష్టి అకస్మాత్తుగా ఓ పేజీమీద నిలిచి పోయింది. ఆమె హత్య చేయబడటానికి మూడు రోజుల ముందు శుక్రవారంనాడు యిలా రాసుకున్నదామె.

“రెండు రోజులుగా ఆ రోగ్ వెంటపడుతున్నాడు. మొన్న చెప్పుతీసి కొట్టబోయాను. ఈ రోజు మళ్ళీ వెంట బడి అసభ్యంగా మాట్లాడాడు. చెంప పగలగొట్టాను. ఆయనతో చెప్తేచాలు, వాడి రక్తం కళ్ళ చూస్తారు. కాని విషయం ఆయనదాకా వెళ్ళటం అనవసరమని చెప్పలేదు. చెప్పను కూడా” అని రాసి వున్నది.

ఇంకా ఏమయినా వివరాలు దొరుకుతాయేమోనని డైరీ

అంతా ప్రతి పేజీ పరీక్షగా చూశాడు శ్రీనివాస్. కాని మళ్ళీ ఆ ప్రసక్తి ఎక్కడా లేదు. శనివారం నుంచి పేజీలు ఖాళీగా వున్నాయి. సోమవారం హత్య చేయబడిందామె.

సుకుమార్ ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీనివాస్ వంక. శ్రీనివాస్ తల అడ్డంగా తిప్పి డైరీ అతని కిచ్చేశాడు ఆ రోగ్ ఎవరు? అతని పేరు రేవతికి తెలియదా? అంత క్రితం అతను ఆమెను వెంటపడి వేధించినట్టు తెలుస్తోంది. కాని ఆ విషయం అంతక్రితం ఎక్కడా రాసుకోలేదామె. సుకుమార్‌కి అతని సంగతి చెప్పలేదు రేవతి. అతన్నడిగినా ఏం ప్రయోజన ముండదు.

సుకుమార్ ఆత్రుతగా చూశాడు శ్రీనివాస్ వంక. "ఏం సార్, నా భార్య సోమవారం తప్పిపోయింది. ఈ రోజు లక్ష్మీవారం ఆమె ఆచూకీ ఏమీ తెలియలేదు. ఆమె ఏమయిపోయింది? నా భార్య బతికుండగా నేను చూడ గలనా? చెప్పండి సార్! ఆమె బతికే వుంటుందని, ఇవాళో రేపో చూస్తాననీ చెప్పండి సార్!" అతని కళ్ళవెంట బొట బొట కన్నీరు. బలవంతాన దుఃఖాన్ని నిగ్రహించుకుంటున్నాడు.

శ్రీనివాస్ గంభీరంగా చూశాడతని వంక. "మిస్టర్ సుకుమార్! మీరు మీ భార్యను యీరోజే చూడగలరు. కాని, ఆయామ్ సారీ....ఆమె బతికుండగా కాదు!" అన్నాడు.

సుకుమార్ పక్కలో బాంబు పడినట్టు అదిరిపడ్డాడు. "ఏమిటి సార్....మీ రనేది?"

"అవును మిస్టర్! మీ భార్య హత్యచేయబడింది."

సుకుమార్ మొదలు విరిగిన మానులా నేలమీద కూల

బడిపోయాడు. అతన్ని ఓదార్చగల శక్తి తనకు లేదని శ్రీనివాస్‌కి తెలుసు.

అయిదు నిమిషాల తర్వాత అతను స్వాంతనపడి "సార్.... చెప్పండి... ఎవరు .... ఎవరు ఆమెను పొట్టన బెట్టుకున్నది? నేను వెంటనే ఆమెను చూడాలి" లేచి చక చక గుడ్డలు వేసుకున్నాడు.

శ్రీనివాస్ మౌనంగా జాలిగా అతని వంక చూసి "అదే యింకా తెలియాల్సి వున్నది. నాతో రండి!" అంటూ బుల్లెట్‌వైపు దారి తీశాడు.

సుకుమార్ లోకంలోని సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా శ్రీనివాస్‌ని అనుసరించాడు.

4

శ్రీనివాస్ తన సీట్లో కూచొని రేవతి కేసు విషయం తీవ్రంగా ఆలోచిస్తుండగా ఫోన్ మోగింది.

విసుగ్గా రిసీవర్ ఎత్తి "హల్లో క్రైంబ్రాంచ్...." అన్నాడు పొడిగా.

"నమస్తే సార్! రేవతి హంతకుడు దొరికాడా?"

ఆ గొంతు వెంటనే గుర్తించాడు శ్రీనివాస్. అతనిలో అంతదాకా పేరుకున్న నిరుత్సాహం, చిరాకు ఎక్కడిది వక్కడ ఎగిరిపోయాయి.

"మిస్టర్ మీ రెవరోగాని మొన్న అకస్మాత్తుగా ఫోన్ పెట్టేసి మమ్మల్ని కన్‌ఫ్యూజన్‌లో పెట్టేశారు. రేవతి హంతకు డెవరో మీకు తెలుసు. అయినా చెప్పటంలేదు. ఎందుకో తెలీదు. అసలుమీరెవరు? రేవతి హత్య విషయం మీ కెలా తెలుసు? ప్లీజ్....చెప్పకుండా ఫోన్ పెట్టెయ్యొద్దు!" శ్రీనివాస్ అభ్యర్థించాడు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! నిజంగా రేవతి హంతకుడెవరో

నాకు తెలీదు. తెలిపిన నా స్నేహితుడ్ని కూడా హంతకుడు చంపేశాడనుకుంటున్నాను. రేవతిని చంపి పూడుస్తుండగా నా స్నేహితుడు రవి చూశాడు. వాడ్ని హంతకుడు, అతని స్నేహితులు వెంట తరిమారు.

రవి యిక వాళ్ళకు దొరికిపోక తప్పదని నిర్ణయించుకుని, దార్లో ఎదురయిన పబ్లిక్ బూత్ నించి నాకు ఫోన్ చేసి రేవతిని చంపేసి స్మశానంలో పూడ్చేశారని మాత్రం చెప్పాడు. ఇంతలో డిస్కనెక్టు అయింది ఫోన్. ఆ తర్వాత రవిని నేను చూడలేదు. వాడ్ని హంతకుడు చాంపేశాడనే నిర్ణయించుకున్నాను.

తర్వాత రేవతి హత్య విషయం మీ దృష్టికి తేవడం కోసం చిన్ననాటకం ఆడాను. ఆ సంగతి మీకు తెలిసిందే!...."

"చక్కటి విషయాలు చెప్పారు. థ్యాంక్స్! ఇంతకీ రేవతికి మీకు వున్న సంబంధ మేమిటో చెప్పలేదు."

"సంబంధ మేమిటంటే ఏం చెప్పను ఇన్‌స్పెక్టర్ గారూ! ఆమె నా అణువణువునా నిండి వున్నది. మానసికంగా నా కెంత సన్నిహితురాలో, బాహ్యంగా అంత దూరం! ఆమె, నేను, ఆమె భర్త సుకుమార్ డిగ్రీలో క్లాస్‌మేట్స్. నేను రేవతిని ఎంతో గాఢంగా ప్రేమించాను. కాని నా ప్రేమను మనసులోనే దాచుకున్నాను. అవకాశం చూసుకుని వెల్లడించాలనుకున్నాను. కాని ఆ అవకాశం, అవసరం శాశ్వతంగా రాకుండాపోయాయి.

ఆమె సుకుమార్‌ని గాఢంగా ప్రేమిస్తున్నట్టు తెలిసిన రోజున నాలో నేను ఎంతగా ఏడ్చానో, నా ప్రేమను వెల్లడి చేసుకోలేని నా పిరికితనాన్ని ఎంతగా అసహ్యించుకున్నానో మీకెలా చెప్పను!! నా ప్రేమను నాలోనే సమాధి

చేసుకున్నాను. సుకుమార్, రేవతిల వివాహాన్ని దగ్గరుండి జరిపించాను.

ఆనాటి నుంచి యీనాటివరకు రేవతి మంచి చెడ్డలు, సుఖ సంతోషాలు దూరం నుంచే పరిశీలిస్తూ ఆమెని కళ్ళారా చూసుకుంటూ ఆమెని మూగగా ఆరాధిస్తున్నాను. ఆమెను పొట్టన బెట్టుకున్న హంతకు దెవడో తెలిస్తే యింత ఆలస్యం చేస్తానా? మరుక్షణం వాడి నెత్తురు కళ్ళచూడనూ! అయితే నా ప్రయత్నాలు నేనూ చేస్తున్నాను."

"గుడ్! చాలా బాధ్యతగా రేవతిగారి గురించి మీ గురించి చాలా వివరాలు చెప్పారు. కానీ యింతదాకా కేసు ముందుకు అడుగిడలేదు. ఇంతకీ, మీ పేరేమిటో ఏం చేస్తుంటారో చెప్పండి."

"ఎందుకు లెద్దురూ నాలాంటివాడి గురించి వివరాలు? ఫోన్ ఫ్రెండ్‌గా గుర్తుపెట్టుకోండి. నేనే ఉద్యోగం చెయ్యటంలేదు. పెద్దలిచ్చిన ఆస్తి బాగానేవుంది. కూచుని తిన్నా తరగదు. బై....హంతకుడ్ని పట్టుకోగానే ఫోన్ చెయ్యండి."

"ఎలా? మీ ఫోన్ నంబరు, పేరు తెలీదుగా!"

"వద్దులెండి. నేనే రోజుకి రెండు మూడు సార్లు ఫోన్ చేసి కనుక్కుంటాను...."

"త్వరలోనే మనిద్దరం కలుద్దాం."

"ఓ, కే...." అతను ఫోన్ పెట్టేశాడు.

పక్కగదిలో కూచునివున్న సుకుమార్‌ని పిలిపించాడు. భార్యని శవరూపంలో చూసిన సుకుమార్ బాగా డీలాపడిపోయాడు. పదిరోజులుగా లంఖణాలు చేసినవాడిలా వున్నాడు.

"మిస్టర్ సుకుమార్! రేవతిగారు సోమవారం షాపింగ్‌కి వెళ్ళారని అన్నారు. ఏ షాప్‌కి వెళ్ళారో చెప్పగలరా?" అడిగాడు శ్రీనివాస్.

"ప్రతినెలా మొదటి వారంలో ప్రొవిజన్స్ తనే స్వయంగా తేవటం రేవతి కలవాటు. మెయిన్‌రోడ్‌లోని ప్రభాకర్ జనరల్ స్టోర్స్‌నించి ప్రతినెలా రెగ్యులర్‌గా సామానులు తెస్తుంది."

"సోమవారంనాడు ఆమె ఆ ఒక్క పనిమీదే వెళ్ళారా? లేక తదితర పనులేమైనా...."

"ఆ ఒక్క పనిమీదే...."

"థాంక్స్! .... డెడ్‌బాడీ మీకు అప్పగించెయ్యమని చెప్పాను. అయామ్ సారీ...." అంటూ శ్రీనివాస్ లేచి బయటికొచ్చాడు.

బుల్లెట్ మెయిన్‌రోడ్డువైపు దూసుకుపోయింది.

5

ప్రభాకర్ జనరల్‌స్టోర్సు యజమాని సాదరంగా ఆహ్వానించాడు శ్రీనివాస్‌ని.

"గత సోమవారంనాడు రేవతి అనే పేరుగల గృహిణి మీదగ్గిర ప్రొవిజన్స్ కోసమని వచ్చింది. ఆమె ఎన్ని గంటలవరకు యిక్కడున్నారో, ఏం తీసుకువెళ్ళారో చెప్ప గలరా?" అనడిగాడు శ్రీనివాస్.

షాపతను రెండు క్షణాల్లో చెప్పేశాడు. "రేవతిగారు మా రెగ్యులర్ కస్టమర్ సార్! సోమవారం సాయంత్రం యింట్లోకి సరుకులు కావాలని జాబితా యిచ్చారు. అవి కడ్తుండగా ఎవరో టాక్సీలోవచ్చి ఆమె భర్తగారికి ఏక్సిడెంట్ అయిందని చెప్పారు. ఆమె వెంటనే టాక్సీలో కంగారుగా వెళ్ళిపోయారు. కట్టిన సరుకులు అలాగే వుంది

పోయాయి. ఆమె మళ్ళీ రాలేదు....ఏం సార్, ఆమె భర్తగారు కులాసాయేకదా!...."

శ్రీనివాస్ తలూపి. "ఆ వచ్చినతను ఎలా వున్నాడు? మరోసారి చూస్తే గుర్తుపట్టగలరా?" అన్నాడు.

షాపతను తలూపి "గుర్తుపడతాను సార్! ఏం సార్ అసలేం జరిగింది? రేవతి భర్త సుకుమార్‌గారికి ఎక్సిడెంట్...." అంటూండగానే శ్రీనివాస్ అడ్డుతగిలి, "అదంతా అబద్ధం! ఆమె నెవరో దుండగులు టాక్సీలో ఎత్తుకుపోయారు" అన్నాడు రేవతి హత్యచేయబడిందని చెప్పకుండా.

షాపతను నివ్వెరపోయి అంతలోనే సర్దుకుని "పోయిన శుక్రవారం మా షాపుముందరే రేవతిగారు ఓ అబ్బాయిని చెంపమీద కొట్టారండి. బహుశా వాడుగాని కక్షపెట్టి ఎత్తుకుపోయాడేమో...." అన్నాడు.

శ్రీనివాస్ ముఖం వెలిగింది. "ఆ వ్యక్తి ఎవరో చెప్పగలరా?" అన్నాడు ముందుకు వంగి.

"అతనెవరో నాకు తెలియదు సార్....మరోసారి చూస్తే గుర్తుపట్టగలను. రేవతిగార్ని ఏదో అసభ్యంగా మాట్లాడబోతే ఆమె కొట్టారు. ఆమె నిప్పులాంటి మనిషి సార్!....సార్....ఆ టాక్సీవాడు నాకు తెలుసు. గతంలో మా బంధువుల పెళ్ళికి ఆ టాక్సీని కొన్నాళ్ళు కాంట్రాక్టు తీసుకున్నాం" అన్నాడు షాపతను.

"గుడ్!....ఆ టాక్సీ ఎవరిదో వివరాలు చెప్పండి."

"డ్రైవర్ పేరు జకరయ్య. నంబర్ ఎ. టి. యు 1812. రంగు మీకు తెలిసిందే కింద నల్లరంగు, టాప్ పసుపురంగు—టాక్సీల కుండేదే!"

"గుడ్....జకరయ్య ఎక్కడ పెడతాడు టాక్సీ!?"

"బాలాజీ చెరువు స్టాండ్‌లో, ఇల్లు జగన్నాధపురం ఘాటీదగ్గర."

"థాంక్స్!" మరుక్షణం శ్రీనివాస్ బుల్లెట్ బాలాజీ చెరువు దగ్గరకు దూసుకుపోయింది.

జకరయ్య టాక్సీ స్టాండ్‌లో లేదు. అంత క్రితమే సాలార్లకోట బాడుగకి వెళ్ళిందని. ఆపాటికి తిరిగొస్తుంటా లనీ తక్కిన టాక్సీ డ్రైవర్లు చెప్పారు.

పది నిమిషాల తర్వాత జకరయ్య టాక్సీ వచ్చింది.

యూనిఫాంలోవున్న శ్రీనివాస్‌ని చూసి గడగడ లాడాడు.

శ్రీనివాస్ వాడ్ని పక్కకు పిలిచి, "గత సోమవారం ప్రభాకర్ జనరల్‌స్టోర్స్‌నించి నీ టాక్సీలో తీసుకువెళ్ళిన అమ్మాయిని ఏం చేశావు? ఎక్కడ దించావు? నిజం చెప్పకపోతే కటకటాల వెనక్కి తోసేస్తాను" అన్నాడు.

జకరయ్య భయంతో ఒణికిపోయాడు. "క్షమించం డయ్యా! ఎవరు టాక్సీ కట్టించుకుంటే ఆళ్ళమాటినాలి కదా! మందిని ఆ అమ్మాయిని పాడుచెయ్యటానికి తీసు కొచ్చారని నాకు తెలీదు. బీచ్ రోడ్డుకి తీసుకు పొమ్మం టుంటే ఎందుకో ననుకున్నాను. డైరీఫారం దగ్గిరున్న పాత యింట్లోకి తీసుకుపోతుంటే అనుమానం వచ్చింది. నాకు వంద రూపాయ లిచ్చారు. ఈ సంగతి ఎక్కడైనా చెపితే చంపేస్తామన్నారు."

"వాళ్ళెవరో నీకు తెలుసు. చెప్పకపోతే నిన్ను నేను చంపేస్తాను."

"నన్ను క్షమించదయ్యా! వాళ్ళు మొత్తం అయిదుగు రున్నారు అందులో ఒక్కాయనే నాకు తెలుసు."

"ఎవరతను?"

జకరయ్య రెండు క్షణాలు తటపటాయించి కాలరుద్రుడిలా తనవంకే కోపంగా చూస్తున్న శ్రీనివాస్‌ని చూసి త్రుళ్ళిపడి, "అతను పద్మినీ ఆటోస్పేర్స్ షాపు ఓనరు— పేరుమాత్రం తెల్వదు. నేను నా టాక్సీకి విడిభాగాలకోసం తరచు ఆయన షాపు కెళ్తుంటాను. ఆ పరిచయమ్మీదే టాక్సీ కట్టమంటే ఎక్కడికని కూడా అడక్కుండా కట్టానండయ్యా!" అన్నాడు

"ఈ కేసులో ప్రధాన సాక్షివి, ప్రత్యక్ష సాక్షివి నువ్వే! రా, నాతో" అన్నాడు శ్రీనివాస్. జకరయ్య బుల్లెట్ వెనక ఎక్కాడు.

శ్రీనివాస్ అతన్ని స్టేషన్‌కి తీసుకువెళ్ళి బలగంతో వేన్‌లో పద్మినీ ఆటోస్పేర్స్ షాపుకి వెళ్ళాడు.

జకరయ్య షాప్ ఓనర్‌ని చూపించాడు. శ్రీనివాస్ తీక్షణమైన చూపులు ప్రసరించాడతనివైపు. అతనికి దాదాపు ముప్పైఅయిదేళ్ళుంటాయి. నంబర్ వన్ గూండాలా వున్నాడు.

మొదట బుకాయించబోయాడుగాని జకరయ్య ప్రత్యక్ష సాక్ష్యం. పోలీసు మర్యాద అతన్ని నోరెత్తనివ్వలేదు. ప్రభాకర్ జనరల్‌స్టోర్సు యజమాని కూడ అతన్ని గుర్తుపట్టాడు. అతను నేరం ఒప్పుకోవటంతో బాటు తనకు రేప్‌లో సహాయం చేసిన నలుగురు పార్ట్‌నర్స్‌ని కూడా వెల్లడించాడు.

"నా పేరు నరేంద్ర. రేవతిని మొదటిసారిగా సినిమా థియేటర్లో ఆమె భర్తతో చూశాను. మోహించాను. అప్పట్నించీ ఆమెను వెంటాడుతునే వున్నాను. కోరికని

దాచుకోలేక అడిగేశాను. ఆమె నన్ను పదిమందిలో కొట్టి అవమానించింది.

ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాను. ఆమెను ఎత్తుకు పోయి డైరీఫారం దగ్గిరున్న పాతయింట్లో నా నలుగురు స్నేహితులతో అనుభవించాను. తర్వాత చంపేశాం.

డైరీఫారం పక్కనేవున్న స్మశానంలో పాతిపెట్టబోతుండగా డైరీఫారంనించి వస్తున్న ఓ వ్యక్తి చూసేశాడు. అతన్ని వెంటతరిమాం. షోర్ట్ స్టేషన్ దగ్గిరున్న పబ్లిక్ బూత్‌నించి ఎవరికో ఫోన్ చెయ్యబోతుండగా పట్టుకున్నాం. అతన్ని కూడా చంపేసి ఉప్పుటేర్లో పారేశాం. కాని టాక్సీ డ్రయివర్‌ని వదిలెయ్యటమే మేం చేసిన పెద్ద పొరపాటు" అంటూ తన స్టేట్‌మెంట్లో పేర్కొన్నాడు పద్మినీ ఆటోస్పేర్స్ యజమాని, రేవతి హంతకుడు అయిన నరేంద్ర.

శ్రీనివాస్ నరేంద్ర. అతని స్నేహితులమీద కేసు ఫైల్ చేసి, రిలాక్సింగ్‌గా సీట్లో వెనక్కి వాలుతుండగా ఫోన్ గణగణ మోగింది.

"హల్లో, క్రైంబ్రాంచ్!" అన్నాడు హుందాగా.

"కంగ్రాట్యులేషన్స్ ఇనస్పెక్టర్!" వినిపించింది అవతల్నుంచి ఆ గొంతు వినగానే ఉత్సాహంగా ముందుకు వంగాడు శ్రీనివాస్

"మిస్టర్! మీకు చాలా కృతజ్ఞతలు. ఇప్పటికైనా మీరెవరో చెప్పరా?" అడిగాడు శ్రీనివాస్.

"పేరులో ఏమున్నది ఇనస్పెక్టర్‌గారూ! నన్ను ఫోన్ ఫ్రెండ్‌గానే వుండిపోనివ్వండి." నవ్వుతూ ఫోన్ పెట్టేశాడతను.

□

కళాత్మక మందిర్

ఆళ్ళలగడ్డ రామలక్ష్మి

ఎదుటి బెర్తుమీద కూర్చున్న ముసిలాయన వంకే చూస్తున్నాను నేను. ఆయనకు పట్నం కొత్త అనడంలో సందేహం లేదు. ఉన్నపళంగా అనుకోకుండా ఊరికి బయల్దేరాట్ట. ఇలా వస్తున్నట్లు తమ్ముడికి టెలిగ్రాం కొట్టాట్ట

కానీ అది అందదని ఆయన భయం. అయిన వాళ్ళెవ్వరూ స్టేషనుకు రాకపోతే ఇంటికెలా వెళ్ళాలా అని అయన భయపడుతున్నాడు.

ఆయన పేరు రామారావు. వయసు యాభై వుంటుంది. మనిషిలో పెద్దగా ఆకర్షించే లక్షణాలేం లేవు. కానీ నే నాయనపట్ల ఆకర్షితుణ్నయ్యాను. అందొకొక్కటే కారణం. ఆయన దగ్గర ఇరవై వేలు రొక్కముంది అనుకోకుండా ఆ విషయం కనిపెట్టాను నేను.

ఆయన బ్రీఫ్‌కేసు తెరిచి బట్టలు సర్దుకుంటూ ఓ మాస పత్రికను పక్కన పెట్టాడు నేను చటుక్కున ఆ మంత్‌లీ అందుకున్నాను. అది నేను తీయడం ఆయన చూడలేదను కుంటాను.

నేను మంత్లీ పేజీలు తిరగేస్తూండటగా అందులో ఒక కాగితముంది. దానిమీద పెళ్ళిబట్టలకు రెండువేలు, పెళ్ళి వారికి కట్నం అడ్వాన్సు పదివేలు, బంగారం అయిదు వేలు, యితరములు మూడువేలు---అని ఖర్చుల్లా వ్రాసి వున్నాయి. చివర మొత్తం కూడి ఇరవై వేలు రాసి వుంది.

నే నప్పుడు దానికంత ప్రాముఖ్యత నివ్వలేదు. యధాలాపంగా మంత్లీని తిరగేస్తున్నాను. ఈలోగా ఆయన కంగారుపడి మంత్‌లీ వెతుకుతూ నా చేతిలో చూసి "ఇది మీదా?" అన్నాడు.

"కాదు మీదే...." అన్నాను.

"చదవాలనుంటే నన్నడిగి తీసుకోవలసింది" అంటూ గొణిగాడాయన.

నే నా పుస్తకం తీసుకోవడం ఆయనకు నచ్చలేదని ముఖం చూడగానే అర్థమయింది. తప్పు నాదే కాబట్టి

వెంటనే ఆ పుస్తకం ఆయనకు తిరిగిచ్చేశాను. వెంటనే ఆయన దాన్ని భద్రంగా బ్రీఫ్‌కేసులో పెట్టి మూసేశాడు.

ఆయన్ను కాస్త మంచి చేసుకోవాలనిపించి కబుర్లలోకి దింపాను.

ఆయన ఆయుర్వేదం వైద్యుడు. ఇంగ్లీషు మందులకీ, ఆపరేషన్లకీ లొంగని ఎన్నో జబ్బుల నాయన ఆయుర్వేదంతో కుదిర్చాడు.

"పట్నం దేనికి?" అనడిగాను.

"పట్నంలో నా తమ్ముడున్నాడు. వాడి సాయంతో కొన్ని పెళ్ళి వ్యవహారాలు తేల్చాలని...." అన్నాడాయన.

"పెళ్ళెవరికి?"

"మా అఖరమ్మాయిది. పెళ్ళివారిదీ పట్నమే! ఓసారి వారిని కలుసుకోవాలని కూడా అనుకుంటున్నాను" అన్నాడాయన.

అప్పుడు నాకర్థమయింది. ఇందాక పుస్తకంలో చూపిన కాగితంలో ఖర్చులు పెట్టడానికే ఆయన పట్నం వస్తున్నాడు. అంటే ఆయన దగ్గర అంత డబ్బా వుందన్నమాటే!

ఆయన దగ్గర ఇరవయివేలున్నాయనగానే నాలో వుత్సాహం రేగింది. మనిషి పట్నానికి కొత్తలా వున్నాడు. అందువల్ల నాకు మోసం చేయడానికి పెద్ద ఇబ్బందేమీ లేదు.

"పాపం - మీ తమ్ముడు స్టేషనుకు రాకపోతే ఏం చేస్తారూ?" అన్నాను. మనసులో నేను టెలిగ్రాం అందకూడదనీ, ఆయన తమ్ముడు స్టేషనుకి రాకూడదనీ కోరుకుంటున్నాను.

"మూడొంతులు వాడొచ్చే అవకాశం లేదు. ఏ సిటోటి

గాడో సాయం చేయాలి" అన్నాడాయన చటుక్కున.
ఆయన కళ్ళలో ఆశ చూశాను.

అంటే ఆయన నా నుంచి సాయం ఆశిస్తున్నాడు. అలాంటి వాళ్ళను మోసం చేయడం చాలా సులభం.

"నేను మీకు తప్పక సాయపడతాను" అన్నాను.

"నీకు పట్నం బాగా తెలుసా?" అన్నాడాయన.

"పట్నంలో అణువణువూ తెలుసు నాకు" అన్నాను గర్వంగా. అది నిజం కూడా.

"అయితే నా సమస్య తీరిపోయింది. ఇది నా అదృష్టం" అన్నాడాయన.

ప్రస్తుతం ఆయన అదృష్టంగా భావిస్తున్నది కాసేప టికి నా అదృష్టంగా మారుతుందని నాకు తెలుసు. అలా గని డైరెక్టుగా చెప్పకుండా "మీవంటివారికి సాయపడగల గడం నా అదృష్టం" అన్నాను.

అయితే నా బుర్ర చురుగ్గా పనిచేస్తోంది. ఈయన్నెలా బుట్టలో వేసుకోవాలీ అన్నది నా ఆలోచన.

"నా తమ్ముడి అడ్రసు చెబుతాను. నీకు తెలుసేమో చూడు..." అంటూ ఆయన అడ్రసు చెప్పాడు.

ఆ అడ్రసు నాకు తెలియదు. కానీ వాకబుచేస్తే కను క్కోవడం పెద్ద కష్టం కాదు. అదే ఆయనకు చెప్పాను.

"పాపం అనవసరంగా నా గురించి నీ టైము వృధా చేసుకోవాలి..." అన్నాడాయన నామీద జాలిపడుతున్నట్లు. కానీ నన్నిబ్బంది పెట్టాల్సి వచ్చిందన్న బాధే ఆయన గొంతులో ఎక్కువ ధ్వనించింది.

"ఇందులో వృధా ఏముందండీ - అది నా బాధ్యత" అన్నాను.

"అలాగనకు. ఈ రోజుల్లో స్వార్థం లేనిదే ఎవరూ

దేనికీ ఒప్పుకోరు" అన్నాడాయన.

ఆయనా మాటలు అప్రయత్నంగానే అని వుండవచ్చు. కానీ నా మనసులో దురుద్దేశ్యమున్న కారణంగా నేను భుజాలు తడుముకున్నాను. స్వార్థం లేకుండా ఎవరూ దేనికీ సాయపడరన్న ఆయన మాట పూర్తిగా నిజం. కానీ అప్పుడే నా కింకో అనుమానమూ వచ్చింది. రామారావుగారిని నేనింకా బాగా నమ్మించాలి

"మీరు రైటే చెప్పారు. నాకూ స్వార్థముంది మీకు సాయపడడంలో" అన్నాను.

"ఏమిటది?" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"రెండు సంవత్సరాలుగా మా నాన్నగారి ఆరోగ్యం బాగుండడంలేదు. అన్ని రకాల వైద్యాలూ అయిపోయాయి. ఇప్పుడిక అన్ని ఆశలూ వదిలేసుకున్నాం. మీరోసారి ఆయన్ను చూడాలి" అన్నాను.

"ఏమిటాయన జబ్బు?" అన్నాడాయన కుతూహలంగా.

"మాకు తెలిసినంతవరకూ కీళ్ళ నొప్పులు. మిగతా వివరాలు వైద్యుడిగా మీరే ఆయన్నుంచి రాబట్టాలి...."

"కీళ్ళనొప్పులైతే నాదగ్గర మంచి మందుంది—" అన్నాడాయన వుత్సాహంగా.

ఆయన ఉత్సాహంలో అసలైన వైద్యుడు కన్పించాడు నాకు.

నా తండ్రి జబ్బు గురించి ఇంకా నమ్మించడంకోసం ఆయనతో—"ఆరువారాల తర్వాత ఇదే మళ్ళీ మా ఊరెళ్ళడం. రామచంద్రపురం దగ్గిర—షల్లవరం అని ఓ పల్లెటూరుంది. అక్కడో మంతగాడున్నాడు. నే నక్కడుండి ఈ ఆరువారాలూ ఏవేవో ఉపాసనలు చేశాను. వాటివల్ల మా నాన్నకు జబ్బు తగ్గుతుందని నమ్మకం.

రెండువేలు ఖర్చయింది—" అన్నాను.

"ఈ రోజుల్లో కూడా ఇలాంటివి నమ్మడం మంచిది కాదు. మంత్రాలకు చింతకాయలు రాలవు. అవతల మీ నాన్నకు కీళ్ళనొప్పులైతే—నువ్వెళ్ళి పల్లెటూళ్ళో వుపాసనలు చేయడమేమిటీ? పైగా దానికి రెండువేల రూపాయలు ఖర్చా?" అన్నాడాయన మందలిస్తున్నట్లు.

"ఏం చేసేదండీ? అన్ని మందులూ వాడడం అయింది. ఇక మిగిలినవన్నీ ఇలాంటివే ..." అన్నాను నిరుత్సాహంగా.

"సరేలే. ఈ కేసు నా చేతుల్లో పడితే మీకు మళ్ళీ మందుల మీద నమ్మకమూ పుడుతుంది. ఆయుర్వేదం గొప్పతనం మరోసారి ప్రపంచానికీ ఋజువవుతుంది ...." అన్నాడాయన.

"అందుకే ముందు మీరు మా యింటికే రావాలండి. వచ్చి మా నాన్నగారిని పరీక్షించేక—అప్పుడు మనం మీ తమ్ముడింటికి వెడదాం" అన్నాను.

సరిగ్గా అప్పుడే పక్కన నాకేమాత్రమూ నచ్చని సంభాషణ ప్రారంభమయింది. పట్నాల్లో మోసాలెలా జరుగుతాయో—అక్కడ కొత్తవాళ్ళ నెలా మోసంచేస్తారో చెప్పుకుంటున్నా రిద్దరు.

"పైకి మంచివాళ్ళలా కనబడతారు. సాయం చేస్తున్నట్లు నటిస్తారు. కానీ చివరకు పచ్చిమోసం ..."

నేను భయంగా రామారావుగారివంక చూశాను. ఆయన కూడా కుతూహలంగా ఆ సంభాషణ వింటున్నాడు.

"అవతలివాళ్ళ దగ్గర డబ్బున్నట్లు పసిగడతారు. అంతే—కబుర్లు ప్రారంభిస్తారు. మాటలు కలుపుతారు. నమ్మించి మోసం చేస్తారు ...."

అప్పుడే నాకు గుర్తొచ్చింది. రామారావుగారి దగ్గర మాసపత్రిక తీసుకున్నాకనే—అందులో కాగితం చూసే

కనే నా కాయనపై ఆసక్తి బయల్దేరింది. ఆ విషయ మాయన ఇంతవరకూ గుర్తించకపోయినా ఇప్పుడు గుర్తించవచ్చు నేనా కాగితం చదవలేదని ఆయనలో నమ్మకం పుట్టించాలి. ఎలాగో ఆయన్ను మా నాన్న పేరు చెప్పి ఇంటికి తీసుకునిపోవాలి.

మా యిల్లంటే అది మా యిల్లుకాదు. మా ముఠాక లాంటిళ్ళు నాలుగున్నాయి. ఆ యిళ్ళ తాళాలు మాదగ్గ రుంటాయి. అసలింటి ఓనర్లు వేరే వుంటారు. ఆ యిళ్ళు కాస్త ఎడంగా అక్కడేం జరిగినా ఇతరులకు తెలియని విధంగా వుంటాయి. రామారావుగార్ని నా యింట్లోకి తీసుకుని వెడితే ఆ యిరవై వేలూ నేను స్వంతం చేసుకోవచ్చు.

నా పద్ధతి చాలా సింపుల్. బాగా డొంక తిరుగుడు దారుల్లో ఆయన్నాయింటికి తీసుకుని వెడతాను. అక్కడాయనకు మత్తుమందిచ్చి మొత్తం దగ్గరున్నదంతా స్వాధీనం చేసుకుంటాను. ఆ పైన నాకు తెలిసిన రిక్షావాడొకడున్నాడు. వాడి రిక్షాలో ఆయన్ను స్పృహలేని స్థితిలో ఎక్కిస్తాను. వాడు నా గురించి సరైన వివరాలు చెప్పడు. రామారావుగారిని ఏ హాస్పిటల్ దగ్గరో దిగవిడుస్తాడు.

చాలా పకడ్బందీగా వుంటుంది నా పథకం. పట్నంలో నాకులాంటి వాళ్ళం పదిమంది వున్నాం. ఇంతవరకూ పోలీసులు మాలో ఒక్కడి ఆచూకీకూడా తెలుసుకోలేకపోయారు.

మా సంపాదనను న్యాయంగా అందరూ సమంగా పంచుకుంటాం. మాలో అందరికీ ఒకరంటే ఒకరికి బాగా నమ్మకం. ఒక్కొక్కనికి నెలకు రెండువేలు తక్కువ కాకుండా మిగుల్తుంది. ఒకోసారి పదివేలదాకా దొరికిన సందర్భాలున్నాయి. మేమెక్కువగా బ్లాక్ మనీ వాళ్ళనే పడుతూంటాం. అందువల్ల అవతలివాళ్ళు కూడా కంప్లైంటివ్వరు.

అప్పుడప్పుడు మధ్యతరగతివాళ్ళూ దొరుకుతూంటారు.

రామారావుగారి దలాంటి కేసే!

నేనాయన్నే పరిశీలించి చూస్తున్నాను. పక్కవాళ్ళ సంభాషణ ఆయనలో ఎలాంటి మార్పు తీసుకొస్తుందీ అని! ఆయనలో కుతూహలం తప్ప ఇంకేమీ కనపడ్డంలేదు నాకు. అయినప్పటికీ ఆయనకు నాపై నమ్మకం పెంచాల్సిన బాధ్యత నాకుంది.

"మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు...." అన్నాను మళ్ళీ ఆయన్ను పలకరిస్తూ. ఆయన దృష్టి నా మీదకు మళ్ళింది.

"లేదు-వీళ్ళేదో మాట్లాడుకుంటూంటే వింటున్నాను."

"అన్నట్టు—మీరేమీ అనుకోనంటే మీవల్ల నా కింకో సాయం కావాలి" అన్నాను.

"చెప్పు...."

"వీడేమిట్రా—నన్నిలా తగులుకున్నాడూ అని మీరు భావించకూడదు. అదృష్టంకొద్దీ నాకు మీవంటి వైద్యుడి పరిచయం లభించింది" అన్నాను.

"ఏమిటో చెప్పు...." అన్నా డాయన. జబ్బు పేరు చెప్పగానే ఆయన్ను వైద్యుడిగా గుర్తించగానే ఆయన కళ్ళలో కొత్తమెరుపు కనిపిస్తోంది. నేనాయన బలహీన తను బాగా పట్టేశాను. వాటంచూస్తే ఈయన డబ్బుకోసం కాక—డబ్బిచ్చి మరీ వైద్యంచేసేలాగున్నాడు.

"పుల్లవరంలో ఆ మంత్రగాడు చేయించిన ఉపాసనల్లో చేయించిన హోమాల్లో ఏవేవో పొగలు నా కళ్ళలోదూరి మంటలు పుట్టించాయి. ఆ గ్రామం వెళ్ళేముందు— నా నా దృష్టి ఎంతో చక్కగా వుండేది. ఇప్పు డక్షరాలు సరిగ్గా కనపడ్డం లేదు. పుస్తకాలేమీ చదవలేకపోతున్నాను...." అన్నాను.

ఆయన వెంటనే—"ఇందాకా నా దగ్గర్నుంచి మంత్లీ తీసి చదివినట్లున్నావు" అన్నాడు.

అడగవలసిన ప్రశ్నే అడిగావయ్యా అనుకుని—నా తెలివితేటల్ని నేనే మనసులో అభినందించుకున్నాను—"అదేనండి పుస్తకం కనబడ్డప్పుడల్లా కళ్ళేమైనా మెరుగుపడ్డాయేమోనని ఆత్రుతగా పరీక్షించుకుంటున్నాను. అందుకే ఇందాకా మిమ్మల్నడక్కుండా ఆ పుస్తకం తీశాను. కార్టూన్లకురాసే అక్షరాలు కూడా సరిగ్గా కనపడ్డంలేదు. అసలు నేనింక చదవగలనా అనిపిస్తోంది...." అన్నాను.

"అయ్యో—ఇంత చిన్నవయసులో అలాంటిబ్బంది రాకూడదు. ఏదీ నీకళ్ళు చూడనీ" అన్నాడాయన.

అప్పుడాయన నా కళ్ళు పరీక్షించాడు.

అది నాకు రెండు విధాల ఉపయోగించింది.

రామారావుగారికి నేను మంత్లీలోని కాగితాన్ని చదివి వుండనన్న నమ్మకం కలగడం ఒకటైతే—పక్కనున్న వాళ్ళకు మామీద ఆసక్తి కలగడం రెండవది.

"కంట్లో దోషమేమీ కనబడ్డంలేదు. నీ లోపం తాత్కాలికమే ననుకుంటాను. అయినా ఆయుర్వేదంలో దీనికీ మందుంది" అన్నాడు రామారావు.

పక్కనున్నవాళ్లు నా కథవిని జాలిగా—"ఏ పుట్టలో ఏ పాముందో—మీ నాన్నగారి కీయనవల్ల కూడా నయం కావచ్చు...." అన్నారు.

వాళ్ళలాగన్నందుకు రామారావుగారికి వాళ్ళమీద కాస్త కోపం కూడా వచ్చింది. ఏ పుట్టలో ఏపాముందో అని తన గురించి అనుకోవడం తనను చిన్నబుచ్చడంగానే ఆయన భావించాడు. ఆయనకు వాళ్ళమీద కోపం రావడం నాకు మంచిదేననిపించింది. ఇందాకటి వాళ్ళ మాటల కిప్పు

డాయనంత ప్రాధాన్యతనివ్వడు. అదీకాక నేనాయన్నిప్పుడు కాస్త పొగిడి మంచిచేసుకుంటే—ఆయనకు నేనంటే సదభిప్రాయం కూడా పెరుగుతుంది. వాళ్ళమీద కోపంకొద్దీ నామీద ఆయన కభిమానం కూడా పెరుగుతుంది.

"పుట్టలో పామేమిటండీ? మీ ముఖంలో వర్చస్సు చూడగానే తెలిసిపోతుంది. మిమ్మల్ని చూడగానే మీరు చాలా చాలా గొప్పవారని నా కనిపించింది...."

నా యిష్టం వచ్చినట్లు పొగుడుతూంటే ఆయనెంతో సంతోషించాడు. నా మీద ఆయన అభిమానం పెరిగిపోయింది. పొగడ్తలకు లొంగినట్లు మనిషి దేనికీ లొంగడు. ఆ తర్వాత ఆయనా నేనూ ఒకటే ప్రపంచంగా ఇతరులతో నిమిత్తం లేకుండా కాలక్షేపం చేశాం. ముందు నాతో వచ్చి మా నాన్నగారిని చూసేకనే తన తమ్ముడింటికి వెడతానని ఆయన మాటిచ్చాడంటే ఆయన నన్నెంతగా నమ్మాడో అర్థం చేసుకోవచ్చు.

బ్రీఫ్‌కేసులో బట్టలు సర్దుతున్నప్పుడే నేను గమనించాను. అందులో డబ్బులేదు. అలాంటివాళ్ళు డబ్బెక్కడ దాస్తారో కూడా నాకు తెలుసు. మొలచుట్టూ పోలితీన్ సంచీలలో పెట్టి డబ్బు కట్టుకుంటారు ఎక్కువ డబ్బుతో ప్రయాణం చేసేటప్పుడు. చిన్నప్పుడు నాన్నగారదే చేసేవారు. ఆయ నిప్పుడు లేరు.

మొత్తంమీద ట్రయిన్ గమ్యస్థానం చేర్చింది మమ్మల్ని. నేను, ఆయన ఒకరినొకరు చాలా శ్రద్ధగా, జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉంటున్నాం. తనకు దొరికిన ఆసరా పోతుందని ఆయన భయం. డబ్బుతోసహా నానుంచి తప్పించుకుంటాడేమోనని ఆయన గురించి నా భయం.

ఇద్దరం ప్లాట్‌ఫారంమీద గేటుదగ్గర ఆగాం. అక్కడ

నా దురదృష్టంకొద్దీ ఒకతడు రామారావును పలకరించి—
"మీరు రామారావుగారు కదూ—శంకరం అన్న!" అన్నాడు.

రామారావుగారో క్షణం అతడి నెగాదిగా చూసి—
"నువ్వు మా శంకరం పక్కవాటాలో ఉంటున్నావు కదూ—ఆమధ్య మీరిద్దరూ కలిసి మాయింటి కొచ్చారు కూడా!" అన్నాడు.

"అవునండి. నేనూ ఈ ట్రయిన్లోనే దిగాను. మీ రెప్పుడూ పట్నంరాలేదు. ఇప్పుడు శంకరం యింటికేనా?" అనడిగాడు శంకరం పక్కింటివాటా అతడు.

"అవును...." అన్నాడు రామారావు.

నా గుండెల్లో రాయిపడింది! నేను నెమ్మదిగా రామారావుతో—"అయ్యా! మీరు ముందు మాయింటి కొస్తానన్నారు. మర్చిపోకండి. మీదగ్గర పెద్దగా సామానేమీ లేదు. మా నాన్నగారిని చూసేకనే మీ తమ్ముడింటికి వెళ్లొచ్చు" అన్నాను.

"అలాగెందుకూ—నువ్వైతే మా తమ్ముడిల్లు వాకబు చేయాలి. ఇప్పుడు నువ్వు నాతో వచ్చేయ్. మనం తిన్నగా నా తమ్ముడింటికి వెడదాం. అక్కడో పది నిముషాలున్నాక బయల్దేరి మీ యింటికి వెడదాం" అన్నాడు రామారావు.

ఇంక నా కేసు పోయినట్లే అనుకున్నాను. తమ్ముడింటికి వెడితే ఆయన దగ్గరున్న డబ్బంతా ఇంట్లోదాస్తాడు. అటుపైన మా యింటికొచ్చి మాత్రం లాభమేమిటి? పడితే ఈయన్నిప్పుడే పట్టాలి.

నే నెంతచెప్పినా ఆయన వినిపించుకోలేదు. "అయితే మిమ్మల్ని తర్వాత కలుస్తానెండి. మీ తమ్ముడి అడ్రసు నోట్ చేసుకుంటాను...." అన్నాను.

"అబ్బే అలా కుదరదు. నువ్వు మాతో రావల్సిందే—

నేనూ నీతో రావాల్సిందే—" అంటూ ఆయన పట్టుబట్టాడు.

ఈ సమస్యనుంచి ఎలా బయటపడాలో నా కర్థం కాలేదు. అంతసేపూ నా తండ్రి గురించి ఎంతో ఆత్రపడి ఇప్పుడు కాదంటే ఆయన కనుమానం వసుంది. ప్రస్తుతానికి నే నాయనతో వెళ్ళక తప్పదు వెడితే నాలో ఇంకా కాస్త ధైర్యముంటుంది—ఈయ నింకా నా చేతిలోనే ఉన్నాడు కదా అని! కానీ నా దురదృష్టంకొద్దీ ఆయనతో పాటు ఆయన తమ్ముడు కూడా మా యింటికి వస్తానని తయారైతే!

రామారావు తమ్ముడు శంకరం పట్నంలోనే ఉంటున్నాడు. అతడికి ఊరు బాగా తెలిసివుంటుంది. అలాంటి వాడికి నేను చెప్పాల్సిన అడ్రసేమిటి? లేని తండ్రి నెక్కణ్ణించి తేవాలి? కనీసం వైద్యుడికోసం ఓ రోగినైనా ఎలా సంపాదించడం?

రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరవకూడదు శతకోటి దరిద్రాలకు—అనంతకోటి ఉపాయాలుంటాయి. కానున్నది కాకమానదు.

ఇలాంటి సామెతలు గుర్తుంచుకొని నేను వాళ్ళతో పాటే బయల్దేరాను. మేము ముగ్గురం ఒకే ఆటో ఎక్కాం. అక్కణ్ణించి సరిగ్గా పదిహేను నిమిషాల్లో శంకరం యిల్లు చేరుకున్నాం. తీరాచూస్తే ఆ యిల్లు తాళంపెట్టివుంది

పక్కింటి వాటా అతడు లోనికి వెళ్ళివచ్చి—"రెండ్రోజుల క్రితం శంకరం అత్తగారికొంట్లో బాగో లేదని టెలిగ్రాంవస్తే ఉన్నపళంగా యింటిల్లపాదీ బయల్దేరి వెళ్ళారుట. మీరు మాయింటికి రండి" అన్నాడు.

మేమిద్దరం అతడింట్లోకి వెళ్ళాం. మాకు కాఫీలు, టిఫిను కూడా అందాయి.

"ఇది మీ యిల్లే అనుకుని ఇక్కడే వుండండి" అంది ఇంటావిడ.

"అబ్బే—నేను సాయంత్రానికల్లా మళ్ళీ తిరుగు ప్రయాణం కావాలమ్మా—ఓసారి మగపెళ్ళివారితో మాట్లాడాలి. పెళ్ళి బట్టలు. బంగారం కొనాలి. ఎలాగూ పెళ్ళి వారితో మాట్లాడ్డానికిక్కడివాకా వస్తున్నాం గదా అని కొంత బజారు పనికూడా పెట్టుకొచ్చాను" అన్నాడు రామారావు మొహమాటపడుతూ.

వాళ్ళు మొహమాటపెట్టారుగానీ రామారావు వినలేదు. అప్పుడా యింటావిడ—"అది సరే—మీరొక్కరూ బజారు పను లెలా చేస్తారు? మనిషిసాయం కావద్దూ!" అంది.

శంకరం పక్కింటివాటా అతడు—"నే నిప్పుడు అర్జెంటుగా ఆఫీసులో జాయినవ్వాలి. సాయంత్రమైతే మీతో బయల్దేరి వస్తాను...." అన్నాడు.

"అబ్బే—ఈ కుర్రాడున్నాడుగా—నాపనుల కేయిబ్బందీ లేదు" అన్నాడు రామారావు.

నా రొట్టెవిరిగి నేతిలో పడ్డట్లయింది. నే నాయనతో బయల్దేరి రావడం మంచిపనే అయింది. ముసలాయన మళ్ళీ నా చేతుల్లో చిక్కుతున్నాడు. కోరి నన్నే తన సహచరుడిగా చేసుకుంటున్నాడు.

అప్పుడే ఊర్నించి తిరిగి రావడంవల్ల అలిసిపోయున్నాడో లేక నేను నిజంగానే నమ్మకస్థుడినని భ్రమ పడ్డాడో తెలియదుకానీ శంకరం పక్కవాటా అతడందు కంగీకరించాడు. తను మాత్రం మగపెళ్ళివారింటి కెలా వెళ్ళాలో, బజార్లో ఏయే షాపులు మంచివో సవివరంగా మాకు చెప్పాడు.

ఇద్దరం ఇంట్లోంచి బయటపడ్డాం.

రామారావు దగ్గర డబ్బున్నమాట తథ్యం. అదీ యిరవై వేలకు తక్కువ కాకుండా వుండడం తథ్యం. శంకరం పక్కవాటాలో అతదేమీ వదల్లేదు.

"మనం ముందు మా యింటికి వెళ్ళొద్దామండి" అన్నాను.

"నా ప్రయాణం ఈ రాత్రికి రాత్రే రోగి నెప్పుడూ హడావుడిగా చూడకూడదు. మన పనుల కెంతసేపు పడుతుందో నాకు తెలియదు. మీ యింటికి ముందొస్తే నా దృష్టంతా నా పనిమీదే వుంటుంది. రోగిని సరిగా పరీక్షించలేను. అలాకాక పనులన్నీ పూర్తిచేసుకుని మీ యింటికి వెడితే—తీరుబడిగా మీ నాన్నను పరీక్షించవచ్చు. నాకు మనస్సు స్థిమితంగా ఉంటుంది" అన్నాడాయన.

ఆయన పెళ్ళివారింటికెడితే అక్కడ పదివేలిస్తాడు. అటుపైన బట్టలూ, నగలూ వగైరాలు కొనేశాక ఇంక నాకు మిగిలేదేముంది? నగలు, బట్టల్లాంటివి వళపర్చుకుని మళ్ళీ అమ్మితే సగానికి సగం కూడా రాదు.

"అయితే ఓ పనిచేద్దామండి. ఈ ఊళ్లో కొత్తగా కళ్యాణమందిర్ అనే దుకాణమొకటి వచ్చింది. అదో పెద్ద డిపార్టుమెంట్ స్టోర్సు. పెళ్ళికి బట్టలేమిటి, నగలేమిటి, బహుమతులేమిటి....అన్నీ మీరక్కడే కొనవచ్చు. మనం దుకాణదారుకి ఏంకావాలో చెప్పి వెళ్ళామంటే రెండు మూడు గంటల్లో మన అభిరుచికి తగ్గవన్నీ సిద్ధంచేసి ఉంచుతారు. మనం అక్కడకువెళ్ళి ఆర్డరిచ్చి మా యింటికి వెడదాం. మా యింటినుంచి పెళ్ళివారింటికి వెడదాం—వాళ్ళిల్లు మా యింటికి దగ్గర—" అన్నాను.

రామారావు ముఖంలో అదొకరకమైన కంగారు కన

బడింది— "కళ్యాణమందిర్ గురించి మనకతడు చెప్ప లేదే...." అన్నాడు. అతడనగా శంకరం పక్కవాటా వ్యక్తి అని ఆయన భావం.

"కొత్తగావచ్చింది కదా—అతడికింకా తెలిసుండక పోవచ్చు"—అన్నాను.

"ఊళ్లోలేని నీకే తెలియగాలేనిది —ఊళ్ళోవుంటున్న అతడికి తెలియదంటావా? అది నమ్మకమైన దుకాణం కాదేమో!" అన్నాడు రామారావు.

కళ్యాణమందిర్ గురించి నాకెలా తెలిసిందో చెబుదామను కుని ఊరుకున్నాను. అది చెప్పడంలో నాకు ప్రమాద ముంది.

"ఒకసారి అక్కడికి వెళ్ళిచూస్తే మంచి చెడ్డలు మీరే నిర్ణయించుకోవచ్చు ఆటో పిలవనా?" అన్నాను.

"ఆటోవద్దు. బస్సులో వెడదాం—" అన్నాడు రామా రావు.

సరే—ఇదీ మంచిదే అనుకున్నాను. ఆయన డబ్బెంత పొదుపుగా వాడితే అది నాకు మంచిది. నాలుగడుగుల దూరంలోవున్న బస్టాపుకు ఇద్దరం వెళ్ళాం.

"కళ్యాణమందిర్‌కు ఏ బస్సెక్కాలండీ?" అన్నాడు రామారావు బస్టాపులో ఒకతణ్ణి పలకరిస్తూ.

"కళ్యాణమందిర్ ఏమిటండీ?" అన్నా రక్కడున్న వారందరూ.

నేనప్పుడు వాళ్ళకు కళ్యాణమందిర్ ఎక్కడున్నదీ వివ రాలు చెప్పి—"అక్కడికి నలభై రెండో నంబరు బస్సు వెడుతుందికదూ—" అనడిగాను.

"ఆ షాపు కొత్తగా వచ్చినట్లుంది. నలభై రెండు నంబరు బస్సు వెడుతుంది. అదిగో ఆ పక్కగావున్న బస్టాపు

దగ్గర నిలబడండి—" అన్నాడొకడు.

మేము పక్కకు వెళ్ళాం. వరుసగా రెండు మూడు బస్ స్టాపులున్నాయి. స్టాపులవద్ద బస్సులనంబర్లు రాసిన బోర్డున్నాయి. నేనాయన్ని నలభై రెండో నంబరు బస్సాగే స్టాపు వద్దకు తీసుకుని వెళ్ళాను. మేమక్కడికి వెళ్ళిన అయిదు నిముషాల్లో ఆ బస్సు వచ్చింది. "రండి-మనబస్సొచ్చింది" అన్నాను.

ఇద్దరం బస్సెక్కాం. మాకు సీట్లు కూడా దొరికాయి.

రామారావు బస్ కండక్టరు దగ్గరకురాగానే—"బాబూ-నాకీ వూరుకొత్త. కళ్యాణమందిర్ రాగానే చెప్పు. దిగిపోతాను" అన్నాడు.

"కళ్యాణమందిర్ అంటే—?" అన్నాడతడు.

రామారావతడికి ఇందాకా ఇంకో బస్‌స్టాపులో నేను చెప్పిన వివరాలన్నీ చెప్పాడు. కండక్టరదివిని "బస్సాపాపు దగ్గరకు వెళ్ళదండి. మిమ్మల్ని అన్నపూర్ణాహోటలు దగ్గర దింపుతాను. అక్కణ్ణించి పక్కసందులో ఓ కిలోమీటరు దూరంలోపులోనే వుంటుందాషాపు" అన్నాడు.

కండక్టరు వెళ్ళిపోయాక—"నేను మీ పక్కనున్న దెందుకు? అన్నింటికీ మీరు వాళ్ళనీ వీళ్ళనే అడుగుతారేం?" అన్నాను.

"నీకూ ఈ ప్రాంతమంతా తెలిసినట్లు కనబడ్డం లేదు. ఇప్పుడు పట్నాలదేపనిగా పెరిగిపోతున్నాయి. ఊళ్ళో వాళ్ళైనా కొత్తచోటు వాకబుమీద తెలుసుకోవాల్సిందేకదా. నీలాంటి వాడడిగితే చటుక్కున ఎవరూ దారి చెప్పరు. నేను వయసులో పెద్దవాణ్ణికదా—ఆ మాత్రం గౌరవం, జాలి అంతా చూపిస్తారు...." అన్నాడు రామారావు.

"ముసలాడు ఘటికుడే—" అనుకున్నాను. ఆయన

తన జాగ్రత్తలో తనుంటున్నాడు. నేను తప్పుదారి పట్టిస్తానని తన అనుమానమేమో! అలాంటి అనుమానమున్నవాడు నన్నుకూడా రమ్మనమని ఎందుకంటాడూ?

బస్సులోంచీ బయటకు చూస్తున్నాను. అన్నపూర్ణ హోటలు ఏరియా అంతా నాకు బాగా తెలుసు. అదిరాగానే ఆయనకు చెప్పాను ఇద్దరం బస్సుదిగాం.

"ఆ పక్క సందులోంచే కళ్యాణమండిర్‌కు దారి—" అన్నాను.

"ఎందుకైనామంచిది. ఇంకెవరినైనా కూడా అడుగుదాం—" అన్నాడాయన.

నేనేమీ మాట్లాడలేదు. ఆయనొకవేళ నన్ననుమానిస్తుంటే—నా చుట్టూ ఇంకా మనుషులుంటారన్న అనుమానం కూడా వుంటుంది. నేనెవరినడిగినా నా మనుషులనే అడుగుతున్నానని ఆయననుకుంటాడు. ఆయనలో అలాంటి అనుమానాలన్నింటినీ తుడిచిపెట్టేయడం నాధర్మం. లేకుంటే యింత శ్రమావృధా అయిపోతుంది. మొదలుకే మోసం వస్తుంది అసలుకే ఎసరుపడుతుంది.

"మీరన్నదీ మంచిదే—మీరే ఎవరినైనా అడగండి—" అన్నాను.

ఆయన నలుగురైదుగురి నడిగాడు. అందరూ నేను చెప్పిన సందునే చూపించారు. ఇద్దరం ఆ సందులో ప్రవేశించాం.

సందు మధ్యలో వుంది కళ్యాణమందిర్!

షాపు మరీ అనుకున్నంత పెద్దదిగాలేదు. ఇద్దరం షాపులో ప్రవేశించాం. మేమిలా అడుగుపెట్టగానే అలా ముందుకు వచ్చాడు ఫుల్‌సూట్లోవున్న ఓ నడివయస్కుడు. అతడు రామారావుకు నమస్కరించి—"అమ్మాయి పెళ్ళి

గురించి వచ్చారాసార్—" అన్నాడు.

రామారావు ఆశ్చర్యంగా—"అవును—" అన్నాడు.

"రండి—కూర్చోండి" అంటూ అతడు మమ్మల్ని లోపలకూ ఆహ్వానించాడు.

"మాది చాలా ప్రత్యేకత కలిగిన షాపు. మీకేం కావాల్సినా ఇక్కడ దొరుకుతుంది. నాణ్యతలో, ధరలో తేడా వుండదు...." అన్నా డా నడివయస్కుడు.

రామారావతడితో పెళ్ళిబట్టలు, నగలు గురించి వచ్చి నట్లు చెప్పాడు.

"మీ దగ్గర అమ్మాయి ఫొటో వుంటే ఇవ్వండి. లేదా అమ్మాయిరంగు చెప్పండి. ఏ రంగులు కావాలో చెప్పండి. ఎంత ధరలో కావాలో చెప్పండి. సరిగ్గా రెండుగంటల్లో మీ గురించి అన్నీ సిద్ధమవుతాయి. మా సరుకుకి గ్యారంటీ వుంది. నచ్చకపోతే వెనక్కు తెచ్చిచ్చినా పుచ్చుకుంటాం" అన్నా డా నడివయస్కుడు.

రామారా వాలోచనలో పడ్డాడు.

షాపు రద్దీగావుంది. ఎందరోవస్తున్నారు వెడుతున్నారు. అనుభవజ్ఞులైన వారక్కడ కస్టమర్సుకు ఎన్నికలో సాయ పడుతున్నారు.

"పెళ్ళికే సామాను కావలసినా కూడా మా దగ్గర దొరుకు తుంది సార్. ఊళ్ళో చాలాషాపులతో మాకు అండర్ స్టాండింగ్ వుంది. మీకంటే బా.గా డిస్కౌంట్ రేట్సుకి మేము సరుకుకొంటాం. అందులో కొంత లాభం మీకూ యిస్తాం. అందుకే మా దగ్గరదొరికినంత చవగ్గా ఇంకెక్కడా దొరకదు మీకు...." అన్నా డతడు.

రామారావు తటాపటాయించినా కాసేపట్లో మొత్తం పదివేలకు జాబితా యిచ్చాడు.

"సరిగ్గా రెండుగంటల తర్వాత రండిసార్.. అన్నీ మీరు చూసుకుందురుగాని.... అప్పుడు ప్యాక్ చేయించేద్దాం" అన్నాడతడు. అతడింకా ఏదో అనేలోగా ఓ వెయిటర్ ట్రేలో మా యిద్దరికీ కూల్ డ్రింక్స్ యిచ్చాడు.

మేము కూల్ డ్రింక్స్ తీసుకుంటూండగా ఓ యువకుడు కెమేరాతో వచ్చి-"జస్టేమినిట్ ప్లీజ్!" అన్నాడు.

"మాకు ఫొటోలెందుకు!" అన్నాను నేను కంగారుగా.

"మా కస్టమర్సంటే మాకెంతో నమ్మకం. కానీ కొందరు సరదాకి మా షాపుకివచ్చి కూల్ డ్రింక్సు తాగి తోచిన ఆర్డర్సిచ్చి వెళ్ళిపోతూంటారు. మాకార్డరిచ్చేక తిరిగి రాకుండా వెళ్ళిపోయిన కస్టమర్స్ గురించి "కూల్ డ్రింకు కక్కుర్తిగాళ్ళు" అనే పేరిట రేపటిపేపర్లో ఫొటోలు వేయిస్తాం..." అన్నాడా నడివయస్కుడు.

"ఇది మీ కస్టమర్సుని అవమానించడం అవుతుంది"— అన్నాడు రామారావు చిరుకోపంతో.

"లేదుసార్—మాకు మా కస్టమర్సంటే ఎంతోగౌరవం. అందుకే ఆర్డరిచ్చినపుడు అడ్వాన్సుగా ఒక్కపైస కూడా తీసుకోము. అంతేకాదు—ఫొటోలు రహస్యంగాకాక చెప్పి మరీ తీస్తున్నాం" అన్నాడు.

"నేను మీ కస్టమర్ని కాను. వీరికి తోడుగావచ్చాను. నాకు ఫొటోవద్దు" అన్నాను. అతడేదో అనబోగా రామారావు కలగజేసుకుని అతడు "నాకు తోడుగావచ్చాడు. ఫొటో నాకే తీయండి" అన్నాడు.

ఫొటోలయ్యేక యిద్దరం అక్కణ్ణించి బయటపడ్డాం.

"నీ వల్ల నాకు చాలామంచి ఉపకారం జరిగింది. మంచి దుకాణానికే తెచ్చావు. అన్నిపనులూ ఒక్క క్షణంలో అయిపోయాయి...." అన్నాడు రామారావు.

"అంతకంటే గొప్ప ఉపకారం మీరు నాకు చేయాలి— ఇప్పుడు మా యింటికి వెడదాం—" అన్నానుత్సాహంగా.

"సరే—అలాగే...." అని ఆయన పక్కనున్నవాణ్ణి కొత్తపేట జంక్షన్‌కు ఏ బస్సెక్కాలని అడిగాడు.

"ఇప్పుడు కొత్తపేట జంక్షన్ కెందుకు?" అన్నాను అసహనంగా.

"మగపెళ్ళివారిల్లక్కడేనని ఇందాకా మా శంకరం పక్కవాటా అతడు చెప్పాడుగా. నువ్వేమో యిల్లు వాళ్ళింటికి దగ్గర్లోనే అన్నావు...."

"కానీ మీరనేది చుట్టుదారి. మా యింటికి వేరే బస్సులో వెళ్ళాలి. అక్కణ్ణించి మీవాళ్ళింటికి దగ్గరదారి వుంది—" అన్నాను.

"పోనీలెద్దూ—ఎట్నించి ఎటైతేమాత్రం ఎంత తేడా వుంటుంది? అందులోనూ బస్సు ప్రయాణం. అయిదూ పది నిముషాలకుమించి తేడావుండదుగా" అన్నాడాయన.

"పెళ్ళివారింటికి వెడితే ఓ పట్టానవాళ్ళు మిమ్మల్ని రానివ్వరేమో" అన్నాను.

"ఆ భయం నీకక్కర్లేదు. మా పిల్ల వాళ్ళదయ్యేదాకా కాళ్ళలో చెప్పులుంచుకునే వెడతాననుకో" అన్నాడాయన.

మొత్తంమీద మేమిద్దరం కలిసి మగపెళ్ళివారింటికి వెళ్ళాం. వాళ్ళాయన్నూ నన్నూ సగౌరవంగా ఆహ్వానించారు. భోజనం చేయనిదే యిల్లు కదలడానికి వీల్లేదన్నారు.

రామారావు తాపీగా—"మీరంతలా బలవంతపెడితే తప్పదుమరి!" అన్నాడు.

"మరి నా యింటికెప్పుడొస్తారు....?" అన్నాన్నేను.

ఆయన నాతో—"అలా వీధిలోకి వెడదాం—పద!" అన్నారు.

మేమిద్దరం వీధి గుమ్మంలోకి వెళ్ళాం. అప్పుడాయన నాకు మాత్రమే వినబడేలా—"ఈ ఊళ్ళో వారం రోజుల క్రితమే తెరిచిన కళ్యాణమందిర్ గురించి వూళ్ళోనే ఇంకా బస్‌కండక్టర్లకు కూడా సరిగ్గా తెలియదు. ఆరు వారాలుగా వూళ్ళోలేని నీకు తెలిపిందంటే వుదయం ట్రయిన్లో నా దగ్గర తీసుకున్న మాసపత్రికల్లో అడ్వర్టయిజ్‌మెంట్ చూసి వుంటావు. ఇంకో అవకాశం నీకులేదు. మాసపత్రికలో చిన్న అక్షరాలతో వున్న ఆ అడ్వర్టయిజ్‌మెంటును చదవ గలిగావంటే నీ కళ్ళజబ్బు తగ్గిపోయిందనేగా అర్థం! ఆ తర్వాత నీకు బస్‌స్టాపుల నెంబర్లు, బస్‌నెంబర్లు అన్నీ బాగానే కనబడ్డాయి. అంటే నీ చూపు బాగుపడిపోయిందన్న మాట. ఇప్పుడింటికి వెళ్ళావంటే మీనాన్న కీళ్ళజబ్బు కూడా నయమైపోతుంది. నేను రానక్కర్లేదు...." అన్నాడు.

కళ్యాణమందిర్ గురించి చెప్పడం నేను చేసిన పెద్ద పొరపాటు. నేను మోసగాడినని ఆయనకు తెలిసిపోయింది. "నన్ను మీరు నమ్మినట్లులేదు. అలాంటప్పుడు కూడా ఎందుకు రాసిచ్చారు!"

"నాకు వయసుడిగింది. బలంతగ్గింది. నా దగ్గరడబ్బుందని తెలిస్తే ఎవడైనా నా జోలికిరావచ్చు. నా పక్కన నీవంటి యువకుడుంటే ఎవడూ నా జోలికిరాడు. ఇంత పేపూ వి న్నాకట్టుకున్నాను. ఇక నాకుతోడుగా మా అమ్మాయి కాబోయే మరుదులున్నారు. సెలవు" అన్నాడాయన.

రామారావు ఘటికుడు. నా కాయన మెత్తగా బదు లిచ్చాడు. అక్కణ్ణించి వెళ్ళిపోతూంటే ఆయన కళ్యాణ మందిర్‌ను పొగడ్డం నాకు వినిపిస్తోంది. ఆయనకా దుకాణం అంతగా ఎందుకు నచ్చిందో బహుశా నాకు మాత్రమే తెలుసు. □

స్మగ్లింగ్ ప్రాణం తీసింది

ఎమ్.వి.వి. సత్యనారాయణ



బల్లమీది టెలిఫోన్ గణగణలాడింది. డిటెక్టివ్ శిరీష్ రిసీవరెత్తి 'హలో....' అన్నాడు.

"ఎవరు సార్ మాట్లాడేది?" అవతల అడిగారు.

"డిటెక్టివ్ శిరీష్‌ను మాట్లాడుతున్నాను. మీరు ...,"

"నన్ను కోటేశ్వరరావంటారు సార్! నమస్కారం సార్!"

"నమస్కారం!"

"మీతో వొక్క పదినిమిషాలు మాట్లాడాలి సార్!"

"ఎప్పుడు?"

"ఇప్పుడే సార్!"

"ఇప్పుడు వీలుపడదండి కోటేశ్వరరావుగారూ! ఉన్నతాధికారుల ప్రత్యేక సమావేశానికి బయల్దేరి వెళ్తున్నాను!"

"అలాగా సార్! తిరిగి ఎప్పుడు వస్తారు?"

"కాస్త ఆలస్యమవుతుంది!"

"సాయంకాలం ఫోన్ చేసి వస్తాను సార్!"

"అలాగే చేయండి! వుంటాను!" శిరీష్ రిసీవర్ పెట్టేశాడు. తర్వాత చకచక తయారై డాట్సన్‌కారు యివతలకి తీశాడు. మరో అయిదు నిమిషాల తర్వాత డాట్సన్ విశాఖ నగర వీధులలో పరుగులు తీస్తోంది.

వేసవి ఉదయం ఎండ శరీరాన్ని గుబులు పెడుతోంది. గాలిలో తగినంత తేమ లేకపోవడంతో వాతావరణం యిబ్బంది కలిగిస్తోంది.

డాట్సన్ ఎత్తరుగుల సమావేశ మందిరం వద్ద ఆగింది. శిరీష్ కారులోంచి తలపైకెత్తి చూశాడు. సమావేశ మందిరం వద్ద నలుగురు పోలీసులు కాపలా వున్నారు.

శిరీష్ వారిలో ఒకరిని పిలిచాడు.

"క్రయిమ్ బ్రాంచ్ నుండి యిన్‌స్పెక్టర్ కుమార్ వచ్చారా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"వచ్చారు సార్! రంగనాథం వీధిలో ఎవరో తెలిసినవారు ఫోన్ చేశారట సార్! అటు వెళ్ళారు!" అన్నాడు ఒక పోలీసు.

డిటెక్టివ్ శిరీష్ తలూపి కారును ఒక ప్రక్కగా ఆపాడు. సమావేశం జరగవలసిన మందిరంలోకి నడిచాడు. అప్పటికే పోలీస్ కమీషనర్, ఐ.జీ, జిల్లా కలెక్టరూ సమావేశానికి హాజరై వున్నారు.

శిరీష్ వాళ్ళను పలకరించి తన సీటులో కూర్చున్నాడు. అతడి మస్తిష్కంలో ఆలోచనలు రకరకాలుగా రేగుతున్నాయి. ఇక్కడ ప్రముఖులందరూ హాజరై వున్నారు. వీరందరినీ విడిచిపెట్టి కేవలం ఇన్‌స్పెక్టర్ హోదాతో వున్న కుమార్ రంగనాథం వీధిలోకి పరుగుతీయడం విచిత్రంగా వుంది. రంగనాథం వీధిలో అతడిని ఆకర్షించిన విశేషం ఏమిటి?

అటెండెంట్ అతడివైపు పరుగెత్తుకు వచ్చాడు.

"సార్! మీకు ఫోన్ వచ్చింది సార్! ఇన్‌స్పెక్టర్ గారు చేశారు సార్!" అన్నాడు అటెండెంట్.

శిరీష్ చటుక్కున లేచి టెలిఫోన్ వున్న గదివైపు చురుకుగా అడుగులు వేశాడు.

2

టైలర్ మస్తాన్ ఆ గదిముందు చురుకుగా తిరుగుతున్నాడు. చేతిలో వున్న బట్టల పాకెట్టును అసహనంగా రెండో చేతిలోకి మార్చుకుంటున్నాడు. మధ్యలో ఆగి కాలింగ్‌బెల్ నొక్క తిరిగి పచార్లు చేస్తున్నాడు. మధ్యలో ఆగి తలుపు కొట్టాడు.

చేతిలో వున్న బట్టల పాకెట్టువైపు చూసుకుని నిట్టూర్చాడు.

'కనకారావు ఏం చేస్తున్నాడు లోపల? తనను యీ సమయానికి రమ్మని మరీమరీ చెప్పాడు. ఇంట్లో ఒక్కడూ వుంటానన్నాడు. అతడి అన్నయ్య యింట్లో వుండడట!

వదినె గుడికి వెళ్తుందట! వాళ్ళిద్దరికీ తెలియకుండా సఫారీ డ్రెస్సు కుట్టించుకున్నాడు కనకారావు!'

అతడు త్వరగా తలుపు తెరచి తనను లోపలికి తీసుకు వెళ్ళినట్టయితే ఈ డ్రెస్ అతడికి ఎలా అమరిందో చూచే వాడు. తిరిగి తాను షాపువద్దకు వెళ్ళిపోవాలి. షాపులో కుర్రవాడొకడే వుంటాడు.

మస్తాన్ తిరిగి అసహనంగా పచార్లు మొదలుపెట్టాడు.

వీధిలో ఆటో చప్పుడయింది. మస్తాన్ వులిక్కిపడ్డాడు. అది యింటివద్ద ఆగినట్టు చప్పుడయింది. వరండాలోంచే తొంగిచూశాడు.

ఆవిడ కనకారావు వదినే! ఆటో దిగి బాడుగ చెల్లిస్తోంది. కనకరావు లోపల ఏం చేస్తున్నాడు? ఇంత కాలం గడుస్తూన్నప్పటికీ అతడు యింకా తలుపు తీయడేం?

పద్మ యింటి మెట్లెక్కి వరండాలోకి వచ్చింది. మస్తాన్ని చూచింది.

"నువ్వా మస్తాన్! కనకారావు కోసమేనా?" అన్నదామె.

"అవునమ్మా, ఎన్నిసారుల్ బెల్లూ కొట్టినాన్. మీకీ మర్ది తల్పూ తీయాకున్నాడ్!" అన్నాడు మస్తాన్.

పద్మ యింటి తలుపుతట్టి, "కనకారావ్! కనకారావ్!" అంది.

లోపల ఎలాంటి అలికిడీ లేదు. ఒకటే పెద్ద తలుపు అది. దానికి ఒక ప్రక్కగా మధ్యలో స్టీల్ పిడి మెరుస్తోంది. పిడిని పట్టుకుని తెరవాలని ప్రయత్నించింది.

తలుపు చటుక్కున లోపలకు జరిగింది.

పద్మ అతడివైపు చూచి, "తలుపు తెరచే వుందికదా! లోపలకు వెళ్ళలేక పోయావా?" అంది.

"తల్పూ తెర్చీ హూందనీ తెల్వద్ హమ్మా!" అన్నాడు మస్తాన్.

పద్మ లోపలికి నడిచింది. మస్తాన్ యింకా తలుపు వద్దనే తటపటాయిస్తూన్నాడు.

పద్మ అన్నిగదులూ వెతుకుతూ బెడ్ రూంవైపు వెళ్ళింది. గుమ్మంలోనే ఆమెకు కనకారావు ఎదురయాడు. గచ్చుమీద వెల్లకితలా పడివున్నాడు. కళ్ళు తెరచుకుని వున్నాయి. అతడి మెడచుట్టూ సన్నటి నడుము బెల్ట్ బిగించివుంది. చేతులూ కాళ్లూ తోటకూరకాడల్లాగా వాడిపోయి వున్నాయి. మొహంలో తెరచుకున్న కళ్ళకు తోడుగా నాలుక వెలుపలకు వచ్చింది. రక్తప్రసారం నిలిచిపోవడంవల్ల కాబోలు మొహం నల్లగా కమిలిపోయి వుంది.

పద్మ విభ్రాంతపోయింది. ఏమిటిది? ఏం జరిగింది? తాను చూస్తోంది కలా? నిజమా? అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరయినా ఆతడిని చంపేశారా?

పద్మకు తల తిరుగుతోంది. మెల్లగా అరచి కుప్పకూలిపోయింది.

మస్తాన్ ఆమె అరుపు విన్నాడు. లోపలికి వచ్చాడు. కూలి పడిపోయిన పద్మనూ, గడపకు అవతల నిర్జీవంగా కనిపిస్తోన్న కనకారావునూ చూశాడు. చకచక బయటికి పరుగెత్తాడు.

రోడ్డుమీద నిలబడి అటూ యిటూ చూశాడు. మందుల షాపులో టెలిఫోన్ వుంది. మందులషాపు వ్యక్తిని బతిమాలి ఫోన్ అందుకున్నాడు. పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

అవతల ప్రక్క సార్జెంట్ పలికాడు. మస్తాన్ గడగడలాడుతూ చెప్పేశాడు.

"శవం ఎక్కడుంది?" అడిగాడు సార్జెంట్.

"రంగనాథం వీధిలో పదిహేండో నెంబర్ యింట్లో!"

"నేను యిప్పుడే సిబ్బందితో బయల్దేరుతున్నాను" అన్నాడు సార్జెంట్.

మస్తాన్ బరువు తీరినట్టుగా బలంగా నిశ్వసించాడు.

3

జీపు పదిహేడో నెంబర్ యింటిముందు ఆగింది. ఇద్దరు పోలీసు కానిస్టేబుల్సూ, సార్జెంటూ దిగారు. వెనుక నుండి ఫోటోగ్రాఫరూ, వేలిముద్రల నిపుణుడూ, మరో కానిస్టేబులూ దిగారు.

మస్తాన్ వాళ్ళకు ఎదురు వెళ్ళాడు.

"చేతిలో పాకెట్టు ఏమిటి? బాంబు కాదుకదా!" నవ్వాడు సార్జెంట్.

మస్తాన్ అతి కష్టంమీద నవ్వాడు. అతడు గడగడ వణుకుతున్నాడు కానిస్టేబుల్సు యిద్దరు గుమ్మానికటూ యిటూ కాచుకున్నారు. మిగతావాళ్ళు సార్జెంటుతో సహా లోపలికి నడిచారు.

పద్మ యింకా స్పృహతప్పే వుంది. సార్జెంట్ ఆమెకు ఎదురుగా కూర్చుండి స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపించాడు. పద్మకు స్పృహ వచ్చింది. బూట్లు టకటక లాడించుకుంటూ క్రయిమ్ బ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్ లోపలకు వచ్చాడు.

పద్మకు మంచినీళ్ళందించి ఆమె త్రాగేలాగా చూశాడు సార్జెంట్. తరువాత ప్రక్క గదిలో కూర్చుండబెట్టాడు.

పోలీసు సిబ్బంది శవ పంచాయితీలో పడ్డారు. కుమార్ వాళ్ళకు సూచనలిచ్చి పద్మ కూర్చున్నచోటికి వచ్చాడు.

"అతడి పేరేమిటమ్మా!" అడిగాడు ఇన్‌స్పెక్టర్

కుమార్.

"కనకారావు సర్! మావారి తమ్ముడు!"

"మీవారి పేరేమిటి?"

"కోటేశ్వరరావుగారు."

"ఏం చేస్తూంటారు?"

"మార్కెట్లో వారికి పాన్ బ్రోకర్ ఆఫీస్ వుంది!"

"వారి వ్యాపారం ఎలా వుంది?"

"ఏదో అంతంత మాత్రంగానే వుంది సర్!"

"మీరు ఏం చూశారో, కనకారావు ఎందుకు చచ్చిపోయాడో—తెలిసినంతవరకూ వివరంగా చెప్పండి!"

"ఉదయాన్నే మావారు సొంత పనిమీద పట్నంలోకి వెళ్లారు. నేను గుడికి వెళ్లాను. కనకారావు యింట్లోనే వుంటానన్నాడు. ఇల్లు అతడికి ఒప్పచెప్పి వెళ్లాను."

"మీరు ముందు వెళ్ళారా? కోటేశ్వరరావుగారు వెళ్ళారా?"

"కోటేశ్వరరావు గారే!"

"కనకారావు ఏం చేస్తూంటాడు?"

"ఉద్యోగ ప్రయత్నం!"

"వూఁ! చెప్పండి!"

"గంటలో తిరిగి వచ్చాను. ఉదయం పదకొండవుతోంది. వరండాలో టైలర్ మస్తాన్ చిరాకుగా పచార్లు చేస్తున్నాడు. అతడిని పలకరించాను. కనకారావు కోసం వచ్చాడతడు. అతడు అంతవరకూ తలుపు కొట్టి, ఎలక్ట్రిక్ బెల్ నొక్కి కనకారావును యివతలకు రప్పించబోయాడట. నేనుకూడా తలుపుతట్టి ఎందుకయినా మంచిదని పిడిమీద చెయ్యివేశాను. పిడి తిరిగి తలుపు తెరుచుకుంది. నేను లోపలికి కనకారావును వెతుక్కుంటూ వెళ్ళాను. మా బెడ్

రూంలో గడపవద్దనే కనిపించాడు కనకారావు...." ఆమె గొంతు బొంగురుపోయింది.

"కనకారావు ఎలా మరణించాడని మీ నమ్మకం:"

"గొంతుకు బెల్ట్ బిగించి వుంది! అతడే బిగించు కున్నాడో, ఎవరైనా బిగించారో నాకు తెలియదు."

"బెల్ట్ ఎవరిదో గుర్తుపట్టారా?"

"మా వారిది సర్!"

"కనకారావుకు శత్రువులెవరైనా వున్నారా?"

"వాళ్ళ అన్నయ్యగారికి తెలుసేమో కాని....నాకు ఆ విషయం తెలియదు సర్!"

"కనకారావు వుద్యోగ ప్రయత్నంలోనే వున్నాడా? ఏదైనా చిల్లరమల్లర వుద్యోగం చేస్తున్నాడా?"

ఆమె తటపటాయించి, "బ్లాకులో సినిమా టిక్కెట్లు అమ్ముతూన్నట్టుగా వాళ్లూ వీళ్లూ చెప్పుకోవడం విన్నాను!" అంది.

"అంతేనా? యింకా ఏమయినా దొంగతనాల్లాంటివి చేస్తాడా?"

"నాకు తెలిసి అలాంటి పనులు చెయ్యడు సర్!"

సార్జెంట్ గుమ్మం దగ్గర ప్రత్యక్షమయాడు.

"సర్! డిటెక్టివ్ శిరీష్ వచ్చారు!" అన్నాడు సార్జెంట్.

పద్మను విడిచిపెట్టి, కుమార్ బయటికి కదిలాడు. శిరీష్ అతడిని సీరియస్‌గా చూచి, "శవమా!" అన్నాడు.

కుమార్ అతడి భుజం తట్టి శవం వున్నచోటికి తీసుకు వెళ్ళాడు.

"పంచాయితీ ముగిసింది సర్! అంబులెన్స్ వాన్‌కి ఫోన్ చేశాను!" అన్నాడు సార్జెంట్.

కనకారావు శవాన్ని పరిశీలించి దాన్ని దాటి అవతలకు

వెళ్ళాడు డిటెక్టివ్ శిరీష్.

బెడ్ రూం అందంగా వుంది కోటేశ్వరరావూ, పద్మ కలిపివున్న ఫోటో చూశాడు శిరీష్.

"అతడి తమ్ముడే చచ్చిపోయిన యీ కనకారావు!" అన్నాడు కుమార్.

వేలిముద్రల నిపుణుడు సూదిని వ్రేళ్ళ మధ్య పట్టుకున్నాడు. "ఇది శవందగ్గర దొరికింది!" అన్నాడతడు.

"ఎటుప్రక్క దొరికింది?" అడిగాడు శిరీష్.

"బెడ్ రూంలో. శవం ప్రక్కనే సార్!"

"ఎందుకు పనికివస్తుందది?" అన్నాడు కుమార్.

తరువాత అతడు మస్తాన్ వైపు తిరిగి, "పదండి! మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలి!" అంటూ అతడివి విడిగా గదిలోకి తీసుకువెళ్ళాడు. ఇల్లంతా వుడకబోస్తోంది. ఉదయం నుండీ పవర్ బంద్!

"మీకు కనకారావు ఎలా తెలుసు?" అడిగాడు యిన్స్పెక్టర్ కుమార్.

"కనకారావు నా దగ్గరే దుస్తులు కుట్టించుకుంటాడు సార్! అతడిక్క సఫారీ డ్రెస్ కుట్టీ తీసుకువచ్చాను సార్!".

కుమార్ అతడి చేతిలోని పాకెట్టును పరిశీలించి చూశాడు. తర్వాత "మీరు ఎంతసేపటి నుండి కనకారావు కోసం ప్రయత్నిస్తున్నారు?" అని అడిగాడు.

"సుమారు పదీ నిముషాలనుండీ సార్!"

"తలుపు తాళంపెట్టి లేదు. పిడి తెరచుకుని వెళ్ళవచ్చు కదా!"

"హెలాగ వెళ్తాం సార్! హల్లాగా వెల్లాకూడదూకదా సార్!"

"మీరు ఎలక్ట్రిక్ బెల్ కూడా మోగించారట. అయినా కనకారావు నిద్రలేచి రాలేదు. మీకేమనిపించింది?"

"అరె, యీసువ్వర్ పట్టాపగలూ హింతానిద్రా హెలా పోతున్నాడి! అనిపించింది సార్!"

ఇన్‌స్పెక్టర్ కుమార్ గుమ్మం పైభాగంలో అమర్చి వున్న ఎలక్ట్రిక్ బెల్ చూశాడు.

"కనకారావు ప్రాణాలు కోల్పోయి కనిపించాడు. అతడిని చూస్తూంటే మీకేమనిపించింది?"

"హేముందీ సార్! ఎవ్రో అతడూ అంటే కిట్టనివాడ్ అతడ్నీ చంపేశాడ్!"

"బెల్ట్ గొంతుకు బిగించి చంపేశాడు. బెల్ట్ కోటేశ్వర రావుకు సంబంధించినది! కోటేశ్వరరావు తన తమ్ముడు కనకారావును చంపి వుంటాడని మీ నమ్మకమా?"

మస్తాన్ నాలుక కరచుకున్నాడు. "నాకూ తెలియద్ సార్!" అన్నాడు.

"కనకారావు బ్లాకులో సినిమా టిక్కెట్లు అమ్మతాడట. ఆ సంగతి మీకు తెలుసా?"

"తెలుసును సార్!"

"అతడికి యింకా యిలాంటి అక్రమ వ్యవహారాలతో సంబంధం వున్నదని తెలిసింది! అలాంటి విషయాలు మీకు తెలిస్తే దయచేసి చెప్పండి!"

"తెలియదూ సార్!"

అతడిమాట ముగియకముందే డిటెక్టివ్ శిరీష్ అక్కడికి వచ్చాడు.

గుమ్మంలో అలికిడయింది. ఇన్‌స్పెక్టర్ కుమార్ తల తిప్పి చూశాడు.

పద్మ ప్రక్కన ఫోటోలో వున్నది అతడే! అతడే

కోటేశ్వరరావన్న మాట!

"ఏమిటిసార్! ఏమయింది?" అన్నాడు కోటేశ్వరరావు. అతడి మొహంలో ఆత్రుతా, ఒంట్లో వణుకూ, చెమటలు కక్కే పరిస్థితీ అన్నీ కలిపి అతడి మానసిక స్థితిని తెలియ పరుస్తోన్నాయి.

4

"ఏం జరిగింది సార్? మా ఇంట్లో పోలీసులేమిటి సార్!" అంటూ అతను శిరీష్‌ను సమీపించాడు.

శిరీష్ నుదురు చిట్లించి, "నేను మీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు సార్!" అన్నాడు కోటేశ్వరరావు. "ఉదయం నేనే మీకు ఫోన్ చేశాను సార్! మీరు పున్నతాధికారులతో అత్యవసర సమావేశంలో పాల్గొంటున్నట్టు చెప్పారు. తిరిగి ఈ సాయంకాలం మీకు ఫోన్ చేసి ఇంటికి వస్తానని చెప్పాను."

శిరీష్ తలూపి, "కాని ఈ లోపునే మనం కలుసుకో గలిగాం! చెప్పండి! మీరు నన్ను యెందుకు కలుసుకోవా లనుకున్నారో!" అన్నాడు.

"కనకారావుకు స్మగ్లింగ్ ముఠాతో సంబంధం వుంది. ఆ విషయం నాకు రాత్రే తెలిసింది. ఇంతకాలమూ నా తమ్ముడు బ్లాకులో సినిమా టిక్కెట్లు అమ్మినా సహించాను కానీ స్మగ్లింగ్ ముఠాతో చెయ్యి కలిపితే ఆ సంబంధం వాడి ప్రాణాలనే తీయవచ్చు, మాకూ ఏదైనా అపద తేవచ్చు. వాడు ఏదో పుద్యోగం చూసుకుని పైకి వస్తాడనుకున్నాను కానీ ఇలా అక్రమ వ్యాపారాల్లో ఇరుక్కుంటాడనుకో లేదు. అందుకే దాన్ని మొగ్గలోనే తుంచెయ్యాలని, అందుకు తగిన పద్ధతిలో అతడిని మార్చుకోడానికి మీరు మార్గం

చెప్పి సహకరిస్తారని మీకు ఫోన్ చేశాను" అన్నాడు కోటేశ్వరరావు.

"అందుకేనా కనకారావును మీ బెల్టు నుపయోగించి హత్యచేశారు! ఏమీ తెలియనట్టుగా ఇప్పుడు వచ్చారు?" మధ్యలో కలగచేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

కోటేశ్వరరావు నిర్ఘాంతపోయాడు. "ఆఁ! మా తమ్ముడు చచ్చిపోయాడా? నేను హత్యచేశానా? అన్యాయం సార్!" అంటూ వెనక వున్న బెడ్‌రూంవైపు పరుగెత్తబోయాడు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ చేతిలోని లాఠీ అతడి భుజంమీద వాలింది. "ఆగు!" అని అరిచాడు కుమార్.

"సార్.... సార్ ....ఒక్కసారి నా తమ్ముడిని చూచి వస్తాను సార్!" కోటేశ్వరరావు ప్రాధేయపడ్డాడు.

"కుమార్! వెళ్ళ రానివ్వు! హంతకుడు కాడు అతడు!" అన్నాడు శిరీష్.

"హంతకుడు కాడా? అయితే ఎవరు?"

"మస్తాన్!"

మస్తాన్ వులిక్కిపడ్డాడు. అతడి చేతిలోంచి పాకెట్ జారిపడింది.

"మస్తాన్ కాలింగ్‌బెల్ చాలసార్లు నొక్కాడు. చాల సార్లు నొక్కినా బెల్ మోగలేదనే విషయం అతడు గుర్తించలేదా. మొదటిసారే గుర్తించి వుంటే తర్వాత అతడు బెల్ నొక్కే ప్రసక్తే లేదు."

"బెల్ ఎందుకు మోగలేదు?"

"ఉదయం నుండీ కరెంటులేదు! బెల్ ఎలా మోగుతుంది? అయినా ఎన్నోసార్లు బెల్ మోగినట్టు మస్తాన్ చెప్పాడు. బెల్ మోగిందీ లేనిదీ బెల్ కొట్టేవాడికి విని

పించేటంత దూరంలోనే స్విచ్ నుండి బెల్ వుంది. అంటే మస్తాన్ అబద్ధం చెప్పాడన్నమాట!"

మస్తాన్ తల వొంచుకున్నాడు.

"మస్తాన్! నీ షర్ట్‌కి సూదిపెట్టుకున్నావ్ కదూ!" అన్నాడు శిరీష్.

మస్తాన్ చటుక్కున షర్ట్‌పై బటన్ వున్నచోట వెతికాడు. సూదిలేదు శిరీష్ అతడికి సూది అందిస్తూ, "ఇదిగో, మస్తాన్! శవంవద్ద పడివుంది టైలర్లు వాడే యీ సూది. నువు తలుపు తెరవకుండా శవంవద్దకు వెళ్ళకుండా వుండి వుంటే అక్కడ శవంతో కొంతసేపు కాలక్షేపం—అంటే కనకారావు చనిపోకముందు బెల్టుబిగించి చంపే ప్రయత్నం చేయకుండా వుంటే నీ షర్టుకు వున్న యీ సూది శవంవద్ద పడివుండేదికాదు.

కోటేశ్వరరావూ, పద్మా లేని సమయంలో కనకారావును కలుసుకోవడానికి యేర్పాటు చేసుకున్నావు. మీ యిద్దరికీ ఆ రకంగా కలుసుకునే యేర్పాటు యింతకుముందునుండి వుండివుండాలి! గుట్టుచప్పుడు కాకుండా కనకారావుతో ఒంటరిగా మాట్లాడుతూ అతడి మెడకు బెల్టు బిగించావు. కనకారావు గిలగిల గింజుకున్నాడు. ఆ ప్రయత్నంలోనే నీ షర్టుకు గుచ్చుకున్న సూది పడిపోయింది.

కనకారావు ప్రాణాలు పోయినట్టు నిర్ధారణ అయాక వరండా చేరుకున్నావు తలుపు దగ్గరగావేసి అమాయకంగా కనకారావుకోసం తలుపుమీద కొట్టి, కాలింగ్‌బెల్ నొక్కి హడావుడి చేశావు. పద్మగానీ, కోటేశ్వరరావుగానీ వచ్చే వరకూ ఎదురు చూస్తున్నావు!"

మస్తాన్ కుప్పకూలిపోయాడు.

కుమార్ అతడిని అదుపులోకి తీసుకున్నాడు.

"ఇతడు కనకారావును చంపడానికి ప్రేరణ యేమై వుంటుంది శిరీష్?" అన్నాడు కుమార్.

"స్మగ్లింలో యిద్దరూ భాగస్వాములు. కనకారావువల్ల వారిద్దరి వ్యాపారం గురించి కోటేశ్వరరావుకి తెలిసి వచ్చింది. అందువలన కనకారావును చంపివేశాడు ముస్తాన్. ఎవరిదో సఫారి డ్రెస్సు మోసుకు తెచ్చుకని తన ఎలిబీ తానే సృష్టించుకుంటూ హత్యచేశాడు.

వరండాలోకి వచ్చినవాడు—కాలింగ్‌బెల్ మోగకపోతే, తనకి కావలసిన వ్యక్తి యెంతకూ పలకకపోతే, తలుపు తెరవాలనో, లోపలకు చూడాలనో ప్రయత్నిస్తాడు. అది సహజమైన వెతుకులాట! దాంట్లో తప్పుపట్టవలసిన పని లేదు. ముస్తాన్ ఆ ప్రయత్నాల్లో యే వొక్కటీ చేయలేదంటే అతడికి అప్పటికే కనకారావ్ ఇక పలకదని తెలుసన్నమాట! అదే అతడిని అనుమానించేలాగా చేసింది!" ముగించాడు శిరీష్. □

"?"

కర్ఫ్యూలో అతిథి..

సరసి

కర్ఫ్యూ హైదరాబాద్‌కి కొత్తేం కాదు.

కనీసం ఆర్నెల్లకోసారైనా అది పాత బస్తీని పరామర్శిస్తూ వుంటుంది. మత కలహాలు రేగాయంటే 'కర్ఫ్యూ సీజన్' వచ్చిందన్నమాటే.

అటువంటి కర్ఫ్యూ సీజన్‌లో పాత బస్తీలో ఓ రోజు.

ఈదురుగాలికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి పెద్ద శబ్దంచేస్తూ. చిటపటగా ప్రారంభమైన చినుకులు క్రమేపీ పెద్ద వర్షంగా రూపుదాల్చాయి.

తలుపులు వేయడానికి కిటికీని సమీపించిన మెహరున్నీసా యధాలాపంగా బైటికి తొంగిచూసింది. కాంపౌండు లోపలికొచ్చి గోడవారగా చలికి వొణుకుతూ నిలబడ్డ వృద్ధుడు కనిపించాడు వీధి దీపం వెలుగులో.

చీకటి! దానికి తోడు వర్షం! ఈ రెండూ చాలవన్నట్లు కర్ఫ్యూ!!

అతడి పరిస్థితి ఆమెలో జాలి కలిగించింది.

తలమీద ముసుగు ముందుకి లాక్కుని గేటుదాకా వడివడిగా నడిచి చెయ్యి ఆసరా ఇచ్చి వృద్ధుణ్ని లోపలికి తీసుకొచ్చింది మెహర్.

డబ్భయి వసంతాలు చూపినట్టున్న ముడతలుపడ్డ మొహం, తెల్లటి గడ్డం, కొత్త ఖద్దరు బనీను, అక్కడక్కడ తడిపి ఒంటికంటుకున్న పంచె, చేతికర్ర, సంచీ.

తల తుడుచుకోడానికి తువ్వాలిచ్చి అడిగింది మెహరున్నీసా-"ఎలా వచ్చావ్? కర్ఫ్యూ కదా!"

అతడు మాట్లాడలేదు వాసాలు లెక్కబెడుతున్నట్టు పైకి చూస్తున్నాడు.

"బైటికెందుకొచ్చావ్ కర్ఫ్యూలో?" ఈసారి కొంచెం స్వరం పెంచి అడిగింది వినబడదేమోననుకుని.

వృద్ధుడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నువ్వు చూళ్లేదా. ఇందాక ఇక్కడ పెద్ద గలభా జరిగింది. ఒకళ్ళనొకళ్ళు కొట్టుకున్నారు కర్రలతోనూ కత్తులతోనూ. గట్టిగా చావుకేకలు! వెంటనే ఎక్కడ్నించో పోలీసులు పరిగెత్తుకొచ్చి వాళ్ళందర్నీ బాగా చితక్కొట్టి లాక్కె

ళ్ళిపోయారు వ్యాన్‌లో పడేసి. బాబ్జీని పిలిచాను, పలక లేదు. పోలీసులు వాళ్ళతోబాటు బాబ్జీనికూడా లాక్కెళ్ళి పోయుంటారు. లేకపోతే నన్ను విడిచి ఎక్కడికి వెళ్ళడు వాడు."

"బాబ్జీ ఎవరు? అసలెందుకున్నారిక్కడ?"

"బాబ్జీ నా కొడుకు! అసలే పిరికి వెధవ! అమాయకుణ్ణి చేసి కొడుతున్నారేమోకూడా" గొంతు బొంగురుపోయింది.

ఒక అర నిమిషం మౌనంగా వుండి మళ్ళీ తనే అన్నాడు.

"సరోజినీ ఆస్పటల్‌నించి వొస్తున్నాం. మాకీవూరు కొత్త."

అదేపనిగా ఇంటికప్పుకేసి కళ్ళార్పుతూ యెందుకు చూస్తున్నాడో ఇప్పుడర్థమైంది మెహర్‌కి. అతడు అంధుడు!

"వరంగల్ నించి సికిందరాబాద్‌లో రైలుదిగి సరాసరి ఆస్పటల్‌కే పోయాం. సాయంత్రం దాకా తిండితిప్పలు లేకుండా నాతోనే వున్నాడు బాబ్జీ. అన్ని పరీక్షలూ చేసి చివరికి ఆపరేషన్ చెయ్యాలని తేల్చారు. అప్పటికప్పుడు ఆపరేషన్ అంటే ఎలా? ఇంటిదగ్గర మా మాణిక్యంతో చీకటిపడేలోగా వచ్చేస్తామని చెప్పొచ్చాం. తీరుబడిగా మళ్ళీ యెప్పుడో రావొచ్చులే అని వచ్చేశాం. కాయితాలు తడిసిపోయాయో యేమిటో!....చూడమ్మా వీటిని ఏదన్నా ప్లాస్టిక్కు... అదే ....పాల కవర్లో పెట్టియ్యి లేకపోతే తడిసిపోతాయి. బాబ్జీ వచ్చాక జాగర్త చేస్తాడు" బనీను జేబులోంచి ఓ కాగితాల మడత తీసిచ్చాడు.

బైట వర్షం భారీగా కురుస్తోంది.

అతడ్ని కుర్చీపీటమీద కూర్చోబెట్టి దీపం వెలుగులో

కాగితాల మడత విప్పిచూసింది మెహర్.

ఇంతలో ఓ వ్యక్తి లోపలినుంచి వచ్చాడు.

వస్తూనే "ఎవరదీ? ఎందుకొచ్చాడు లోపలికి?" చిరాగ్గా అడిగాడు ఉర్దూలో.

"మెల్లిగా మాట్లాడు అన్వర్!" గొంతు తగ్గించి అని, అతని గురించి అంతా చెప్పింది మెహర్.

ఆమె చేతిలో వున్న కాగితాలు లాక్కుని చూశాడు అన్వర్.

వరంగల్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో పీరియాడికల్ చెకప్‌చేసిన కాగితాలూ, కళ్ళజోడు ప్రిస్క్రిప్షన్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి హైదరాబాద్‌కి రిఫర్ చేస్తూ ఇచ్చిన సర్టిఫికెట్, వరంగల్ టు సికిందరాబాద్ రైలు టికెట్, ఇంకా కొన్ని మందుల కాగితాలూ వున్నాయి అందులో.

"మా బాబ్జి రాగానే వెళ్ళిపోతానమ్మా! వూళ్ళో మా మనవరాలు మాకోసం కనిపెట్టుకుంటుంది" అన్నాడు వృద్ధుడు అన్వర్ చిరాకుపడడం గమనించి

"ఫర్వాలేదయ్యా! ఒక్క రాత్రికి నువ్వు మాకేం భారంకాదు. మరోలా అనుకోకు అతని స్వభావం అంతే" నొచ్చుకున్న ధోరణిలో అంది మెహర్.

"పోలీసులు పట్టుకుపోయినవాడు ఇప్పట్లో యెక్కడొస్తాడు? కర్ఫ్యూ తగాదాల్లో ఇలా చాలామంది ఇరుక్కున్నారు. వాళ్ళనందర్నీ క్షణాలమీద వొదిలెయ్యడానికి పోలీసులకేమన్నా పిచ్చెక్కిందనుకున్నావా?" గొంతు చించుకుంటూ అన్నాడు అన్వర్.

"డాక్టర్లిచ్చిన కాగితాలింకా మా బాబ్జి దగ్గరున్నాయి. వాటిని చూపిస్తేచాలు ఇట్టే వొదిలేస్తారు" తలూపుతూ అన్నాడు వృద్ధుడు.

అతడిలో గూడుకట్టుకున్న నమ్మకానికి జాలేసింది మెహర్‌కి.

అన్వర్‌ని లోపలి గదిలోకి తీసికెళ్ళింది.

"అర్ధరాత్రిపూట — పైగా కర్ఫ్యూలో ఓ గుడ్డివాణ్ని బైటికి తోసేస్తే యేమవుతాడు? అన్యాయంగా కొడుకు దూరమైపోయాడని ఓ పక్క యేడుస్తూంటే అతణ్ణి తూల నాడడానికి నీకు మనసెలా వచ్చింది? ఊరుకాని ఊరులో మనమే ఆ స్థితిలో చిక్కుపడి వుండివుంటే ఎంత క్షోభకి గురి అవుతామో ఒకసారి నువ్వే ఊహించుకో అన్వర్!"

అన్వర్ మరి మాటాడలేదు. ఆమె దగ్గరనుంచి విసురుగా వెళ్ళిపోయాడు.

రాత్రి పదవుతున్నా వృద్ధుడు పడుకోలేదు దేవుణ్ని స్మరించుకుంటూ గోడకి జార్లబడి కూర్చున్నాడు.

లోపల్నుంచి కంచంనిండా భోజనంపెట్టి పట్టుకొచ్చి అతడి ముందు పెట్టి చెప్పింది.

కొడుకు పక్కన లేకుండా ఒక్క మెతుకు కూడా ముట్టలేనని చెప్పి తిరస్కరించాడు.

2

రాత్రి ఒంటి గంటయింది.

అన్వర్ మెల్లగా తలుపు తెరిచి తొంగిచూశాడు. ముసలాడు ముడిచిపెట్టుకుని నిద్రపోతున్నాడు.

"సుఖంగా పడుకున్నాడు" అన్నాడు తిరిగి తలుపు మూస్తూ.

"పరిస్థితులు సహకరించడంలేదని నిందిస్తూ కూర్చోడం కన్న ఆ పరిస్థితుల్నే మనకి అనుకూలంగా మలుచుకోవడం తెలివైనవాడి లక్షణం! ఏ మనిషికి కనీసం మంచి నీళ్ళివ్వడానికి కూడా నువ్వు ఇష్టపడలేదో ఆ మనిషే నీ

కిప్పుడొక మహోపకారం చెయ్యబోతున్నాడు! ఆ ముస లాడే మన చదరంగంలో కాబోతున్నాడు ఓ విలువయిన పావు!" అంది మెహరున్నీసా.

అన్వర్ కర్థం కాలేదు ఆ మాటలు.

"చెప్తా విను. పోలీసులు వదిలేశాక బాబ్జీ తండ్రిని వెతుక్కుంటూ వస్తాడు వాడ్ని మనం అదుపులోకి తీసుకుని ఈ ముసలాడి ద్వారా ఆ 'నగలు' మన ఏజంటుకి చేరుద్దాం! పొద్దున్నపూట ఎలాగూ నాలుగు గంటలసేపు కర్ఫ్యూ సడలిస్తున్నారుగా. పని పూర్తిచేసుకొచ్చి మనకి రశీదు చూపించేవరకూ వీడి కొడుకు ప్రాణాలు మన గుప్పిట్లో వుంటాయి. పైగా కళ్ళు కనిపించని వృద్ధు దవడంవల్ల ఇతడ్ని ఏ పోలీసూ అనుమానించి సోదా చెయ్యడు! పని సులభంగా అవుతుంది."

"ఒకవేళ బాబ్జీని పోలీసులు రేపట్లోగా విడుదల చెయ్యకపోతే?" అన్వర్ సందేహంగా అన్నాడు.

"చెయ్యకపోయినా ఫరవాలేదు. బాబ్జీని విడుదల చేశారనీ అతడు మన అధీనంలో వున్నాడనీ గుడ్డివాణ్ని నమ్మించవచ్చు."

అన్వర్ మొహం చేటంతయింది. ఆనందంతో భార్యని గాఢంగా ఓ ముద్దు పెట్టుకున్నాడు.

రెండు నెలల క్రితం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఓ పెద్ద దొంగతనం జరిగింది అందులో నవాబుకు చెందిన లక్షల విలువయిన నగలు కొన్ని దొంగిలించబడ్డాయి.

దొంగల కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. పోలీసు కుక్కల్ని రప్పించారు. డిటెక్టివ్‌లని నియోగించారు. కాని ఫలితం లేకపోయింది.

ఒక పథకం ప్రకారం జరిగిన ఆ చోరీ అన్వర్ మహో

యిద్దరు కలిసి చేశారు.

ఆ దొంగతనం జరిగిన కొద్దిరోజులకి కొంతమంది బొంబాయి స్మగ్లర్లతో అన్వర్‌కి పరిచయం ఏర్పడింది. మెల్లిగా స్మగ్లింగ్ వ్యవహారాలలో వాళ్ళతో చేతులు కలపడం ప్రారంభించాడు.

ఈ కారణంగా బంధువులనీ, స్నేహితులనీ ఇంటికి ఆహ్వానించడం తగ్గించేశాడు అన్వర్. అందుకే ఎవరైనా ఇంటికొస్తే చిటపటలాడతాడు.

తనకు వచ్చిన వాటా నగలని నెల్లాళ్ళదాకా ఇంట్లోనే భద్రంగా దాచాడు, వెంటనే వాటిని చేతులు మారిస్తే పట్టుబడవచ్చుననే భయంతో.

ఆ తర్వాత కర్ఫ్యూ వచ్చి పడింది! కత్తులూ బాకులూ వంటి మారణాయుధాలు రహస్యంగా తీసికెడుతున్నారనే అనుమానంతో అందర్నీ సోదా చెయ్యడం ప్రారంభించారు పోలీసులు. దాంతో నగల్ని తరలించడం పెద్ద సమస్యగా తయారయింది అన్వర్‌కి.

పులిమీద పుట్రలాగా ఈలోగా బొంబాయి ఏజంటు వచ్చి సికిందరాబాద్ హోటల్లో మకాం వేశాడు ఈ నగల కోసం.

పోలీసుల కన్ను గప్పి వాటిని అతడికి చేర్చడం ఎలా!

నాలుగు రోజుల్నుంచీ దీని గురించి తీవ్రంగా మధన పడుతున్న అన్వర్‌కి అతని భార్య చెప్పిన సలహా నచ్చింది. ముసలాడు ఆపద్బాంధవుడిలాగా కనిపించాడు.

తలుపు కొడుతున్న చప్పుడుకి లేచి వచ్చి తలుపుతీసిన మెహర్‌కి ఎదురుగా ఆయాసపడతూ నిలబడ్డ ఓ పాతికేళ్ళ యువకుడు కనిపించాడు.

తెలతెలవారుతోంది.

"నిన్న సాయంత్రం ఈ ఇంటిముందు ఓ ముసలాయన నిలబడి వున్నాడు. ఆయన గుడ్డోడు. చేతిలో కర్ర వుంటుంది. మీరుగానీ చూశారా ఆయన్ని?" ఆందోళనగా వుంది అతడు అడిగే ధోరణి.

"బాబ్జీ అంటే నువ్వేనా?"

"ఆఁ నేనే!" అతడి ముఖం వికసించింది.

తలుపు పూర్తిగా తీసి లోపలికి రమ్మంది.

ఆ పక్కనే పడుకున్న ముసలాడ్ని తట్టి లేపేడు బాబ్జీ సంతోషంతో. కళ్ళు నులుముకుంటూ లేచిన ఆ వృద్ధుడు పరమానందంగా "ఎవరదీ? బాబ్జీ....బాబ్జీ....బాబ్జీ ..." పదే పదే పిలుస్తూ అతడ్ని గుండెల కత్తుకుని ఒళ్ళంతా తడమడం ప్రారంభించాడు.

హడావుడిగా అన్వర్‌ని లేపి బాబ్జీ వచ్చాడని చెప్పింది మెహర్.

ఒక్క అంగలో వాకిట్లోకి వచ్చాడు అన్వర్ నిద్ర కళ్ళతో.

"అప్పుడే వదిలేశారా పోలీసులూ? అదృష్టవంతుడివి!" బాబ్జీ భుజం తట్టి "ఓసారి లోపలికి రండి వెళ్ళిపోదురు గాని" అంటూ తండ్రీ కొడుకుల్ని లోపలి గదిలోకి తీసి కెళ్ళాడు అన్వర్. మెహర్ అనుసరించింది.

3

"నువ్వు కంగారు పడాల్సిన పనిలేదు. మేము చెప్పినట్టు చేశావంటే వెయ్యి రూపాయలిస్తాం నీకు. నీ కళ్ళ ఆపరేషన్‌కి డబ్బు నీకు చాలా అవసరం కూడానూ" చెప్పాడు అన్వర్.

"నాకా పాపిష్టి సొమ్ము ఒక్క పైసా కూడా వద్దు. మా బాబ్జీని విడిపించండి. మా దారిన మేం పోతాం.

'వర్షంలో తడుస్తున్నావు లోపలికి రా' అని పిలుస్తుంటే అదంతా కనికరమే అనుకున్నానుగానీ మనసులో ఇంత దుర్మార్గపాలోచన పెట్టుకుని చేరదీస్తున్నారని వూహించ లేదు" వృద్ధుడు కోపంగా అన్నాడు.

"నువ్వు ఏడ్చి గీపెట్టినా నువ్వు కాని నీ కొడుకుగాని నేను చెప్పిన పని చెయ్యకుండా ఇక్కడ నుంచి అడుగు బయట పెట్టలేరు, అఁ! నేను చెప్పినట్టు చెయ్యి నీకేం కష్టం లేదు. ఈ ప్యాకెట్ తీసికెళ్ళి ఈ అడ్రసులో వున్న మనిషికి యిచ్చి రశీదు తీసుకురా ముట్టినట్లు. నిన్నెవ్వరూ అనుమానించరు. ఒకవేళ ఎవరయినా ప్రశ్నించినా జేబు లోంచి ఆసుపత్రి కాగితాలు చూపించు. వెంటనే వదిలేస్తారు. ఆటోలో వెళ్ళు. ఇదిగో యాభై రూపాయలు. నువ్వే దయినా తెలివి తక్కువగా ప్రవర్తించి పోలీసులకి దొరికి పోయినా వాళ్ళకి ఇక్కడి సంగతులేవయినా చెప్పినట్టు తెలి సినా నీ కొడుక్కి నువ్వే తద్దినం పెట్టాల్సిన ఖర్మ పడు తుంది జాగ్రత్త!"

"అంతమాటనకయ్యా" వృద్ధుడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

బాబ్జీ కుర్చీలో తాళ్ళతో కట్టబడి వున్నాడు. పక్కనే చాకు పట్టుకుని గోళ్ళు 'షేప్' చేసుకుంటూ కూర్చుంది మెహర్.

తండ్రి బాధ చూసేసరికి బాబ్జీ నీరుగారిపోయి "అయ్యా నువ్వు పోయిరా! జాగ్రత్త! నాకేం కాదులే! భయపడకు" అంటూ తండ్రికి ధైర్యం చెప్పాడు.

అన్వర్ మెహర్ కళ్ళల్లోకి చూసి మందహాసం చేశాడు.

నగలున్న ప్యాకెట్ తీసుకుని పంచె కొంగులో మూట

కట్టి బనీను చాటుగా బొడ్లో దోపుకున్నాడు వృద్ధుడు.

అడ్రసు అతని నోటికి వచ్చేలాగా నాలుగయిదుసార్లు చెప్పి అవసరమయితే ఎవరినయినా అడగమని చెప్పి కాగితం మీద కూడా రాసి అతని జేబులో పెట్టాడు అన్వర్.

కొడుక్కి ధైర్యం చెప్పి బైటికి వచ్చిన వృద్ధుణ్ని రోడ్డుమీదకు తీసికెళ్ళి ఆటో ఎక్కించి వచ్చాడు. మళ్ళీ పదిగంటలకు కర్ఫ్యూ పెడతారనీ ఈలోగా రావాలనీ గుర్తు చేశాడు అన్వర్.

అప్పటికి సమయం ఏడున్నర గంటలు.

టైము తొమ్మిదవుతోంది. ముసలాడు రాలేదు.

అన్వర్ గుండె లబలబలాడుతోంది. సరిగ్గా వెళ్ళాడా లేదా? ఇంత ఆలస్యం చేశాడంటే పోలీసులగ్గానీ పట్టుబడ లేదు కదా?

బుర్ర వేడెక్కిపోతోంది. బాబ్జీ వున్న గదికి గడియ వేసి వసారాలో పచార్లు చేస్తున్నాడు.

తొమ్మిదిన్నర కొట్టింది గడియారం. ఇంకా రాలేదు.

అన్వర్ మెహర్‌ని పిలిచి చీవాట్లేశాడు వెధవ ప్లాను చెప్పావని.

ఆమె మూతి ముడుచుకుంది.

సరిగ్గా అదే సమయంలో ఇంటి ముందు ఓ ఆటో ఆగింది. అందులోంచి ఓ వ్యక్తి దిగి డబ్బు చెల్లించి హడావుడిగా పరిగెట్టుకొచ్చాడు అన్వర్ వైపు.

"పోలీసులు తరుముతున్నారు! ఆ నగ ఎక్కడ? వెంటనే తీసివ్వు! హరియప్!" అతడు సికిందరాబాద్ నుంచి వస్తూన్న బొంబాయి ఏజంటు.

అసలే మనశ్శాంతి లేకుండా తిరుగుతున్న అన్వర్‌కి

ఆ మాట వినగానే ఎక్కడలేని కోపం వచ్చి "ఫూల్‌లాగా మాట్లాడకు. రెండు గంటల క్రితమే నీ దగ్గరికి మనిషిచేత పంపేను"

"నాకు పంపించేవా! వారేవా! అవి నాకు చేరితే ఇక్కడి కెందుకు పరిగెట్టుకొస్తాను పోలీసుల్ని తప్పించు కుని! నాకుగాని పిచ్చి పట్టిందనుకున్నావా?"

"నీకు కాదు నాకు పట్టింది పిచ్చి! ఆ ముసలివెధవేదో గోల్‌మాల్ చేసుంటాడు! పోలీసుల కెక్కడ దొరికేవు నువ్వు?"

"గంట క్రితం నీ స్నేహితు లిద్దరూ వచ్చి వాళ్ళ వాటా నగలు ఇచ్చేశారు. వాళ్ళ అకౌంట్ సెటిల్ చేస్తోంటే ఉరుములాగా మీదొచ్చిపడ్డారు పోలీసులు! అడ్డు వచ్చిన ఓ కాన్‌స్టేబుల్‌ని 'షూట్' చేసి దొరక్కుండా పారిపోయి వచ్చేశాను. వాళ్ళు మాత్రం దొరికిపోయారు" చెమట తుడుచుకున్నాడు ఏజంటు.

ఇదంతా గుడ్లప్పగించి చూస్తోంది మెహర్

"సందేహం లేదు! ఇక్కడ్నించి గుడ్డిపీనుగ సరాసరి పోలీస్ స్టేషన్‌కెళ్ళి అంతా చెప్పేసుంటాడు! నీకు తగిన గుణపాఠం చెప్తాన్రా ఒరేయ్! నీ కొడుకు నా గుప్పిట్లో వున్నాడు. వాడి రక్తం తాగి, శవాన్ని నీకు కానుకగా పంపిస్తా" ఆవేశంతో ఊగిపోతూ లోపలికెళ్ళి గది తలుపు ఛళ్ళున తోశాడు.

గదిలోకి అడుగు పెడుతూనే స్థాణువులా నిలిచి పోయాడు.

బాబ్జీ ఉండాల్సిన కుర్చీ ఖాళీగా వుంది. అతణ్ని కట్టి పడేసిన తాళ్ళు చెల్లాచెదురుగా నేలమీద పడున్నాయి.

4

"అన్వర్ ఆలస్యం చెయ్యకు! వెంటనే ఇక్కడనుంచి పారిపోవాలి మనం! పోలీసు లీపాటికే ఇక్కడికి వస్తూ వుండొచ్చు! క్విక్!" బొంబాయివాలా తొందర పెట్టాడు.

ఒక్క అరనిముషం ఏదో ఆలోచిస్తున్నట్టు నిలబడిన అన్వర్ మెల్లగా వెనక్కి తిరిగి కర్చీఫ్‌తో చాకుని తుడిచి పదును పెట్టి భార్యవైపు తీక్షణంగా చూశాడు.

"ఇందాకా బాబ్జీకి మంచినీళ్ళివ్వడానికని లోపలి కొచ్చావు. అప్పుడే ననుకుంటా తమరు ఆ అందాల యువ కుడ్ని బంధవిముక్తుణ్ణి చేసింది! అవునా?" తాపీగా అన్నాడు.

మెహర్ చిగురుటాకులాగా వొణికిపోయింది.

మరుక్షణంలో ఆమె దవడమీద 'ఫట్'మని శబ్ద మయింది.

"నాకు సమాధానం కావాలి."

"అవును నేనే విడిపించాను!" తలవొంచుకుని నిర్భ యంగా అంది.

అన్వర్ పళ్ళు పటపట కొరికాడు! కళ్ళు చింతనిప్పు లయ్యాయి!

మెహర్ జుట్టు ఎడమచేత్తో బిగించి పట్టుకుని, మెరుపు వేగంతో చాకుని ఆమె గుండెలకు గురిపెట్టి ఒక్కపోటు పొడిచాడు అన్వర్. కాని సెకనులో అరవయ్యోవంతు కంటె వేగంగా వెనకనించి పడిన బలమైన పిడి దెబ్బకి తూలి పక్కకు పడిపోయాడు.

ఆ దెబ్బకు కర్త బాబ్జీ!

ఆ క్షణంలో అన్వర్ గురిపెట్టిన చాకు గురితప్పి ఆత్మ రక్షణకోసం అడ్డుపెట్టుకున్న మెహర్ అరచేతిని అడ్డంగా

చీల్చింది. రక్తం చిప్పిల్లింది! ఆమె బాధతో మూలిగి కూలిపోయింది!

పక్కకు పడి లేచే ప్రయత్నంలో ఉన్న అన్వర్ మెడ మీద బలంగా కొట్టడానికి చెయ్యి పైకెత్తిన బాబ్జీ తన వెనకనించి సమయస్ఫూర్తిగా బాంబేవాలా ఇచ్చిన కిక్కుకి మూడు పల్టీలుకొట్టి గోడకు కరుచుకుపోయాడు.

నడుం దగ్గర కలుక్కుమంది. ఓ చేత్తో నడుం రాసుకుంటూ పక్కనే సిద్ధంగా ఉన్న స్టూలును ఎత్తి బాంబే ఏజంటువైపు విసరగానే అది అతని మోకాలుని ముద్దు పెట్టుకోవడం "మర్ గయా!" అంటూ వెంటనే అతడు నేల కొరిగిపోవడం జరిగింది.

ఈలోగా దెబ్బతిన్న సింహంలాగా బాబ్జీమీద దాడితో దాడి చెయ్యబోయిన అన్వర్ వీధివైపు పోలీసు జీపు ఆగిన శబ్దం వినగానే తన ప్రయత్నం మానుకుని దొడ్డి గుమ్మం వైపు పరుగుతీశాడు

అక్కడ చేత్తో తడువుకుంటూ గుడ్డివాడు నిలబడున్నాడు.

హటాత్తుగా అక్కడ ప్రత్యక్షమయిన ముసలాడ్ని చూసి ఒక్కక్షణం తటపటాయించినా అతడే తన పథకాన్నంతా తారుమారు చేశాడన్న సంగతి గుర్తుకొచ్చిన అన్వర్ కోపం ట్టలేక అతడిమీదకి కసిగా లంఘించాడు.

వృద్ధుడు చేతికర్ర జారవిడిచి ఇంటిగుమ్మం పై కమ్మీకి వేళ్ళాడి ఎదురుగా వస్తున్న అన్వర్ మొహంమీద 'ఫెడీ'ల్మని తన్నేడు.

డెబ్భయి ఏళ్ళ ముసలాడు పైగా కళ్ళు కనిపించని అంధుడు ఇంత బలమైన దెబ్బ ఎలాగ కొట్టగలిగేడూ

అనే సందేహం ముందు కలిగిందో లేక ముక్కూ మొహమూ ఏకమైపోగా కలిగిన బాధముందు కలిగిందో తెలియదుగానీ బైర్లుకమ్మిన కళ్ళకు వెలుగు కనిపించేసరికి తాను బొంబాయి ఏజంట్ మీద వెల్లకిలా పడుకునున్నట్టు మాత్రం గ్రహించగలిగాడు అశ్వర్!

అప్పుడే లోపలికి ప్రవేశించిన పోలీసులు తదుపరి కార్యక్రమం చక్కబెట్టేరు! మెహర్‌కి ప్రథమ చికిత్స జరిగింది.

అంతవరకూ బాబ్జీలాగా నటిస్తూ నాటకాన్ని రక్తి కట్టించి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్న అసిస్టెంటు చిరంజీవిని మెచ్చుకోలుగా భుజం తట్టేడు మీసాలూ గడ్డం చేతిలోకి తీసుకుని నిలబడిన మాజీ వృద్ధ అంధుడు, ఆజాను బాహువు అయిన డిటెక్టివ్ దీక్షితులు!!

"సారీ సర్! మీ రిచ్చిన అడ్రసు ప్రకారం సక్రమంగా దాడిచేసి అందర్నీ పట్టుకున్నాంగానీ ఈ బొంబాయి ఏజంటు మాత్రం చాకచక్యంగా తప్పించుకు పారిపోయి వచ్చేశాడు!" అన్నాడు ఇన్స్పెక్టర్ శతభిషం గిల్టీగా.

"ఇటాల్ రైట్! మీరు అతణ్ణి అక్కడే అరెస్టు చేయగలిగివుంటే పాపం మెహర్ గాయపడకుండా వ్యవహారాన్ని నడిపించగలిగివుండేవాళ్ళం! సంఘక్షేమాన్ని ప్రజా శ్రేయస్సునూ దృష్టిలో పెట్టుకుని స్వార్థానికి ఏమాత్రం తావివ్వకుండా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడ్డ భర్త గురించి మనకు ముందుగా తెలియపరచి ఓ పథకం ద్వారా అతడిని చట్టానికి అప్పజెప్పడానికి సహాయం చేసిన మెహర్ ఎంతైనా అభినందనీయురాలు!" అన్నాడు దీక్షితులు - కన్నీళ్ళతో తలవాంచుకుని ఆంబులెన్స్‌వైపు నడుస్తున్న మెహరున్నీసా నుద్దేశించి. □

కన్నెపరీక్ష

విపంచి



'అపరాధ పరిశోధన' చదువుతూ, కూర్చున్నాడు డిటెక్టివ్ ప్రహ్లాద్.

మరో ప్రక్కన కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్న డిటెక్టివ్ నమశ్శివాయని పీడించేస్తున్నాడు రచయిత చిదంబరం.

"శివా! బాబూ నమశ్శివాయ — నామీద కనికరం కాస్తంత చూపానుకో, తాజాగా వ్రాయబోయే నవల నీకే అంకితమిస్తాను. తెల్సుకో!" హెచ్చరిస్తున్నట్లుగా చెప్పాడు చిదంబరం.

"ఏమిటయ్యా నీ గొడవ?" చిరాకుపడ్డాడు నమశ్శివాయ

"గొడవ....కాదు....కానే కాదు! ఓ కథకోసం నాలో చెలరేగిన వ్యధ! వేదన....క్రైమ్ కథలకి ఎంతగా బుర్ర చించుకొన్నా థీమ్‌లు దొరకటం లేదు. హత్యలు, దొంగతనాలు యివన్నీ పాతబడిపోయాయి

కొత్తరకమైన నేరాలకి. సరికొత్త రకమైన 'క్లూ'లతో వ్రాసిన కథలే వేసుకుంటున్నారు 'అపన' వాళ్ళు! నా బుర్రకి శుభ్రంగా తుప్పు పట్టేసింది.

ఈ మధ్య మీరు కొత్తగా పరిశోధించిన పరిశోధన ఏదైనా నా చెవుల్లో వేయండి. 'అపరాధ పరిశోధన' పాఠకులకి అందజేస్తాను.

పైగా ఈ నెల 'అపన' చూసావా? నా కథ లేక ఎలా వెలవెల బోయిందో!!" దీనంగా, దిగులుగా, గుబులుగా ప్రాధేయపడ్డాడు చిదంబరం.

వళ్ళు మండిపోయింది నమశ్శివాయకి. "నువ్వు పూర్తిగా పొరబడుతున్నావు చిదంబరం! ఈ నెల 'అపన' వెలవెలబోలేదు ధగధగమని మెరిసిపోతుంది—నీ దరిద్రపు గొట్టు కథ లేకపోవటంతో."

గవర్నమెంట్ రేట్లకి వేస్తున్న మినపట్టు కూడా అంతలా మాడిపోదు. అంతకంటె రెట్టింపు మాడిపోయింది చిదంబరం మొహం.

ప్రహ్లాద్ చిరునవ్వు నవ్వాడు.

చిదంబరం ముక్కుపుటాలు బిగించి, వేగంగా వూపిరి

వదుల్తూ. చెప్పాడు. "చెబుతా ... చెప్తా! ఈ వూళ్ళో బోడి డిటెక్టివ్‌లు మీరేనా? ..."

మాట పూర్తి కాకముందే మధ్యలో అడ్డుపడి అన్నాడు నమశ్శివాయ. "నువ్వు చెప్పింది అక్షరాలా నిజం! నిస్సందేహంగా మేం 'బోడి' డిటెక్టివ్‌లం కాము."

"మిమ్మల్ని తలదన్నిన వాళ్ళు బోల్డెంత మంది! ఇక నా కథల్లో హీరోలు మీరు కారు! ఏ జై కిషన్నో, ఉత్పల్ దత్‌నో హీరోగా పెట్టి వ్రాసుకొంటాను" కోపంగా చెప్పి, వెళ్ళిపోయాడు చిదంబరం.

"అమ్మయ్య. వదిలింది పీడ!" చిదంబరం వెళ్ళినవైపు రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టాడు నమశ్శివాయ.

చిదంబరం అలా వెళ్ళాడో లేదో మరుక్షణం ఓ వ్యక్తి లోని కడుగుపెట్టాడు.

అతనికి ఇరవై ఆరేళ్ళ వయసుంటుంది. ఖరీదైన బట్టలు వేసుకుని వున్నాడు.

అతను సందిగ్ధంలో నిలబడి, అటూ యిటూ చూస్తున్నాడు.

అది గమనించి, ఆహ్వానించాడు ప్రహ్లాద్. "రండి! ఇలా వచ్చి కూర్చోండి "

అతను వచ్చి కూర్చుని చెప్పాడు. "థాంక్యూ!"

నమశ్శివాయ అతడ్ని అంచనా కట్టడం ప్రారంభించాడు.

"చెప్పండి."

అతను మాట్లాడలేదు. ప్యాంటు జేబులోనుండి సెంట్ పరిమళాన్ని వెదజల్లుతున్న జేబురుమాలుతో మొహాన్ని తుడుచుకున్నాడు.

"నా పేరు మిత్రకాంత్! మీరు బహుశా ప్రముఖ సినీ నిర్మాత సచ్చిదానందంగారి పేరు వినే వుంటారు. నే

నాయన కొడుకుని.... ఒక్కగా నొక్క కొడుకుని.

"నేను మా నాన్నగారికి చేదోడు వాదోడుగా వుంటు న్నాను. సహ-నిర్మాతగా, నిర్వహణ అని నా పేరు పడు తుంటుంది టైటిల్సులో.

ఇంతవరకు మేం పన్నెండు సిన్మాల పైగా తీసాం. అన్నీ సూపర్ హిట్లే!" గర్వం తొంగిచూపింది మిత్ర కాంత్ కంఠంలో నుండి.

"అహ....అలాగా!" మౌనంగా తలాడించాడు ప్రహ్లాద్.

ప్రహ్లాద్ 'రెస్పాన్స్' అతి తక్కువగా వుంటుందని ఏ మాత్రం వూహించని మిత్రకాంత్ కనుబొమలు ముడి పడ్డాయి. తనని కించపర్చినట్లుగా మొహం చిన్నబుచ్చు కొన్నాడు.

ఆ విషయం నమశ్శివాయ దృష్టి పరిధిని దాటిపోలేదు.

కాని అరక్షణంలోనే మిత్రకాంత్ తన మొహంలోని భావాలు సర్దుకున్నాడు.

"నాకు పెళ్ళి నిశ్చయం అయ్యింది!" తల దించుకుని చెప్పాడు మిత్రకాంత్.

"గుడ్! కంగ్రాచ్యులేషన్స్."

"నాకు కాబోతున్న భార్య పేరు మహిత. వాళ్ళ వూరు తాడేపల్లి గూడెం."

"అయితే ఏం చెయ్యమంటారు?" వుండబట్టలేక అడి గాడు నమశ్శివాయ.

"అదే చెబుతున్నాను. మహిత బి.ఏ. వరకూ చదువు కొంది. బాగా ఆస్థిపరులు. వాళ్ళ ఫాదర్ కారుణ్యరావ్ తాడేపల్లిగూడెంలో కెల్లా ధనవంతుడు.

మీ కీ నగరంలో ప్రముఖ పరిశోధకులుగా మంచి

పేరుంది. మీరు మహిత చెడిపోయిందా? ఐ మీన్, ఆ అమ్మాయి స్వభావం మంచిదా, కాదా....మా ఇంటికి మంచి యిల్లాలిగా తన బాధ్యతలు నిర్వర్తించగలదా, లేదా....ఈ విషయాలు పరిశోధించి, తెలుసుకోవాలి.

వచ్చే గురువారం నాడు తాంబూలాలు పుచ్చుకోవాలనుకుంటున్నారు. ఈ వారంలోగా మీరు డిటెక్షన్ పూర్తి చెయ్యాలి. ఎంత ఖర్చయినా, చెల్లించటానికి నేను సిద్ధంగా వున్నాను" చెప్పాడు మిత్రకాంత్.

"మీ ఫియాన్సీ మహిత చెడిపోయిందని మీ కెందుకు అనుమానమేసింది?! ఏ న్నా ఆకాశరామన్న వుత్తరాలు వచ్చాయా?" మిత్రకాంత్ ముఖకవళికలని చదవటానికి ప్రయత్నిస్తూ అడిగాడు ప్రహ్లాద్.

"లేదు!" నిట్టూర్చాడు మిత్రకాంత్.

నమశ్శివాయ మెదడులోకి అనుమానం జొరబడింది 'మిత్రకాంత్ ఏదైనా దాస్తున్నాడా, అబద్ధం చెబుతున్నాడా?'

"మరయితే....?"

"మహిత ప్రవర్తన, స్వభావం నాకు కొంచెం అనుమానాన్ని కలిగించింది. అందుకే మహిత వెనక దాగివున్న... ఒకవేళ వుంటే ఆ నిజాన్ని తెలుసుకోవడానికి తపిస్తున్నాను. మహిత చెడిపోకపోతే, సమస్యేలేదు. నా మూర్ఖత్వానికి పశ్చాత్తాపపడి, మహితని వివాహం చేసుకుంటాను" మిత్రకాంత్ గొంతు ఎంతో 'సిన్సియారిటీ'ని ప్రతిధ్వనిస్తుంది.

"పెళ్ళంటే కేవలం బలవంతంగా పెద్దలచేత కలపబడి, జీవితాంతం నటించే సిన్మాకాదుగా! మహిత చెడిపోయిందో, లేదో తెలుసుకోమని మిమ్మల్ని నియమించటం మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు.

"పూర్వం జాతకాలు చూసి, శాస్త్రిలు తిరగేసి జంటని కలిపేవారు.

"ప్రస్తుతం కాలం మారింది. కనుక పద్ధతులు కూడా మారాయి. గ్రాఫాలజీ, సైకాలజీ....అలాగే డిటెక్షన్ కూడా.

"మీరు మహిత గురించిన పూర్తి వివరాలు నాకు వారం రోజుల్లోగా అందజెయ్యాలి" చెప్పాడు.

క్షణం ఆలోచించి చెప్పారు ప్రహ్లాద్, నమశ్శివాయ. "ఓ.కే? కేసు అంగీకరిస్తున్నాం. అడ్వాన్స్‌గా రెండువేల రూపాయిలు చెల్లించండి."

మారు మాట్లాడకుండా వందరూపాయిల నోట్లు ఇరవై తీసి, ప్రహ్లాద్ చేతికిచ్చాడు మిత్రకాంత్.

తర్వాత చిన్నగా చెప్పాడు. "ఈ రోజు రాత్రి 'గోదావరి'కి మీ యిద్దరి పేరున రెండు టిక్కెట్లు బుక్ చేస్తాను. రిజర్వేషన్ గురించి మీరేమీ బాధపడకండి. నాకు తెలిసిన వాళ్ళున్నారు. నేను చేస్తా నా ఏర్పాట్లు."

2

స్టేషన్ చేరుకునేటప్పటికి, వూరింకా చీకటి దుప్పటి కప్పుకునే వుంది. నాలుగు గంటలవుతూంది.

తెల్లవారురూము చలి ...

"ఇప్పుడు కింకర్తవ్యం?" ప్లాట్‌ఫారమ్‌ని పరీక్షగా చూస్తూ అడిగాడు నమశ్శివాయ.

ఆ ప్లాట్‌ఫారమ్ బెంచీలపై పడుకొన్న బిచ్చగాళ్ళు, రైల్వే కూలీలు తప్ప మరెవ్వరూ లేరు.

గేటు దగ్గర నిలబడ్డ టికెట్ కలక్టర్ కునికిపాట్లు పడుతున్నాడు.

స్టేషన్ బయటికి వచ్చారు డిటెక్టివ్‌లిద్దరూ.

"ఇంతకీ మహిత అడ్రస్ ఏమిటి?" అన్నాడు నమశ్శివాయ

"మహిత, డాటరాఫ్ కారుణ్యరావ్, దఫేదార్ వీధి, సుబ్బారాయుడు పేట" అడ్రస్ కాగితం చదివి, చెప్పాడు ప్రహ్లాద్.

స్టేషన్ రోడ్లో వున్న లాడ్జిలో రూమ్ తీసుకున్నారు.

ఆరు గంటలకి లాడ్జినుండి బయటికొచ్చి, తాలూకాఫీసు దగ్గరున్న హోటల్లో టిఫెన్ చేసి, సుబ్బారాయుడు పేట లోకి ప్రవేశించారు.

ఆ 'దఫేదార్ వీధి' కనుక్కోవటం కష్టమైపోయింది. చివరకి చచ్చీ చెడి ప్రయత్నించిన గంటకి దొరికింది అడ్రస్.

ఆ వీధికి కిరీటంలా వెలిగిపోతుంది కారుణ్యరావ్ భవంతి. "మహిత నిలయం". "కారుణ్యరావ్" అనే రెండు పాలరాతి పలకలు గేటు కిరుప్రక్కలా తాపడం చేయబడి వున్నాయి.

ప్రహ్లాద్, నమశ్శివాయ సరిగ్గా ఆ భవనానికి ఎదురుగా నిలబడి వున్నారు.

పావుగంట నిరీక్షణ తర్వాత ఇరవై ఏళ్ళ వయసులో వున్న అమ్మాయి బయటికొచ్చింది.

లేత గులాబీరంగు శరీరంతో, అందమైన అవయవాల పొందికతో ఎంతటి వాళ్ళనైనా ఆకర్షించే విధంగా వుంది ఆమె

"ఆ అమ్మాయే మహితేమో!" ఆ అమ్మాయి కేసి కన్నార్పకుండా చూస్తూ, గొణిగాడు నమశ్శివాయ

"ఏడు గంటలకే ఆ అమ్మాయి ఎందుకు బయటికొచ్చినట్లు?" కనుబొమలు ముడివేసాడు ప్రహ్లాద్.

భవనం ముందు పార్క్ చేయబడి వుంది ఓ అంబాసిడర్ కారు. ఆ కారు డ్రైవర్ ఆ అమ్మాయిని చూడగానే చటుక్కున లేచి "కారు తియ్యమంటారా అమ్మాయిగారూ?" అనడిగాడు.

ఆ అమ్మాయి గొంతు తడబడింది. "వద్దు" చెప్పి, ముందుకి నడిచిందామె.

ఆమెని అనుసరించసాగారు ప్రహ్లాద్, నమశ్శివాయ.

"ఇంతకీ మనం చేయవలసిన పరిశోధన ఏమిటో నాకు అర్థమై చావటం లేదు. ఈ అమ్మాయి ఎక్కడికి పోతే అక్కడికి పోవటమేనా?" చిరాకు నింపుకొన్న స్వరంతో చిన్నగా అడిగాడు నమశ్శివాయ.

నవ్వాడు ప్రహ్లాద్. "ఈ అమ్మాయిని అనుసరించి, ఈ అమ్మాయి గురించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలి. అంటే ఆమె యిష్టా యిష్టాలు, ప్రవర్తన, వ్యక్తిత్వం, మిత్రబృందం, మనస్తత్వం ...ఇవన్నీ ఒక్కొక్కటి పరిశోధించి. మహిత తత్వం మిత్రకాంత్‌కి సరిపోతుందో లేదో చెప్పాలి."

"ఐసీ!"

మహిత ముందుకి నడుస్తూనే వుంది. మధ్యదారిలో ఓ రిక్షా ఆమె దగ్గరకొచ్చి, ఆగింది.

ఆ రిక్షా ఎక్కి, చెప్పింది మహిత. "పోనీ!"

ఆమె అలా రిక్షా ఎక్కి వెళ్ళిపోతుందని ఏమాత్రం వూహించలేదు ప్రహ్లాద్, నమశ్శివాయ.

కనుచూపుమేరలో మరో రిక్షాలేదు.

ఏం చెయ్యాలో వాళ్ళకి పాలుపోలేదు ఒక్క క్షణం పాటు.

తర్వాత హడావుడిగా పరుగుతీసారు ఆ రిక్షా వెనకే.

సరిగ్గా గంట తర్వాత—

మహిత ఆ యింటిముందు ఆగింది వెళ్ళి. తలుపు తట్టింది.

ఓ తల లోపల్నుండి తొంగిచూపింది. మహిత లోపలికి వెళ్ళగానే మళ్ళీ తలుపు మూసుకుపోయింది.

ఆ సందు చివరనున్న కిళ్ళీకొట్టు దగ్గర నిలబడున్నారు ప్రహ్లాద్, నమశ్శివాయ.

"మహిత ప్రవర్తన పెద్ద 'మిస్టరీ' లా వుందే" అన్నాడు నమశ్శివాయ నిశ్శబ్దాన్ని తొలగిస్తూ

"అవును!" చెప్పాడు ప్రహ్లాద్.

అతని ఆలోచనల పాటికి ఆలోచనలు సాగుతున్నాయి.

3

సాయంత్రం అయిదు గంటలు—

చకచకా రోడ్డుమీద నడుస్తూంది మహిత. 'ఇండియన్ బ్యాంక్' దాటింది.

ఓపిగ్గా ఆమెని అనుసరిస్తున్నారు ప్రహ్లాద్. నమశ్శివాయ. ప్రొద్దుట్నుంచి తిరుగుతూనే వున్నారు డిటెక్టివ్ లిద్దరూ. ఆమె చదివిన కాలేజీలో ఆమె మిత్రబృందం వద్ద ఆమె గురించి తెలివిగా వాకబు చేసారు. చాలామటుకు వాళ్ళ పరిశోధన పూర్తయినట్లే.

మహితకి మధ్యలో అనుమానమేసినట్లుంది. చప్పున వెనక్కి తిరిగి చూసింది.

ప్రహ్లాద్, నమశ్శివాయల మీద పడలేదు ఆమె దృష్టి.

వాళ్ళ వేగ్గా సైకిల్‌మీద వస్తున్నాడు పాతికేళ్ళ వయసులో వున్న కుర్రాడు. సాయంత్రం నాలుగు గంటలనుండి అతను మహితకోసం నందిబొమ్మ సెంటరు దగ్గర పడి

గాపులు కాస్తున్నాడు.

మహితని చూడగానే అతని కళ్లు మెరిసాయి.

అతడ్ని గుర్తుపట్టింది మహిత. అటు—యిటూ చూసి, చిర్నవ్వుతో సైగచేసిం దతనికి.

ఆమె సైగచెయ్యటం ఎవ్వరూ చూడలేదనుకొంది.

కాని చూసిన వ్యక్తి వున్నాడు—అతను నమశ్శివాయ!

మహిత శాఖాగ్రంథాలయంలోకి వెళ్ళి, ఏదో పుస్తకం మార్చింది.

గ్రంథాలయం నుండి మహిత బయటికొస్తుంటే, ఆమెకి ఎదురుపడి అడిగాడతను వణుకుతున్న గొంతుతో.

"ఏమైంది?"

చిలిపిగా నవ్వింది మహిత. "ఈ రోజు రాత్రికే! సరిగ్గా రాత్రి తొమ్మిది గంటలకి...." మళ్ళీ నవ్వింది.

అతను కళ్ళప్పగించి, చూస్తుండిపోయాడు మహితకేసి.

ప్రహ్లాద్ విస్తుపోయాడు. ఎవరా వ్యక్తి? మహితకి, అతనికి సంబంధ మేమిటి? అతను ఆమె ప్రియుడా? ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకి జరగబోతున్న దేమిటి? ఎక్కడైనా రహస్యంగా ఏకశయ్యాగతులు కానున్నారా? అసలు జరుగుతుం దేమిటి?

అన్నీ ప్రశ్నలే!

4

"ఏమైంది?" మిత్రకాంత్ గొంతుని ఆత్రుత ఆక్రమించుకొని వుంది.

"సారీ మిస్టర్ మిత్రకాంత్!" చెప్పాడు నమశ్శివాయ.

"అంటే....?" మిత్రకాంత్ గొంతు వణికింది.

"మీ ఊహ నిజమైంది మిత్రకాంత్! మహిత పూర్తిగా

చెడిపోయింది. మొన్న రాత్రికిగాని మా పరిశోధన పూర్తి కాలేదు. నేను వెంటనే వచ్చేసాం.

పెళ్ళయ్యే ముందు ప్రతి యువకుడు ఆశిస్తాడు—తన భార్య కన్యకావాలని. దురదృష్టవశాత్తూ, మీ కాబోయే భాగస్వామిని కన్యకాదు."

చెబుతున్న నమశ్శివాయకి అడ్డుపడుతూ అరిచాడు మిత్రకాంత్. "డోంట్ కాల్ హర్ యాజ్ మై ఫుడ్‌బీ లైఫ్ పార్టనర్!"

"ఆవేశ పడవద్దు మిత్రకాంత్! మహితకి ఒక వ్యక్తితో కాదు, ఇద్దరు ముగ్గురితో అక్రమ సంబంధాలున్నాయి. మొన్న రాత్రి తొమ్మిది గంటలకి నేను కళ్ళారా చూసాను. మహిత అతడి కౌగిట్లో ఒదిగిపోయి, అతడ్ని ముద్దాడటం" తాపీగా అన్నాడు నమశ్శివాయ

"వద్దు. దయచేసి చెప్పొద్దు!" చెప్పాడు మిత్రకాంత్. "ఇక ఈ సంబంధాన్ని రద్దు చెయ్యమని నాన్నతో చెబుతాను. నీతి, జాతి లేని అమ్మాయిని చేసుకోవడానికి నేను సిద్ధంగా లేను."

"అది మంచిది! ఐ విష్ యూ ఆల్ ది సక్సెస్ ఇన్ యువర్ ఫ్యూచర్ లైఫ్. బై బై - ఇక మాకు మీ దగ్గర్నుండి రెండువేలు రావాలి" చెప్పాడు నమశ్శివాయ

మిత్రకాంత్ రెండువే లిచ్చి, వెళ్ళిపోయాడు. అతను వెళ్తుండగా ఎదురు పడ్డాడు ప్రహ్లాద్. పల్కరించబోయినా మారు మాట్లాడక ముభావంగా వెళ్ళిపోయాడు మిత్రకాంత్.

ప్రహ్లాద్ లోపలికొచ్చేటప్పటికి. నమశ్శివాయ హుందారుగా ఈలవేస్తూ, డబ్బు లెక్క పెట్టుకుంటున్నాడు.

"ఏం జరిగింది? మిత్రకాంత్ మొహం అలా పెట్టుకుని

వెళ్ళిపోయాడు??" ఆశ్చర్యంతో అడిగాడు ప్రహ్లాద్.

జరిగింది వివరించాడు నమశ్శివాయ.

అది వినగానే నిర్ఘాంతపోయాడు ప్రహ్లాద్.

ఆశ్చర్యం నుండి తేరుకొంటూ, అరిచాడు ప్రహ్లాద్. "ఇడియెట్! బుద్ధి వుందా నీకు?"

"ఉందనే అనుకుంటున్నా" నవ్వి, చెప్పాడు నమశ్శివాయ.

ఆగ్రహోదగ్రుడయ్యాడు ప్రహ్లాద్. "వెయ్యి అబద్ధాలు ఆడైనా, ఓ పెళ్ళి చెయ్యమన్నారు మన పెద్దవాళ్ళు. ఏమీ ఎరుగని ఒక అమాయకపు కన్నెపిల్ల జీవితాన్ని నిలబెట్టాల్సింది పోయి, నాశనం చేస్తావా?

"మహిత మనకేం అపకారంచేసింది? సత్యాన్వేషకులుగా మనమెప్పుడూ సత్యమే చెప్పాలి.

అటువంటిది.... నువ్వు చేసిన వెధవపని ... ఛ! మహిత ప్రొద్దున్నే ఏడింటికి వెంకటేశ్వరస్వామి గుడికెళ్ళటం చెడిపోవటమా? తొమ్మిదిన్నరకి వాళ్ళ స్నేహితురాలు రమణిని కలిపి, ఆ రోజు సాయంత్రం రమణి ప్రియుడు చక్రధర్‌తో మాట్లాడి. ఆ ప్రేమికులకి మన మొచ్చేరోజు రాత్రి దగ్గరుండి వాళ్ళకి సత్యనారాయణస్వామి గుళ్ళో పెళ్ళి జరిపిస్తే మహిత చెడిపోయిందంటావా?

తాడేపల్లి గూడెమంతా తిరిగి మనం పరిశోధించినా, ఏ ఇంట, ఏ నోట 'మహిత మంచిపిల్ల' అన్న కామెంట్ తప్ప, మరో చెడువాక్యం విన్నామా?

కాని.... నువ్వు చేసిందేమిటి?

ఆ మహిత జీవితంపై దారుణమైన అభాండాలు వేస్తావా?

రాస్కెల్! నిన్ను ముక్కలు ముక్కలుగా నరికెయ్యా అని వుంది" కోపంతో ప్రహ్లాద్ శరీరం వణికిపోతుంది.

"నువ్వు చెప్పింది నిజమే! మహిత చాలాచాలా మంచి అమ్మాయి" వొప్పుకున్నాడు నమశ్శివాయ.

"మరెందుకిలా చేశావు?"

"ఎందుకంటే...." ఒక్క క్షణమాగాడు వమశ్శివాయ. "మొన్నరాత్రి మనం తాడేపల్లి గూడెం నుండి తిరిగొచ్చాం మహిత మంచిదనే రిపోర్టుతో.

అయితే గూడెంనుండి వచ్చిన తర్వాత నాకో ఆలోచన వచ్చింది.

మిత్రకాంత్ మహిత తనకి తగిన భార్య, కన్యకాదో అవునో పరిశోధించమని మనల్ని కోరాడు.

మరతను మహితకి సరిపోతాడో, లేదో తెలుసుకోవా లన్పించింది.

చివరకి నా పరిశోధన తేల్చింది ఏమిటంటే—మిత్ర కాంత్ నంబర్‌వన్ రోగ్! విపరీతంగా తాగుతాడు. అమ్మాయిలంటే పిచ్చి. అతనికి ఈ వూళ్ళో గుర్తింపు పొందని రెండు ఫ్యామిలీలున్నాయి. కట్నం కోసం మహితని చేసుకోబోయాడు.

అటువంటివాడి పాల మహిత పడటం నాకు యిష్టం లేదు. అందుకే అలా అబద్ధమాడాను.

మిత్రకాంత్ వెధవ అయినప్పటికి, తన కాబోయే భార్య కన్య కాదనేసరికి, సంబంధం కాన్సిల్ చేసుకున్నాడు.

మహితకి మంచి భర్త తప్పకుండా వస్తాడు. నా కా విషయంలో నమ్మకముంది. ఐ విష్ హర్ ఎ బ్రైట్ ఫ్యూచర్."

☐

రతికాముకుడు

ఎమ్.డి.సౌజన్య

సాయంత్రం అయిదు అయింది.

రాధ స్కూలునుంచి అప్పుడే ఇంటికొచ్చింది. అదొక చిన్న అద్దెఇల్లు. రెండే గదులున్నాయి. అగ్గిపెట్టె ల్లాంటివి. ఆ ఇల్లు స్కూలుకు కొంచెం దగ్గరలో వుంది.

ఆ వూళ్ళో పోస్టింగ్ యిచ్చి వారంరోజులు అయింది. రాధకు ఎవ్వరూ పరిచయస్థులు లేరు. అసలు అంతకు ముందు ఆ వూరును చూడలేదు కూడ. సమితి హెడ్ క్వార్టర్సే అయినా పెద్ద తాలుకాలాగా వుంటుందా వూరు.

తను వుంటున్న ఇంటి ఓనరు ఏదో ఆఫీసులో అటెండరుగా పనిచేస్తోంది. ఆమెకు మగదిక్కు ఎవ్వరూలేరు. ఇద్దరు చిన్నపిల్లలున్నారు. భర్తపోయి అయిదారుఏళ్ళు అవుతోందట.

రాధ స్కూలునుంచి వస్తూ వస్తూ రాహుల్ సాంకృత్యాయన్ నవల "ఓల్గానుండి గంగావరకు" కొనుక్కొచ్చుకుంది. ఆ నవల బావుంటుంది వీలుంటే చదవమని తనకొక ఫ్రెండు చెప్పింది.

ఆ పుస్తకం త్వరగా చదవాలనే ఆతృతతో వంట త్వరగానే మొదలుపెట్టింది. వచ్చినరోజే ఒక నూతన్ స్టౌ, కొన్ని స్టీలు పాత్రలు, బిందే ఎట్సెట్రా తన తమ్ముడు మోహన్ తనువెళ్ళి కొనుక్కొచ్చుకున్నారు. తమ్ముడు వేరే తాలూకాలో జూనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు.

ఒక గంటలో వంట పూర్తిఅయింది.

రాధ నవల చదువుకుంటూ కూర్చుంది. రాత్రి పది దాటినా ఆమెకు కాలమే తెలియలేదు. టైము చూసుకునే సరికి పదింబావు అయింది. వండిన కూర, అన్నం చల్లారిపోతాయి అని పుస్తకం మూసేసి—అన్నం వడ్డించుకొని—భోజనం చేసేసింది.

పుస్తకం ఇంట్రెస్టింగా వుండటం మూలానా—కంటిన్యూగా చదవడం మొదలెట్టింది. మొట్టమొదటి మానవుడు తల్లితో సంబంధాలు కలిగివుండేవాడు అని చదివి ఆమెకు

విపరీతమైన జుగుప్స కలిగింది. ఏది ఏమైనా అది వాస్తవం. సాంకృత్యాయన్ పరిశోధించి వ్రాసారు. అది మానవ చరిత్ర.

అర్ధరాత్రి దాటింది.

రాధకు నిద్రరాలేదు కానీ - మళ్ళీ ప్రొద్దున్నే లేవాలని గుర్తొచ్చి—పుస్తకం మూసేసి నిద్రకు ఉపక్రమించింది.

కాస్సేపట్లోనే ఆమెకు నిద్ర పట్టేసింది.

మామూలుగానే ఆ రోజు కూడా తెల్లవారింది. రాధ జీవిత గమనంలోనూ శరీరంలోనూ ఆమెకు క్రొత్త మార్పులు కనిపించాయి.

ఆ మార్పులను చూసి విభ్రాంతి చెందింది. దాదాపు మతిపోయినంతపని అయింది. అసలు ఇదంతా ఎట్లా జరిగిందో ఆమెకు అర్థంకాలేదు. ఇది చాలా అసంభం అని ఆమెకు అనిపించింది. కానీ ఇది కళ్ళముందు వున్న వాస్తవం. దాన్ని ఎలా కాదనగలదు.

ఉదయం ఏడుగంటలప్పుడు—

రాధ నిద్రనుంచి మేల్కొనగానే—

ఆమె ఒంటిమీద వుండాల్సిన జాకెట్టు. బ్రా. చీర. లంగా ఆమె ఒంటిమీద లేవు. అది ఎదురుగా వ్రేలాడగట్టిన బట్టల దండెంమీద ప్రత్యక్షమయ్యాయి. రాధ పూర్తిగా న్యూడ్‌గా.. ఆమె ఒంటిమీద నూలు పోగుకూడా లేదు. ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది. భయంతో బిగుసుకు పోయింది.

చటుక్కున లేచి నిలబడింది. ఒళ్ళంతా - నొప్పులు, కాళ్ళు ఆమె స్వాధీనంలో లేవు. రాత్రి తనను ఎవరో రేప్ చేసారని ఆమెకు స్పష్టంగా అర్థమైంది. దానికి సంబంధిం చిన పూర్తి ఆధారాలు ఆమె ఒంటిమీద వున్నాయి.

వెళ్ళి గబగబా బట్టలు వేసుకుంది. తలుపు దగ్గరికి వెళ్ళి చూస్తే—తను రాత్రి వేసింది వేసినట్లుగానేవుంది. కిటికీలలోనుంచి అసలు ఏ మనిషీ రావడానికి వీల్లేకుండా ఇనుప ఊచలున్నాయి.

అయితే రాత్రి వచ్చిన ఆగంతకుడు ఇంట్లోకి ఎలా వొచ్చాడో బొత్తిగా అర్థంకాలేదు. ఒకవేళ ఏదో విధంగా వచ్చినా తన ఉడుపులన్నీ విడిచి అవతల పారేస్తుంటే—తనకు మెలుకువరాకుండా ఎలా ఉండగలిగిందో అస్సలు అర్థంకాలేదామెకు. ఇంట్లోకి వచ్చినవాడు బయటికి వెళ్ళి పోయేటప్పుడు లోపలినుండి గడియ ఎలా వేయగలుగుతాడు?

రాధకు మతిపోయినంతపని అవుతోంది.

ఏం చేయాలో తోచక అలా మంచంమీద కాస్సేపు ఆలోచిస్తూ కూర్చుంది.

టక్ ....టక్ ....టక్ ....

పాలవాడొచ్చినట్టున్నాడు.

రాధ తలుపు తెరిచి చూపింది.

పాలవాడు కాదూ ఎదురుగా ఒక దయ్యం నిలబడింది. కాదు, దయ్యంలావున్న ఒక పిచ్చిది నిలబడింది. ఆ పిచ్చిదాని చంకలో ఒక ఆడపిల్ల వుంది. రెండేళ్లు వుంటాయి ఆ పాపకు. ఓ గుడ్డపేలికల మూట, ఒక గిన్నె వుంది.

ఆ పిచ్చిదాన్ని చూడగానే—రాధ ఆశ్చర్యపోయింది. అది ఎంతో అసహ్యంగావుంది. అటువంటిదాన్ని ఏ దౌర్భాగ్యుడు అనుభవించి కడుపుచేసాడో — కామం క్రమ్మినకళ్ళకు ముసలి, ముతక, పిచ్చి. ముష్ఠి ఏమీ కనబడదుగదా అనుకున్నది.

పిచ్చిది హిందీలో ఏదో మాట్లాడుతోంది. కాస్సేపటి

తర్వాత పిచ్చిది ఏం అడుగుతుందో రాధకు అర్థమైంది. దానికి ఇంటిఅద్దె కావాలట. అద్దె ఎంతోకాదు 'పావలా' నే!

ఇంటి అద్దె ముష్టిది అడగట మేమిటి? అదీ పావలా డబ్బులా? ఈ ఇంటికి ముష్టి దానికేమైనా సంబంధముందా? రాధ ఆలోచించడం మొదలుపెట్టింది.

ముష్టిది మళ్ళీ రెట్టించి అద్దె అడుగుతోంది.

రాధ లోనికివెళ్ళి వ్యానిటీ బ్యాగులో చేయిపెట్టి చూసింది. పదిపైసల బిళ్ళ చేతికి తగిలింది. తీసుకొచ్చి వేసింది.

"పావలా ఇవ్వమంటే పది పైసలు ఇస్తారు. ఏం మనుషులో ఏమిటో!" అని గొణుక్కుంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది.

రాధకు నవ్వుతోపాటు బాధ కూడా వేసింది.

కుళాయిలో నీళ్ళు వస్తున్నట్లుంది. శబ్దం వస్తోంది.

రాధ బిందెలు తీసుకొని కుళాయి దగ్గరికెళ్ళింది. కావల్సినన్ని నీళ్ళు పట్టుకొని రూములో పెట్టుకొని రూము శుభ్రంగా తుడిచింది. ఎంగిలి పాత్రలు అలాగే వున్నాయి. కుళాయి దగ్గరికెళ్ళి తోమడానికి ఉపక్రమించింది. పనులన్నీ యాంత్రికంగా చేస్తున్నా ఆమెకు ప్రొద్దున్నే తనకు ఎదురైన పరిస్థితి గుర్తొచ్చి గుండెల్లో ఏదో గుబులు బయలు దేరింది.

అన్నం, రాత్రి తెచ్చుకున్న కూరగాయలు వండుకుంది స్టౌమీద.

తనను ఎవరు రేప్ చేసారు?

తన కన్‌సెంట్ లేకుండా, తనకు తెలియకుండా — విఠలాచార్య సినిమాలోలా ఎలా సాధ్యం. తనకు కొంచెం కూడా గుర్తులేదే. ఆ అనుభూతి కూడా తనకు తెలియదే!

ఎవరై వుంటారు. యాదగిరి కొడుకు రాజు గుర్తొచ్చాడు.

రాజు వాళ్ళకు ప్రకాశం బజారులో పెద్ద బట్టలకొట్టు వుంది. బోలెడంత బ్యాంకుబ్యాలెన్సు. యాదగిరికి ఒక్కగానొక్క కొడుకతడు. తను వాళ్ళ బట్టలకొట్టు ప్రక్కనేవున్న అనూరాధ చిట్ ఫండ్స్లో క్లర్కుకమ్ టైపిస్టుగా పని చేస్తూ వుండేది.

అతను ఎప్పుడు ఇండో-సుజికి మీద పోజులు కొడుతూ తిరుగుతూ వుండేవాడు. అమ్మాయిలకు రైటింగ్ కొట్టడంలో మొనగాడు, అని ప్రతీతి. చాలామంది అమ్మాయిలను మోసం చేసానని గొప్పగా చెప్పుకుంటూ వుంటాడు. అమ్మాయిలను వలలో వేసుకోవడానికి కావాల్సినంత, డబ్బు, పర్సనాలిటీ, తెలివి, సంఘంలో హోదా వాళ్ళను సంతృప్తి పరచడానికి కావల్సిన నవయవ్వనం అతనికున్నాయి.

ఓ రోజు అనూరాధ చిట్ ఫండ్స్లోకి వచ్చాడు. బహుశా తను అందులోకి వెళ్ళడంచూసి —ఫాలో అయ్యుంటాడు. రాధ తన సీట్లో కూర్చుంది. సొరుగుకు వున్న తాళం తీసి కాగితాలు కార్బన్లు కొన్ని లెటర్లు బయటకుతీసి ప్రక్కకు పెట్టుకుని—టైపురైటర్ మీద పేరుకున్న డస్టనుగుడ్డతో తుడుచుకుంటూ తలెత్తిచూసింది. ఎదురుగా ఓ అపరిచితుడు నిల్చున్నాడు. అందంగా హాండ్ సమ్గా వున్నాడు. కళ్ళతోనే నవ్వుతూ కనిపించాడు.

రాధ సీరియస్గా ముఖంపెట్టే—

"ఏం కావాలండీ!" అని అడిగింది.

"అబ్బే ఏంలేదండి! ఏవో కొన్ని వివరాలు తెలుసుకోవడానికి వచ్చాను" అన్నాడు తడబడుతూ.

"ఏం వివరాలు!" అదే సీరియస్నెస్.

"అదే....మీ....మీ గురించి...." అతనూ ఇంకా తడబడుతున్నాడు. అది నటనో, నిజమో తెలియడంలేదు.

"నా గురించి...."

"అబ్బే మీ గురించి కాదండి! మీ చిట్ ఫండ్ కంపెనీలో సభ్యునిగా చేరాలంటే ఏం చేయాలో కనుక్కుందామని వచ్చానండీ!"

"ఓహో. అలాగా! లోపల మేనేజరుగారు వున్నారు వెళ్ళి మాట్లాడండి, ఆయన అన్ని వివరాలు చెప్తారు!"

"మేనేజరుగారితో ఎందుకులెండి! మీకు తెలిసినంత మట్టుకు చెప్పండి!"

ఆమె కోపంగా చూసింది.

అతను నసుగుతూ—"నేను నెలకు ఓ అయిదు వందలు సేవ్ చేద్దామనుకుంటున్నానండీ సేవ్ చేయాలంటే మరి వివరాలు తెలుసుకోవాలి గదండీ ఇంత చిన్న ఎమౌంటుకు మేనేజరుగారివరకూ ఎందుకు! మీరు చెపితే సరిపోతుందిగా! అందుకే మిమ్మల్ని అడుగుతున్నానండీ!"

ఇంతలో మేనేజరుగారు అటువైపు వచ్చారు.

రాధ లేచి నిలబడి విష్ చేసింది.

రాజు కూడా విష్ చేశాడు.

మేనేజరుగారు "ఏం కావాలి?" అన్నట్టు అతనివైపు చూసారు.

"నేను....నెలకు ఓ అయిదు వందలు సేవ్ చెయ్యాలనుకుంటున్నానండి! ఆ వివరాలు తెలుసుకుందామని "

"అలాగా....మీరలాగే నిలబడిపోయారేమిటీకూర్చోండి ఏమిటి రాధ. కస్టమర్స్‌ని అలా నిల్చోబెట్టి మాట్లాడకపోతే....కూర్చోమనొచ్చు కదా? మిస్టర్ రాజూ, ప్లీజ్ టేక్ యువర్ సీట్!" అతను కూర్చున్నాడు.

మేనేజరు ఆ మాటన్నందుకు రాధ నొచ్చుకుంది. ఎం చేతనంటే—అతను నిజమైన కస్టమర్ కాదు. అతను తనను రైటింగ్ కొట్టడానికి వచ్చాడు. ఆ విషయం తనకు బాగా తెలుసు. కానీ మేనేజరుగారికి తెలియదు.

మేనేజరుగారు చిట్ వివరాలు తెలియజేసి—ఈ నెల డబ్బులు కట్టేసి వెళ్ళండి! లేకపోతే మీ మూడ్ పాడవు తుంది. సేవింగ్స్ చేయాలన్న తపన నశిస్తుంది. అంటూ ఓ అరగంట సుత్తి కొట్టాడు

రాజు అయిదు వందలుతీసి అతని చేతిలో పెట్టాడు.

మేనేజర్ సంతోషించాడు.

"రాజుగారికి రిసిప్టు రాసివ్వు!" అంటూ మేనేజర్ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రాధ కొంచెం ఆశ్చర్యపోయింది.

ఏదో ఆలోచిస్తూ-యాంత్రికంగా రిసిప్టు రాసిచ్చింది.

"వివరాలు చెప్పనందుకు, నాకు అయిదొందలు లాస్" అంటూ నెమ్మదిగా గొణిగాడు.

"అయిదు వందలు లాసా? అదేమిటండీ అలా అంటారు? మీ డబ్బులు యిక్కడ క్షేమంగా వుంటాయి వాటికేమీ ధోకాలేదు తెలుసా!"

"తిరిగి తీసుకునేంత టైము, ఓపికా నాకు లేవులెండి! అందుకే అలా అన్నాను. అయిదు తర్వాత కేఫ్‌క్రేప్‌లో టీ త్రాగడానికొస్తారా? మీతో కొంచెం మాట్లాడాలి."

"నాతోనా! ఏం మాట్లాడతారు?"

"ఏదో కొంచెం మాట్లాడాల్సి వుంది. మీ రక్కడి కాఫీ-టీ త్రాగుతూ తీరిగ్గా మాట్లాడుకోవచ్చు!" అంటూ వెకిలిగా నవ్వాడు.

"ఏమిటీ తమాషాగా వుందా! గెటౌట్ ఫ్రం హియర్"

కటువుగా అంది.

నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డాడు రాజు.

"ఐ సే గెటౌట్!" మళ్ళీ అంది రాధ.

కిక్కురు మనకుండా రెండు అడుగులు వేసి వెనక్కి తిరిగి "మిస్ రాధ! ఐ విల్ సీ యు నేకెడ్!" కోపంగా అనేసి గబగబా వెళ్ళిపోయాడు.

రాజు ఆమెకు మళ్ళీ ఎప్పుడూ కనిపించలేదు.

తనను నగ్నంగా చూస్తానని అతను ప్రతిజ్ఞ చేసాడు.

తనను రేప్ చేసింది రాజు అయితే కాదుగదా?

ఆమె డైలామాలో పడిపోయింది.

2

సాయంత్రం అయిదు గంటలు.

రాధ వంట కార్యక్రమం పూర్తిచేసి చదువుతూ కూర్చుందన్న మాటేగానీ—ఆమెకు రాత్రి జరిగిన సంఘటన తాలూకు జ్ఞాపకాలు పదే పదే గుర్తు వస్తున్నాయి. ఎంత మరిచిపోవాలనుకున్నా-ఆమెకు సాధ్యం కావడం లేదు. పుస్తకం మూసేసి ఆలోచిస్తూ కూర్చుంది.

ఆమెకు ఇంతవరకు తన ఇరుగు పొరుగును చూడాలన్న ఆసక్తి లేదు. అసలు వాళ్ళు ఎవరో, ఎటువంటివారో ఆమెకు అసలు తెలియదు. మగవాళ్ళు ఎవరయినా వున్నారా? అమెకు చూడాలనిపించింది. తనను ఎవరయినా పరీక్షగా చూసేవాళ్ళుగానీ-వెకిలిగా నవ్వేవాళ్ళుగానీ-లేదా ఎవరయినా వెకిలి వేషాలు వేసేవాళ్ళు ఎవరయినాగానీ వున్నారేమో ఆమెకు చూడాలనిపించింది. తద్వారా తను రేప్‌కు కారణం ఎవరో తెలుసుకోవచ్చని ఆమె ఆశ.

బయటి తలుపు తెరిచి వాకిట్లో ఈజీ చెయిర్ వేసుకుని చదువుతూ కూర్చుంది. ఆమె చేతిలో పుస్తకం వుంది

గానీ-కళ్ళు మాత్రం నలుదిక్కులా చూస్తూ వున్నాయి. అప్పుడప్పుడు మాత్రమే పుస్తకంలోకి చూస్తోంది.

గమ్మత్తేమిటంటే-అక్కడ అద్దెకు వుంటున్న చాలా మంది కాలేజీ స్టూడెంట్లు ఆమెను తినేసేట్టు చూస్తూ వున్నారు. ఆమెకు ఎవరిని అనుమానించాలో అర్థం కాలేదు. కాస్సేపటి తర్వాత వెనుకనుంచి ఓ గులాబీపువ్వు వచ్చి సరిగ్గా తలమీద పడింది. ఎవరో ప్రక్కింటి డాబా మీద నుంచి విసిరేసి ప్రక్కకు తప్పుకున్నారు.

రాధ అటువయిపు చురుగ్గా చూపింది. కానీ లాభం లేక పోయింది. అతనెవరో కనిపించలేదు. అటు చూడటం మాత్రం మానలేదు. అతను మళ్ళీ కనిపిస్తాదేమోనని ఆమె ఆశ. బహుశా తన రేప్‌కు అతడే కారకుడై వుంటాడు. అతన్ని ఎలాగయినా ట్రెస్ చెయ్యాలి ఎవరతను? ఎవర తను? ఎవరతను?

పది నిముషాలు గడిచాయి.

ఊహుం లాభం లేదు. ఆమె ప్రయత్నం ఫలించలేదు. ఎవ్వరూ కనిపించలేదు.

రాధ అక్కడే కూర్చుని ఆలోచించడం మొదలు పెట్టింది. బహుశా ఆ పూవు విసిరేసిన వాడి పని అయ్యుం టుంది. ఇవాళ రాత్రి తను పూర్తిగా మెలకువగా వుండటా నికి నిర్ణయించుకుంది.

రాత్రి పది గంటలు.

రాధ చదువుతున్న పుస్తకం ప్రక్కన పడేసి నిద్రకు ఉపక్రమించింది. కానీ-ఆమెకు అంతలోనే గుర్తొచ్చింది. ఈవేళ తను నిద్రపోకూడదు. ఏది ఏమయినా తను నిద్ర పోకూడదు నిద్ర పోకుండా వుంటే రేపు స్కూలుకు ఎలా వెళ్ళగలదు తను? నిజమే స్కూలుకెళ్ళి నిద్రపోవాల్సి

వస్తుంది.

ఆమె మరునాడు సెలవు పెట్టడానికే నిర్ణయించుకుంది। మెలకువగా వుండి తనను అనుభవించడానికి పలవరించే వెధవను పట్టుకొని చంపడానికి నిర్ణయించుకుంది. అందు కోసం మంచి కత్తి కూడా ఒకటి తయారుగా పెట్టుకుంది.

కళ్ళు మూసుకుందన్న మాటేగానీ-ఆమె ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. అప్పుడప్పుడు కళ్లు తెరిచి రూఫ్‌వైపు వేసివున్న తలుపు బోల్టు వైపు చూస్తోంది.

గదిలో టక్....టక్....టక్....మంటూ ఆడుతున్న గోడయారం శబ్దం, ష్....ష్....మంటూ నిశ్శబ్దంగా అక్కడున్న ఫ్యాను శబ్దం తప్పించి—మరొకటి విని పించడం లేదు. ఎక్కడో కుక్కలు వూఁ మంటూ అరుస్తు న్నాయి ఎవడో త్రాగుబోతు ఏవో పాటలు పాడుకుంటూ రోడ్డు మీదనుంచి వెళ్ళిపోతున్నట్టున్నాడు. ఆ మనిషే ఇంట్లోకి వస్తాడా ఏమిటి? పాట శబ్దం ఇంకా దగ్గరవు తోంది. అతను పాడుకుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

నిద్ర కనురెప్పలమీదే వుంది.

బలవంతంగా నిగ్రహించుకుంటూ వుంది.

పోలీసు హెడ్‌క్వార్టర్సులో గంట కొడుతున్నారు. లీలగా విన్పిస్తున్నాయి. సరిగ్గా పన్నెండు గంటలు.

తన విల్లింగ్ లేకుండానే ఆమెకు బలవంతంగా నిద్ర వచ్చేస్తోంది—

చివరికి ఆమె నిద్రపోయింది.

3

భళ్లున తెల్లవారింది.

ఆమె ఏదయితే కాకూడదని అనుకుందో అదే జరిగి

పోయింది.

ఆమె ఒంటిమీద బట్టలు లేవు.

జాకెట్టు, బ్రా, లంగా, చీరె దండెం మీద వ్రేలా డుతూ వెక్కిరించాయి.

చెంప మీద పళ్ళగాట్లు, ఒళ్ళంతా నొప్పులు.

రాత్రి తనను మళ్ళీ ఎవరో రేప్ చేసారు.

అంతే!

అదేరోజు రాధ ఇల్లు ఖాళీచేసి అక్కడి నుండి వెళ్ళి పోయి—మరో వూరికి ట్రాన్స్ఫర్ అయ్యేవరకు ఆ వూరి మొహం చూడలేదు.

ఆ వూళ్ళో కూడా స్కూలుకు దగ్గరలోనే ఇల్లు అద్దెకు తీసుకుంది. ఇల్లు చాలా అందంగా విశాలంగా ఉంది. అద్దె కూడా తక్కువే!

యింటిముందు విశాలమైన ఖాళీస్థలం ఉంది భవి ష్యత్తులో ప్లాట్లు కట్టించడానికి ఉద్దేశించి అలా వుంచారు. యింట్లో ధారాళంగా నీళ్ళువచ్చే కుళాయి వుంది. దాంతో అందమైన తోట, ఎన్నో రకాల కూరగాయలు కూడా పండిస్తాడు యింటి ఓనరు.

ఓ వారం రోజులనుండి తనకు తరుచూ ఎదురయ్యే అనుభవం ఆవిడకు ఎదురుకావడంలేదు.

రాధకు చాలా ఆనందంగా వుంది. వా డెవడో తనను మరిచిపోయాడనుకొని సంతోషపడింది. వారం రోజుల పాటు తనతోవున్న తమ్ముడు మోహన్ సెలవు పూర్తి కాగానే వూరికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి

రాధకు ఎందుకో గుబులుగా వుంది. వారం రోజుల నుండి తనకు తోడుగావున్న తమ్ముడు లేకపోవడవల్ల

నేమో! అయినా ఆంజనేయ దండకం చదువుకొని ధైర్యంగా పడుకుంది. నిద్ర ఎప్పుడు పట్టిందో తెలియదు.

తెల్లగా తెల్లవారింది.

కళ్ళు నులుముకుంటూ తెరిచి చూసింది. అలవాటు ప్రకారం పైట సర్దుకుని లేవడానికి ప్రయత్నించింది.

ఒళ్ళు జల్లుమంది.

గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

ఒళ్ళంతా చెమట పట్టేసింది.

తను నేకెడ్‌గా వుంది.

తన ఒంటిమీద నూలుపోగు కూడా లేదు.

చుట్టూ చూసింది. చీర, రవికె, బ్రా, లంగా ఒక మూలకు పడి వున్నాయి.

ఒళ్ళంతా నొప్పులు.

రాక్షస రతి....

ఆమెకు తెలియకుండానే — కళ్ళల్లోంచి—ధరళంగా నీళ్ళు ప్రవహిస్తున్నాయి.

కన్నీరు చెక్కిళ్ళపైనుంచి జారి, స్థనాలమీద పడగానే ఆమె ఒళ్ళు జల్లుమన్నది.

రాధ పెద్దగా ఏడ్చేసింది. ఎంతసేపు ఏడుస్తూ కూర్చుందో—స్కూలు టైము కూడా దాటిపోయింది.

ఆమె ఆలోచించడం మొదలుపెట్టింది. ఆగంతకుడు యింట్లోకి ఎలా రాగలుగుతున్నాడు. అది సిమెంటు రూఫ్ వున్న రెండు గదులు. వేసిన గడియ వేసినట్టుగానే వుంది. కిటికీ తలుపులు మూసి వున్నాయి. వెనుకవైపు కూడా డోర్ లేదు. ముందునుంచి—గజదొంగ కూడా ఎన్ని ఎత్తులు వేసినా రాలేడు. లోపలికి రావాలంటే—తలుపులు విరగ్గొట్టడం మినహా మరో మార్గంలేదు. అయినా వా

డెవడో వచ్చాడంటే—జీనియస్ అయి వుండాలి.

అసలు తను యిల్లు చూడటానికి వచ్చినప్పుడు. కిటికీలు, డోర్‌లు, వాటికి లోపలినుంచివున్న—బలమైన గడియలు చూసే—యిల్లు సెలక్ట్ చేసుకుంది.

రాధకు పిచ్చి ఎక్కినట్లు అవుతోంది—

ఆరోజు బాగా ఆలోచించి—రాధ ఓ నిర్ణయానికి వచ్చింది. దీని కంతటికి కారణం రాజు. అతను తప్పించి మరొక వ్యక్తి, తనవెంట పడతాడని తాను అనుకోదు. తను ఓ సాధారణమైన అందగత్తె. తనను అదే పనిగా—అదీ తనకు తెలియకుండా—రేప్‌చేసి వెళ్ళిపోయే అవసరం మరొక వ్యక్తికి వుండటానికి ఆస్కారంలేదు

సరాసరి అతను వుండే వూరికివెళ్ళి—తనను ఇలా ఎందుకు హింపిస్తున్నాడో కనుక్కుందామని బయలుదేరి వెళ్ళింది.

4

బస్టాండులో దిగి రిక్షాలో సరాసరి యాదగిరివాళ్ళ బట్టల షాపుకు వెళ్ళింది రాధ.

షాపులో అతను కనుపించలేదు.

తండ్రి వున్నాడు.

"నమస్కారమండీ" అన్నది.

"నమస్కారం, ఆఁ ఏం కావాలో చెప్పండి!" కష్టమర్ అనుకున్నాడు అతను.

"ఏమీ వొద్దు! మీ అబ్బాయి ఎక్కడున్నాడో చెప్పండి ముందు" కటువుగా అంది.

అతను నిర్ఘాంతపోయి—అంతలోనే తేరుకున్నాడు. ఆ తర్వాత అతను దుఃఖించడం మొదలుపెట్టాడు.

రాధ ఆశ్చర్యపోయింది.

"ఏమిటి? ఏమిటండి! ఎందుకు ఏడుస్తున్నారు! చెప్పండి!" అర్థంకాక అడిగింది.

అతను తేరుకొని—"మా అబ్బాయి రాజు మోటారు సైకిల్ యాక్సిడెంటులో పోయి రెండు నెలలు అవుతోందండి!" అన్నాడు.

రాధ స్థాణువై పోయింది.

"ఇంతకీ మీరేం పనిమీద వచ్చారు!" అని ప్రశ్నించాడతను.

రాధ సమాధానం యివ్వకుండా అక్కడినుంచి కదిలింది.

అతను పోయాడనగానే రాధ ఆశ్చర్యానికి అంతులేదు. తను వృథాగా అతనిమీద అనుమానం పెంచుకుందన్న మాట! తనకు ఈ సమస్య ఎదురై రెండు వారాలు కూడా పూర్తికాలేదు. ఎందుకో రాధకు అతని మాటలు నమ్మబుద్ధికాలేదు. చిట్ ఫండ్ కంపెనీలోకి వెళ్ళి—మేనేజర్‌ను అడిగింది.

"ఔనమ్మా! అతను పోయి రెండు నెలలు అవుతోంది. అతను మనదగ్గర సేవ్ చేసిన 500/- రూ లు మళ్ళీ వాళ్ళ నాన్న యాదగిరికి పే చేయించాను" అన్నాడాయన.

రాధ తలనిండా అనుమానాలతో వెనక్కి తిరిగి వెళ్ళి పోయింది.

5

విషాదకరమైన విషయమేమిటంటే—రాధ ప్రతిరోజు దారుణంగా అనుభవించబడుతోంది. ఆమెకు మరొక అనుమాన మేమిటంటే—తనను అనుభవించేది ఒక్కరా—లేక అంతకు మించి వున్నారా? అర్థం కావడంలేదు.

ఆమెకు గత కొద్ది రోజులుగా త్రాగుడు కూడా అలవా

హైంది. తను ఎందుకు యిలా పతనమౌతుందో అర్థం కావడము లేదు ఆమెకు.

ఆ రోజు—

వాళ్ళ స్కూలుకు యోగవిద్య గురించి దాని ప్రాశస్త్యం గురించి, తెలియజేసే ఒక సన్యాసి వచ్చారు. ఆయన యోగం గురించి చాలా బ్రహ్మాండంగా ఉపన్యాసం ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఆసక్తిగా విన్నారు.

ఉపన్యాస కార్యక్రమం తర్వాత—ఆ సన్యాసి రాధను ప్రత్యేకంగా పిలిపించారు.

రాధ ఆయన దగ్గరికి వెళ్ళింది.

రాధలో ఏదో లోపం వుందని, స్కూలు స్టాఫ్ రూములో అడుగు పెట్టినప్పుడే ఆయన గ్రహించారు. అందుకే ఆమెను పిలిపించారు.

రాధను యోగదృష్టితో పరిశీలించి చూశారాయన. ఆమె సూక్ష్మ శరీరాన్ని పూర్తిగా ఆక్రమించుకొని మరొక జీవుడున్నాడు—అతడు రాధను తీవ్రంగా వాంఛించిన రాజు. మోటారు సైకిలు యాక్సిడెంటులో మరణించిన తర్వాత—ప్రేతమై తీరని కోరిక, పగతో ఆమె చుట్టూ తిరిగాడు. ఏదో ఒక బలహీన క్షణంలో ఆమెలో ప్రవేశం దొరికింది. అప్పటినుండి అర్ధరాత్రి వేళల్లో ఆ కాముక ప్రేతజీవి రోజూ ఆమెను రమిస్తూ వస్తున్నాడు.

ప్రేతంయొక్క కాంక్ష తీవ్రతచేత కొన్ని అల్పశక్తులు వచ్చాయి వాటితోనే ఉడుపులను తొలగించగలుగుతున్నాడు.

ప్రేతావేశంవల్ల ప్రేతాని కున్నటువంటి అలవాట్లన్నీ

అది ఆవహించినవారికీ అబ్బుతాయి. రాజు విపరీతంగా త్రాగేవాడు. అందుకే రాధ క్రమంగా త్రాగుడుకు అలవాటు పడింది.

"బలికా మారతౌకామా
హంతు కామా ఇతి త్రిథా"

"బలి కాముకులు, రతి కాముకులు, హత్యా కాముకులు అని మూడు రకాల ప్రేతాలుంటాయి. ఇవి ఆ యా కోరికలతో తిరుగుతూ మనుష్య దేహాలలో ప్రవేశిస్తూ వుంటాయి." అని ఆ సన్యాసులవారు విషాదంగా తెలిపి— చచ్చి సాధిస్తున్న రాజును—ఆయన తన యోగశక్తిచే - ఆమె శరీరంలోనుంచి అవతలికి పంపించేసారు.

ఈ సంఘటన జరిగి దాదాపు అయిదేళ్ళు అయింది. ఇప్పుడు రాధ పెళ్ళిచేసుకొని—పిల్లా పాపలతో హాయిగా వుంది. □

గురువుగారి గొప్ప!

సీరియల్

ఏ.వీ.మోహన్రావ్

(గత సంచిక తరువాయి)

"ఈ అడవి చాలాదూరం వున్నట్లుంది!" అన్నాడు కాలా.

"మనమీదకు విరుచుకుపడేందుకు వాళ్ళకు యింతకన్నా అనువైన ప్రదేశం బహుశా దొరకక పోవచ్చు" అన్నాడు

దాదా.

"ఏం చేద్దాం? వెళ్దామా? ఆగుదామా?" అడిగాడు కిశోర్.

"ఆగి చేసేదేమిటి? భగవంతుడిపైన భారం వేసి ముందుకు వెళ్ళాల్సిందే!" అన్నాడు మేఘనాథ్.

కృష్ణమూర్తి—అపర్ణ ఏం మాట్లాడలేదు. వాళ్ళకు కొంత భయంగానే వుంది.

అందరూ దాదాకేసి చూశారు.

దాదా కాసేపు ఆలోచించి "మీరందరూ నా మాటమీద నమ్మకంతో వచ్చారు. ఇప్పుడు ఆపద మన ముందున్న విషయం మనలో అందరికీ తెలుసు. అందరం ఒకేసారి వెళ్ళి ఆ అడవి మనుషుల బారి పడడం కన్నా, ముందు నేనొక్కడినే వెళ్తాను. నా వెనుకగా మేఘనాథ్ కాలా, వాళ్ళకు కొంతదూరంలో మిగిలినవాళ్ళు రావాలి నాపై వాళ్ళు దూకగానే, మీరంతా నాకు సహాయంగా రావచ్చు. నేను కావాలనే ఈ ప్రమాదాన్ని ముందుగా ఎదుర్కొనటానికి నిశ్చయించుకున్నాను" అన్నాడు దాదా.

"నో! ఇందుకు నేనొప్పుకోను. మీరు మాకు నాయకులు. మీకేదయినా ప్రమాదం జరిగితే, మన ప్రయాసంతా వృధా అవుతుంది. అందువల్ల నేను ముందుకు వెళ్తాను" అన్నాడు మేఘనాథ్.

"అతని వెంట నేనూ వుంటాను మిగిలినవాళ్ళు మా వెనుకగా రండి" అన్నాడు కాలా.

"నాకన్నా వయసులో చిన్నవాళ్ళు. ఎంతో భవిష్యత్తుంది మీకు. మీరు ముందుగా వెళ్ళడం నేను ఒప్పుకోను" అన్నాడు దాదా. దృఢంగా.

"అయితే మనకా విధీ గిధీ యేదీ వద్దు. అందరం

క్షేమంగా వెనక్కి వెళ్ళిపోదాం!" అన్నాడు కిశోర్.

"అంత కన్నా వేరే మార్గం లేనట్లుంది!" అంది అపర్ణ.

"వెనక్కి వెళ్ళడం అవివేకం. ప్రాణం పోతాయన్న భయం వున్నవాళ్ళు, మాతో రానవసరంలేదు. వాళ్ళిక్కడే వుండిపోవచ్చు మేము తిరిగొచ్చాక తీసుకెళ్తాం. మాతో రాకున్నా నిధిలో ఖచ్చితంగా వాటా మాత్రం యిస్తాం. మా వెంటవుండి పిరికిమందు నూరిపోస్తూ. మమ్మల్ని నిర్వీర్యుల్ని చెయ్యడంకన్నా, యిదే మంచిది" అన్నాడు మేఘనాధ్.

"ఇలా మనలో మనం గొడవపడటం కాదు కావలసింది ఎలా ముందుకు వెళ్ళాలన్నది ముఖ్యం" అన్నాడు దాదా.

"అందరం కలసి వెళ్దాం. ఛస్తే ఒకసారే ఛస్తాం" అన్నాడు కాలా.

"అదే నేనూ చెప్పేది. దాదాను ఒక్కడ్నే ముందుకు పోనిచ్చి బలిపెట్టడం నాకిష్టం లేదు" అన్నాడు మేఘనాధ్.

ఆ తర్వాత కాసేపు తర్కవితర్కాలు జరిగాయి. చివరకు అంతా కలసి అడవిలోకి దూరేందుకు నిశ్చయించుకున్నారు.

ముందు మేఘనాధ్, అతని వెనుక దాదా, ఆ వెనుక కాలా, తర్వాత అపర్ణ, కృష్ణమూర్తి, కిశోర్, వరుసగా ఒకరి వెనుక ఒకరు, ముందుకు నడవడం ప్రారంభించారు.

మేఘనాధ్ చేతిలో వున్న బలమైన టార్చిలైటును, చెట్లపైకి వేసి అప్పుడప్పుడు చూడసాగాడు. అడవి మను

షులు కొమ్మలపై కెక్కి కూర్చుని ఒక్కసారిగా తమ పైకి దూకడమో, లేక, బాణాలతో చంపడమో చేయ వచ్చు.

అరగంటపై గానే నడిచారు. నిర్మానుష్యమైన అడవిలో భయంకరమైన కీచురాళ్ళ రొదలు. నక్కల అరుపులు తప్ప మరేవిధమయిన శబ్దం కానీ, సంచారపు భయముగానీ తోచ లేదు.

"అనవసరంగా భయపడ్డాం మన దెబ్బకు భయపడి వాళ్ళు అక్కడ్నుంచి అప్పుడే తోక పీకినట్లున్నారు!" అన్నాడు కిశోర్.

"ముగ్గురు చచ్చాక, ఇంకా మనపైకి రావటానికి వాళ్ళకు దమ్ములున్నాయా?" అంది అపర్ణ, ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

మేఘనాధ్, కాలా ఎవ్వరూ మాట్లాడలేదు. వళ్ళంతా కళ్ళు చేసుకొని, చుట్టూ గమనించసాగారు. అప్పుడప్పుడు తల ఎత్తి పైకి గూడా గమనించసాగారు.

చెట్ల సందుల్నుంచి, గాలి ఝుమ్మని శబ్దం చేస్తూ రాసాగింది.

"దాదా! ఆగండి!" అన్నాడు కాలా.

"ఏమయింది?" అడిగాడు మేఘనాధ్.

"ఏదోరకమైన వాసన రావటంలేదూ?...."

"వాసనా?" అంటు ముందుకొచ్చి కాస్త ఘట్టిగా గాలి పీల్చి "ఏం రావటం లేదే?" అన్నాడు మేఘనాధ్.

"నీకు తెలీదు! బాగా మరిగిన ఈతకల్లు వాసనది. మా గూడెంలో, తెచ్చి త్రాగేవారు. ఛండాలపు వాసన దీనిది. వాసన కొద్దిగా వస్తూంది. అదే పడమరనుంచి వస్తూంది. అడవి మనుషులకు అదంటే విపరీతమైన ఇష్టం. ఈ

వాసనను బట్టి చూస్తే వాళ్ళిక్కడకు దగ్గరలో వుండివుండా లనిపిస్తుంది" అన్నాడు కాలా.

దాదా కూడా వాసన గమనించి కాలా అభిప్రాయంతో ఏకీభవించాడు. అందరూ ఆయుధాలు సరిచేసుకున్నారు. ఒకరికొకరు కళ్ళతోనే ధైర్యం చెప్పుకున్నారు.

45

కాలా, వాసన వస్తున్న దిక్కుగా, వాళ్ళంతా కళ్ళు చేసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ, ముందుకు నడవసాగాడు. అతని వెనుక మేఘనాధ్ వున్నాడు. అటూ ఇటూ, జ్వాలా, దాదా, కిశోర్, ఆయుధాలు సన్నద్ధంగా వుంచుకొని నడవసాగారు.

దాదాపు అరమైలు పైగా నడిచారు. మధ్యలో ఎవ్వరూ కనుపించలేదు.

"ఆ వాసన కల్లుది కాదు. మరేదో అయివుంటుంది. మనం అనవసరంగా కంగారుపడుతున్నాం" అన్నాడు కృష్ణమూర్తి.

దాదా మౌనంగా వుండిపోయాడు. కాలా మాత్రం ముందుకే చూస్తూ అడుగులు వెయ్యసాగాడు. మరికొంత దూరంలో అడవిచెట్లు అంతమైన విశాలమైన ఖాళీస్థలం కనుపించింది.

చెట్లకు నూరుగజాల దూరంలో గుంపుగా కూర్చుని వున్న అడవి మనుషులు కనుపించారు. ఆ గుంపుకు వెనుక వైపు ఎత్తైన బండ వుంది. దానిపైన ఒక అడవిమనిషి కాపలా కాస్తున్నాడు.

మేఘనాధ్ అందర్నీ ఆగమని సంజ్ఞచేశాడు.

"వాళ్ళే!" అంటూ చూపించాడు కాలా.

"దాడి చేద్దామా?" అడిగాడు మేఘనాధ్.

"ఏదో జంతువును చంపి కాల్చినట్లున్నారు అది తింటూ, కల్లు త్రాగుతున్నారు. ఇంతకన్న సరైన సమయం మరొకటి లేదు" అన్నాడు దాదా.

అందరూ తమతమ ఆయుధాలతో గోడలా, దూర దూరంగా నిలబడి, కాల్పులు మొదలెట్టారు. నలుగు రైదు గురు మెలికలు తిరిగి పడిపోయారు. ఇద్దరు ముగ్గురు పరుగెత్తసాగారు. కొందరు తమాయించుకొని లేచి నిలుచున్నారు. చేతుల్లో వున్న విల్లమ్ములు ఎక్కుపెట్టటానికి ప్రయత్నించసాగారు. వాళ్ళ కాళ్ళ మడిమలు చీలిపోయేలా గురిచూసి కాల్చసాగారు దాదా బృందం. అరనిముషంలో అంతకు ముందుదాకా ప్రశాంతంగా వుండిన వాతావరణం భీభత్సంగా మారిపోయింది. అరుపులు, ఏడుపులు, భీకర నాదాలతో నిండిపోయింది.

కాలా, మేఘనాధ్, కృష్ణమూర్తి, కిశోర్, అపర్ణ, దాదా, అంతా ఒక్కుమ్మడిగా ముందుకు పరుగెత్తికెళ్ళి, అడవి మనుషుల చుట్టూ తుపాకులు ఎక్కుపెట్టి నిల్చున్నారు. వాళ్ళ ఆయుధాలను క్రింద పడవేయించారు. ఆ తర్వాత వాటిని అపర్ణ సేకరించి ఒకచోట చుట్టగా పెట్టింది. తమ దగ్గరున్న ప్లాస్టిక్ త్రాడుతో అందరి చేతులు కలిపి ఘట్టిగా కట్టారు.

"ఎవరు మీరు?" అడిగాడు దాదా.

అడవి మనుషులు నోరు మెదపకుండా మౌనంగా నిలుచుని చూడసాగారు.

"చెప్పకుంటే, కాకుల్ని కాల్చినట్లు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతాను" దాదా హెచ్చరించాడు.

"మీ ప్రాణాలు తియ్యటం మా ఉద్దేశ్యం కాదు. నిజం చెప్పండి. ఇంతకు ముందు మాపై దాడిచేసింది మీరే కదూ!" అడిగాడు మేఘనాధ్.

అవునన్నట్లు తలూపారు అంతా.

"మాపల్లె మీకేం అపకారం జరిగింది. మీ నాయకు డెవరు?" అడిగాడు దాదా.

ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

కాలా ఆ మనుషుల్ని జాగ్రత్తగా పరిశీలించసాగాడు. ప్రశ్న లడిగినప్పుడల్లా, ఆ మనుషులంతా, మధ్యగా నిలు చున్న పొట్టి మనిషికేసి చూడటం గమనించాడు.

గబగబ ముందుకెళ్ళి ఆ పొట్టిమనిషి కట్లు విప్పించాడు. అతన్ని మాత్రం విడిగా చేసి, తుపాకీ మడమతో వీపుమీద బలంగా కొట్టి "మామూకు నీకు సంబంధం ఏమిటి?" అడి గాడు.

దాదాకు కాలా చేష్టలు అర్థంగాక నిరుత్తరుడై, చూస్తూ నిల్చున్నాడు.

అతను మాట్లాడలేదు.

"వీళ్ళకు నాయకుడు నువ్వేనా?" అడిగాడు కాలా. ఆ ప్రశ్న వినగానే మేఘనాధ్ ముందుకు వచ్చాడు. దగ్గరగా గమనించాడు. అతను వల్లెవాటుగా వేసుకున్న పులితోలును విప్పాడు. దాని వెనుకభాగంలో కనుపించిన గీతలు చూసి ఆశ్చర్యపోయాడు.

"రాకా!" సంబోధిస్తూ "నువ్వు వచ్చినట్లు మామూను మభ్యపెట్టావ్. మమ్మల్ని నమ్మించావ్. అసలు ప్లాను దగ్గ రుంచుకొని నకిలీ ప్లాను తెలివిగా మాకు అందజేశావ్. ఆ తర్వాత మమ్మల్ని వెంటాడి మాపై దెబ్బతీయ చూశావ్. ఎందుకు?" అడిగాడు మేఘనాధ్.

"అవును, నేను రాకానే. ఆ నిధి మీ సొంత ఆస్తి కాదు. దాన్ని సంపాదించేందుకు మీకొక్కడికే కాదు, సాహసవంతు డెవరికైనా హక్కుంది. అందుకే చేశాను"

అన్నాడు రాకా.

దాదా, మిగిలిన వాళ్ళంతా ఆశ్చర్యంతో తెల్లమొహం వేశారు. అడవి మనుషుల్లోకూడా, నాగరకులకున్న కుచ్ఛిత పు తెలివి తేటలు వుండడం వింతగానూ, క్రొత్తగానూ తోచింది.

"మాపై ఎందుకు దాడిచేశావ్?"

"ఆ నిధివున్న ప్రదేశంలో ఉపయోగపడే అసలైన తాళం మీదగ్గర వుందని నాకు తెలుసు. అందుకే దాన్ని సంపాదించే ఉద్దేశ్యంతో దాడిచేశాను. మేమిచ్చట మాంసం తిండికి, కల్లు త్రాగుడుకు, పాల్పడకుండా వుండివుంటే మిమ్మల్ని హతమార్చి, ఆ నిధిని దక్కించుకునేవాణ్ణి" అన్నాడు రాకా.

"ఈయన ఆ సంస్థానానికి సంబంధించిన మనిషి. ఆ నిధికి ఒక విధంగా వారసుడు. అందుకే ఆ తాళం అతని దగ్గర వుంది నీకు దాన్ని పొందాలన్న దురుద్దేశ్యం కలగడం, నీ ప్రాణాలు పోయేందుకే. మామూకున్న నిజాయితీ నీకు లేదు" అన్నాడు మేఘనాధ్.

"నా ముత్తాత ఒకరు, ఆ నిధిని తమ మనుషులచేత మా గూడెంనుండి, కాంచన శిఖరందాకా ఆ రోజుల్లో బందిపోటు దొంగల్ని మధ్యలో హతమార్చి మరీ మోసుకెళ్ళాడు. ఆ తాళం తిరిగి తెచ్చి ఆ రాజ వంశీకులకు మా గూడెంలో ఇచ్చాడు. కావాలంటే అప్పుడే కాజేసేవాళ్ళు. ఆయన చేసిన కష్టానికి వాళ్ళిచ్చిన ప్రతిఫలం మీకు తెలుసా?" అడిగాడు రాకా.

"తెలీదు" అన్నాడు దాదా.

"ఆయన కాళ్ళు చేతులు, నరికి, ఆ గూడెంకు అతనిని తమ్ముణ్ణి, నాయకుణ్ణిచేసి, అతని పెళ్ళాం బిడ్డల్ని అడవు

ల్లోకి తరిమివేశారు. అందుకే నాకు ఆ రాజవంశీకులంటే అసహ్యం. ఆ నిధి వాళ్ళకు దక్కకుండా చూడాలన్నదే నా ధ్యేయం" అన్నాడు రాకా.

"ఇదంతా నీకెలా తెలుసు" అడిగాడు కాలా.

వంశపారంపర్యంగా మాకు ఉగ్రుపాలతో, విజయపూర్ రాజవంశం వాళ్ళపై పగనూరిపోస్తారు. ఏదో ఒక రోజు మీరిలా వస్తారని తెలుసు. వచ్చినప్పుడు మిమ్మల్ని నామరూపాలు లేకుండాచేసి, ఆ నిధిని స్వాధీనం చేసుకోవాలన్నదే నా ధ్యేయం." అన్నాడు రాకా.

అతను చెప్పినదంతా విన్నాక కాలా ఆతృతగా మేఘనాధ్ కేసి చూశాడు. అందరూ దాదాను అనుమానంగా చూశారు. అతను కూడా నిధిని చేతికి దొరికాక తమను అంత మొండిస్తాడేమోనన్న అనుమానం ఎవరికి వారికే అప్రయత్నంగా కలిగింది.

"రాకా!" గంభీర స్వరంతో పిలిచాడు దాదా. "జరిగింది నువ్వు చెప్తుంటే వింటున్నాను తప్ప నాకు తెలీదు. ఆనాటి పద్ధతులు. అలా వుండివుండొచ్చుకానీ విజయపూర్ రాజవంశీకులంతా అలాంటివాళ్ళని, యిన్ని తరాలగా మీరు అనుకుంటూ మాపై పగను నూరిపోయడం అన్యాయం. నువ్వు. నీ వంశీకులు మావల్ల పడ్డ బాధలకు ప్రతిఫలంగా, ఆ నిధిలో పదోవంతు నీకు ఇస్తాను. నిన్ను నా స్వంత తమ్ముడిగా భావిస్తాను. అదీ నువ్వు నమ్మితే..." అన్నాడు దాదా.

రాకా ఆ మాటలువిని విస్తుపోయాడు. "క్షమించండి. మీ మనస్తత్వం తెలీక ఇలా ప్రవర్తించవలసి వచ్చింది. ఆ నిధి సాధించేందుకు, అవసరమైన సహాయం చేస్తాను. నేనేకాదు, నావాళ్ళు కూడా మీతో వుంటారు. మీ కే

అపాయం రాకుండా చూస్తారు" అన్నాడు రాకా.

"అవసరంలేదు, నువ్వు మాతో రావద్దు. యిక్కడే వుండు. తిరిగి వచ్చేటప్పుడు దాదా చెప్పినట్టు పదోవంతు నీకిచ్చి వెళ్తాం!" అన్నాడు మేఘనాధ్.

"నన్ను అనుమానిస్తున్నారా?"

"రక్తం త్రాగడం అలవాటుపడ్డ పులి, దాని అలవాటు మార్చుకుంటున్నానని చెప్తే విని. నమ్మేటంత అవివేకులం కాదు మేము!" అన్నాడు కృష్ణమూర్తి కోపంగా.

"ఆటవికుల మనస్సు మీకు తెలీదు. మన నాగరికతలో వున్న నమ్మకద్రోహం వాళ్ళలో వుండవు. రాకావల్ల మీ కేవిధమైన హాని జరగదు. దానికి నేను హామీ!" అన్నాడు దాదా.

జ్వాలా దాదా అలా అనగానే మిగిలినవా ళ్ళెవరు నోరు విప్పలేదు.

"ఎందుకైనా మంచిది. రాకా దగ్గరాకానీ. అతని అను చరుల దగ్గరకానీ, ఏవిధమైన ఆయుధాలు వుండకుండా చూడటం అవసరం" అన్నాడు కాలా.

"అలాగే! మీ సామాన్లు మోయడం, మిగత ఇతర పన్లు మాకు అప్పగించండి" అన్నాడు రాకా.

దాంతో అంతా చల్లబడిపోయింది.

అందరూ కూర్చున్ని మిగిలివున్న అడవి పందిమాంసం, పెద్ద పెద్ద ఉేకుచెట్టు ఆకుల్లోకి తీసుకొని తింటూ కూర్చు న్నారు. అడవి మనుషులు, మట్టిపాత్రల్లో పోసిచ్చిన కల్లు కొద్ది కొద్దిగా త్రాగుతూ కూర్చున్నారు.

"రాకా?" పిలిచాడు దాదా.

"రాజాసాబ్!" పలికాడు రాకా.

"నువ్వు కాంచనశిఖరం దాకా వెళ్ళివచ్చావా?" అడి

గాడు మేఘనాధ్.

"ఆ! ఒకసారి వెళ్ళొచ్చాను. కానీ కాంచనజంగ పర్వతం అడుగువరకే వెళ్ళాం. అదీ ఎవరో నిధి వెతుక్కుంటూ వెళ్ళారని తెలిసి వాళ్ళను వెతుక్కుంటూ వెళ్ళాను." అన్నాడు రాకా.

"ఎవరా వెళ్ళింది?"

"ఎవరో తెల్లటిమనుషులు. వాళ్ళు నిధికోసంరాలేదు. ఆ శిఖరం ఎక్కేందుకు వచ్చారనీ నిధి గొడవలు వాళ్ళకు తెలీవని, తెలుసుకొని, తిరిగివచ్చేశాను" అన్నాడు రాకా.

"వాళ్ళెలా అక్కడికి చేరుకున్నారు?"

"పక్షిలా ఎగిరే ఒక దాంట్లోవచ్చి ఆ పర్వతానికి మూడు మైళ్ళ దూరంలో చదునుగావున్న ప్రదేశంలో దిగారు. ఆ తర్వాత రెండు నెలలుదాకా అక్కడే వుండిపోయారు. పైకెక్క లేక. తమ ప్రయత్నం మానుకుని తిరిగి వెళ్ళిపోయారు. ఆ రెండు నెలలు నా మనుషుల్ని యిక్కడే వుంచాను" అన్నాడు రాకా.

మంచినీళ్ళు త్రాగి, మొఖాలు కడుకున్నారు జనమంతా. ఈలోగా అడవిమనుషులు, కొన్ని చెట్లకొమ్మలు విరగ్గొట్టి తెచ్చి, పందిరిలా చేశారు. మేఘనాధ్ క్రిష్ణమూర్తి కాలా, కలపి, టెంట్ వేశారు.

ఆ మధ్యాహ్నం దాదా, మేఘనాధ్, కాలా, రాకా నలుగురు, ప్లాను మధ్యలో పెట్టుకొని కూర్చున్నారు.

"మనం కూర్చున్నదిక్కడ" అంటూ రాకా వ్రేలుపెట్టి చూపించాడు దాన్నిబట్టి. ఆ ప్లానులు, మామువున్న ప్రదేశం నుంచి మాత్రమే నిధికి మార్గం తెలియపరచివుందని అర్థం చేసుకున్నాడు.

"నువ్వెక్కడిదాకా వెళ్ళావు?" అడిగాడు మేఘనాధ్.

రాకా చేత్తో ఒకచోట చూపించాడు. అందరూ అక్కడ్నుంచి ముందుకు వెళ్తున్న గీతలకేసి చూశారు.

ఆ ప్రదేశంనుంచి గీతలన్నీ మెలికలు మెలికలుగా కనిపించాయి. ఎత్తుప్రదేశాలను, లోయల్ని, నదుల్ని గుర్తించేందుకు వీలుగా, కొన్ని గుర్తులు పెట్టివున్నాయి.

దాదావాట్ని తదేకంగా చూశాడు. మేఘనాధ్, కాలా గూడా రెప్పవెయ్యకుండా ఆ గీతలకేసి చూడసాగారు.

"రాకా చేరిన ప్రదేశంనుంచి, దాదాపు ఆరేడుమైళ్ళు మనం పర్వతంపైనే ప్రయాణం చెయాల్సివుంటుంది. ఆ తర్వాత ఒక లోయలోకి దిగాలి. అక్కడ్నుంచి పర్వతంలోపలికి వున్న చిన్న దారిద్వారా మనం కొన్ని వేల అడుగుల ఎత్తుకెక్కాలి ఆ లోపలవున్న గుహలోవున్న నిధిని మనం సాధించాలి" అన్నాడు దాదా.

అందరిలోనూ నిరుత్సాహం, నిర్లిప్తత చోటు చేసుకున్నాయి.

"ఇక్కడికి చేరుకోడానికే ఇంత కష్టపడ్డాం. అక్కడిదాకా వెళ్ళడానికి మన దగ్గరున్న ఆహారపదార్థాలు, మందుగుండు సామానులు సరిపోతాయా?" కిశోర్ తన అనుమానం వ్యక్తం చేశాడు.

"రోట్లో తల దూర్చాక రోకటిపోటుకు జడిసి ప్రయోజనం లేదు. ముందుకుపోవటం తప్ప వేరే ఆలోచన చెయ్యడం అనవసరం!" అన్నాడు కాలా.

"వాటి గురించి మీరు ఆలోచించవద్దు మేము తినే పదార్థాలు తినగలిగితే, మీకు ఏవిధమయిన కొరత లేకుండా ప్రయాణం పూర్తయేదాకా చూచే బాధ్యత నాది!" అన్నాడు రాకా.

"ఇక మనం ఎలా ముందుకు వెళ్ళాలన్నది ఆలోచించి

నిర్ణయించుకుంటే మంచిదనుకుంటాను" అన్నాడు మేఘనాథ్.

"కాంచన శిఖరపర్వతం అడుగుభాగం దాకా యింతకు ముందు రాకా, అతని మనుషులు ఒకసారి వెళ్ళివచ్చిన వాళ్ళే కాబట్టి అక్కడికి చేరుకునేందుకు మనకు ఏ విధమైన సమస్య ఉండవు. అవునా రాకా?" అడిగాడు జ్వాలా దాదా.

అవునన్నట్లు తలూపాడు రాకా.

"అయితే మనం వేరే ఆలోచన లేకుండా రేపు ఉదయమే బయలుదేరి తిన్నగా రాకా ముందు వెళ్ళి వచ్చిన ప్రదేశం వైపు వెళ్ళిపోదాం. అక్కడకు చేరుకున్నాక, పథకం తయారు చేసుకుని ముందుకు వెళ్ళవచ్చు" అన్నాడు కాలా. అందరి వైపు చూస్తూ

అందరూ అలాగే నన్నట్లు తలూపారు.

ఆ రాత్రికి అపర్ణ, కిశోర్, వంటలు చెయ్యటం మొదలెట్టారు. ముందుగా అందరికీ టీ తయారుచేసి ఇచ్చారు. దూరంగా ఒక చెట్టు క్రింద కూచున్న మేఘనాథ్ వద్దకు కాలా రెండు కప్పుల టీ పట్టుకొచ్చి కూచున్నాడు. ఒక కప్పు మేఘనాథ్ కు అందించాడు.

"రాకా గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు కాలా.

"ఏ విషయంలో?"

"అన్ని విషయాల్లోనూ అతను నమ్మదగిన మనిషిగా కన్పిస్తున్నాడా? లేదా? అతన్ని, అతని అనుచరులను మనం వెంట తీసుకెళ్ళటందువల్ల కోరి కోరి ప్రమాదాన్ని తెచ్చుకున్నట్లుగాదా? నిధి చేరేదాకా చెప్పుక్రింద తేలులా వుండి అది చేరాక మనల్ని పట్టిపెట్టి మొత్తం కాజేస్తే

చెయ్యగలిగిందేమీ లేదుగదా?"

"అవును."

"అలాంటప్పుడు దాదా, ఇంత పెద్ద ప్రమాదకరమైన నిర్ణయం మనల్ని అడగకుండా ఎందుకు తీసుకున్నట్లు?"

"ఏమో? అదీ నువ్వే చెప్పు!" టీ గుటకవేస్తూ అన్నాడు మేఘనాధ్.

"నీకు నవ్వులాటగా వుంది కదూ?" అడిగాడు కాలా.

"మనం సరసాలాడుకోవడం లేదు. సరదాగా మాట్లాడుకోవడం లేదు నవ్వులాటగా తీసుకోవటానికి. అసలు నీ అభిప్రాయం అన్ని విషయాల గురించి తెలుసుకున్నాక నోరు విప్పుదామని నా వుద్దేశ్యం" అన్నాడు మేఘనాధ్.

"దాదా బుద్ధి వక్రించి వుంటుందని నా అనుమానం. రాకాతో కుమ్మక్కయి మనల్ని వదిలించుకుందామన్న దురుద్దేశ్యంతో వున్నట్లున్నాడు" కాలా అభిప్రాయం చెప్పాడు.

"నువ్వు మగవేషంలో వుండి, మగతనంతో మాట్లాడుతున్నట్లు లేదు. మంగళలా మూర్తీభవించిన ఆడతనంతో అంటున్నావ్ అవునా మంగళా?" అడిగాడు మేఘనాధ్.

తల క్రిందకు వాల్చింది ఓర చూపులు చూస్తూ "నా భయాలు నాకున్నాయి. నాకు ఈ నిధితో అవసరం లేదు. నా నిధిని విధి వేరే రూపంలో నాకందజేసిందని నమ్మకం. నీకేమైనా ప్రమాదం జరుగుతుందేమోనని నా భయం" అంది మంగళ.

"నీ కా భయం అవసరం లేదు వీళ్ళెవ్వరివల్లా నాకు ఏ విధమైన అపకారంగానీ, అన్యాయంగానీ జరగదు. నన్ను నేను రక్షించుకోవడమెలాగూ నాకు తెలుసు. ఆ అవసరమే వస్తే, అందర్నీ హతమార్చి ఆ నిధిని మొత్తం చేజి

క్కించుకుని తీసుకురాగల ధైర్యసాహసాలు నాకున్నాయి.'' అన్నాడు మేఘనాధ్.

"నువ్వేం మనవాతీతుడవైన దేవుడివా? దయ్యానివా? ఇంతమందిని ఎదిరించి పోరాడగలగటానికి?'' అడిగింది మంగళ.

"అలాంటివాడ్నే అనుకో?'' అన్నాడు ఆఖరిగుక్క టీ త్రాగుతూ.

ఆ మాటతో మంగళ అవాక్కయి కూలబడిపోయింది. ఆమె మెదడు వేడెక్కిపోయింది. మేఘనాధ్ మాటలు క్రొత్తగా వినిపించాయి. జ్వాలాపదా జట్టులో వుంటూ, ఇంతదూరం వచ్చిన మనిషి అలా మాట్లాడటం వింతగానూ, విచిత్రంగా తోచింది.

"ఏమిటలా మౌనంగా వుండిపోయావ్?'' అడిగాడు మేఘనాధ్.

"ఏం లేదు'' అంటూ జవాబు చెప్పకుండా టీ త్రాగుతూండిపోయింది మంగళ.

46

అరగంటలో వంట పూర్తయింది.

భోజనానికి రమ్మన్నట్లు, పెద్ద పళ్లెంపైన, గరిటతో దబదబ కొడుతూ శబ్దంచేశారు కిశోర్, అపర్ణ. అంతా లేచివెళ్ళి మొఖాలు కడుక్కుని, వచ్చి వరుసగా కూర్చున్నారు.

అందరూ ఆకలితో వుండడంవల్ల చకచక తిని, పది నిముషాల్లో భోజనాలు ముగించివేశారు. వెంటనే సామాన్లు సర్దుకొని, ప్రమాణానికి సిద్ధమైనారు సామానులన్నీ రాకా మనుషులు మోసేందుకు తీసుకోవటంతో, ఎవ్వరివద్ద బరు

వులు లేవు. వడిగా, సులువుగా నడవసాగారు.

జ్వాలా దాదా వెంటనంటి రాకా నడకసాగాడు. అతని వెనుక కిశోర్, అపర్ణ, కృష్ణమూర్తి వున్నారు. వారి తర్వాత రాకా మనుషులు. చివర్లో మేఘనాథ్, కాలా, నడవ సాగారు.

"మొత్తానికి అన్ని ప్రమాదాలు అధిగమించి మనం గమ్యం చేరుకొనే వాతావరణం ఏర్పడింది!" అన్నాడు కాలా.

"అంటే ఇంకా ఏ ప్రమాదాలూ రావనా నీ ఉద్దేశ్యం?" అడిగాడు మేఘనాథ్.

"అవును. మనుషులతో వచ్చే వీలులేదు. కారణం మనకింక విరోధులు లేరు. త్రోవ తెలిసిన మనిషివున్నాడు. కాబట్టి వేగంగా వెళ్ళవచ్చు. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో ఏవన్నా క్రూరజంతువులుంటే తప్ప, మనం భయపడ వలసిందేముంటుంది" అడిగాడు కాలా.

"చూద్దాం!" అన్నాడు మేఘనాథ్.

"చూచేందుకు ఏమీ వుండదు. నిధిచేత చిక్కాక మన వాటా మనం తీసుకొని, ఎక్కడో ఒకచోట ఇల్లు కొనుక్కొని హాయిగా వుండిపోదాం."

"వాళ్ళంతా వెళ్ళిపోతున్నారు. మనం ఇలా సరసాలాడుకుంటూ కూర్చుంటే ఫలితం లేదు! పద! నడువు!!" అంటూ హెచ్చరించి, అడుగులు వడివడిగా వేశాడు మేఘనాథ్. కాలా కూడా అతన్ని అనుసరించాడు.

అలా రెండు గంటలు నడిచారు. హిమాలయా పర్వతాలు బాగా దగ్గరయినాయి. ఆకాశాన్ని అంటుతున్నట్లు, తెల్లటి దుప్పట్లు కప్పుకొని, ఎత్తుగా నిలబడి వున్న శిఖరాలు, మనోహరంగా, మనోజ్ఞంగా కనుపించాయి. వాటిపైనుండి

వీస్తున్న గాలులు చల్లగా వంటిని తాకుతుంటే గిలిగింతలు పుట్టుకొచ్చాయి అందరికీ.

"మనం దారి తప్పలేదుగా?" జ్వాలాదాదా అడిగాడు.

"సరయిన దారిన ఉన్నట్లున్నాం!" అన్నాడు రాకా.

"బయలుదేరి మూడుగంటలు దాటుతోంది" చేతివాచీ చూసుకుంటూ చెప్పాడు. "అంటే ఇప్పటికే మనం తొమ్మిది నుండి పదిమైళ్ళదాకా నడిచి వుంటాం. నువ్వు చెప్పిన దాని ప్రకారం ఐదారు మైళ్ళకన్నా మించివుండదన్నావు. అందుకే నాకు అనుమానం వచ్చింది" అన్నాడు దాదా.

రాకా ఆగి చుట్టూ చూశాడు. ఆలోచిస్తూనే గతాన్ని నెమరువేసుకున్నాడు. సందిగ్ధంలో పడ్డట్లుగా, పటంతీసి చూశాడు. కొన్ని క్షణాలు తదేకంగా దాన్ని గమనించాడు. ఆ తర్వాత దాన్ని మూసి నిలుచున్న ప్రదేశానికి ఇరు ప్రక్కలా, మరేదైనాచోటు వుందేమోనని గమనించ సాగాడు. అలాంటిదేదీ అతనికి కనిపించలేదు. తృప్తిగా గాలి పీల్చాడు.

"సరయిన మార్గంలోనే వున్నాం!" అన్నాడు రాకా.

ఎవ్వరూ ఏమీ, మాట్లాడలేదు. మళ్ళీ నడక మొదలెట్టారు. మరో రెండుగంటలు నడిచారు. ఈమారు దగ్గర వున్న పర్వతాలు దూరం కావడం మొదలెట్టాయి. దాన్ని గమనించిన కిశోర్, అడిగాడు దాదాను.

"ఇంతకు ముందు వచ్చినప్పుడు ఇంత టైమ్ పట్టలేదు. మనం ఇప్పటికే చాలాసేపు నడిచాం. తప్పుత్రోవన పడ్డ విషయం ఇప్పుడు అర్థమవుతూంది" అన్నాడు రాకా.

ఆ మాట వినగానే అందరిలోనూ అప్పటిదాకా ఉరక లెత్తిన ఉత్సాహం, ఒక్కసారిగా మాయమయింది. నిస్పృహ ఆక్రమించింది.

"మమ్మల్ని తెలిసితెలిసి తప్పుత్రోవన తీసుకువచ్చావ్. ఏమిటి నీ పథకం?" గద్దించాడు మేఘనాథ్, రాకాను.

రాకా మౌనంగా నిలుచుని దాదావైపు చూశాడు.

దాదా కళ్లు కోపంతో నిప్పురవ్వల్లా మండిపోతున్నాయి. రాకాను నిలువునా నరికి చంపేట్లుగా వున్నాడు ఆ చూపులకు రాకా గజగజ వణికిపోయాడు.

"ఇది తెలిసి చేసింది కాదు. ఈ ప్రాంతంలో అన్ని త్రోవలు ఒకలాగే వున్నట్లున్నాయి. దారి మారామని నాకు తెలియనే లేదు. నడిచిన దూరాన్నిబట్టి, కాలాన్ని బట్టి, అనుమానం వస్తూంది" అన్నాడు రాకా.

"మనమేం చెయ్యాలి? వెనక్కి వెళ్దామా?" అడిగాడు కాలా కోపంగా దాదాకేసి చూస్తూ. రాకాను నమ్మకూడదన్న విషయం రుజువైనట్లుగా తోచింది అతనికి.

"చెప్పు రాకా?" గద్దించాడు దాదా.

"అతను చెప్పేందుకేముంది. మనల్ని కావాలని దారి మార్చి తీసుకొచ్చాడు. వెనక్కి వెళ్ళినా అసలు దారి అతను చూపించడు. ఎటు వెళ్ళినా మనం కాంచన శిఖరం క్రిందకు చేరుకుంటాం. అందువల్ల ముందుకే వెళ్దాం. ఎవ్వరైనా మనల్ని ఎదురించేందుకు వస్తే హతమారుద్దాం!" అన్నాడు మేఘనాథ్.

అందరూ అతనితో ఏకీభవించారు. దాదాకూడా తలూపాడు. మళ్ళీ నడక మొదలైంది. రాకాకూడా వెంట వెళ్ళసాగాడు. అతనికి మతిపోయినట్లయింది. అందరూ అతన్ని అనుమానంగా చూడటం భరించలేకపోయాడు.

మరో గంట గడిచాక వాళ్ళకు లోయప్రాంతం నుంచి వింత వాసన రావటం మొదలెట్టింది. ముందుకు వెళ్ళేకొద్దీ ఆ వాసన మరీ ఎక్కువైంది.

"ఇక్కడ గంజాయి చెట్లు వున్నట్లున్నాయి. వాటి వాసనే ఇది?" అన్నాడు రాకా.

వాళ్ళు నడుస్తున్న బాట లోయలోకి పోతూంది. అక్కడికి లోయకు మధ్యదూరం వెయ్యి అడుగుల పైగా వుంది. కొండల మధ్యనున్న ఆ లోయ వైశాల్యం దాదాపు పది చదరపు మైళ్ళు వుండవచ్చు ననుకున్నాడు దాదా. లోయలో మధ్యగా బొమ్మరిల్లులా చిన్న యిల్లు కనిపించింది. చీకటి పడుతుండడంవల్ల ఆ యింటి నలుమూలలా వెలుగుతున్న దీపాలు బాగా కనపించాయి. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో అలా దీపాలు కనుపించడంతో అందరికీ ఆశ్చర్యం కంగారు కలిగాయి.

వాళ్ళలో వాళ్ళు తర్జన భర్జన చేసుకున్నారు.

కొండ ప్రాంతాల్లో అక్కడక్కడా దొంగతనంగా, కొన్ని జాతుల మనుషులు గంజాయిచెట్లు వేసి పెంచి, దాని లోంచి "హిరాయిన్" తయారుచేసి ఇతర దేశాలకు సరఫరా చేస్తున్న విషయం అప్పుడప్పుడు పత్రికల్లో చదివారు. అలాంటిదేదో అయివుండాలని అనుకున్నారు.

దాదా లోయవైపు చూశాడు. రాకా వెంట నిలుచుని వున్నాడు.

"రాకా! ఇంతకు ముందు అది నీకు కనిపించిందా?"

"లేదు దాదా!"

"అయితే మనం నిజంగానే దారి తప్పాం! ఇదేదో గంజాయి పెంచేవాళ్ళ ముఠాకు సంబంధించింది లాగుంది. మనం వాళ్ళ కళ్ళ బడ్డామంటే బ్రతక నివ్వరు. గుట్టు చప్పుడు కాకుండా వెనక్కి వెళ్ళిపోవడం మంచిది" అన్నాడు దాదా.

ఇంతలోనే జుమ్మని శబ్దంచేసుకుంటూ ఏదో పెద్ద పక్షి

లాంటి ఆకారం, రివ్వున పైకి లేచిరావడం కనుపించింది. దాదా వింతగా దానికేసి చూశాడు. మేఘనాధ్ తుపాకీ సరి చేసుకున్నాడు. అరక్షణంలో అది ఎగురుతూ వాళ్ళ పై భాగం చేరుకుంది. అది పక్షి కాదు. హెలికాప్టర్.

అందరూ తలలు పైకెత్తి చూశారు.

లోపలవున్న వాళ్ళెవరో. ఎంతమందో కనుపించలేదు. వాళ్ళ పైగా వెళ్తూ నాలుగైదు బాంబులు వేసింది. పెద్ద మంటలు లేచాయి ఒక బాంబు వాళ్ళమధ్య పడింది. పెద్దగా శబ్దం చేసింది. అందరి చెవులు దిమ్మెక్కిపోయాయి. ఎవరికి తోచిన దిక్కుకు వాళ్ళు పరిగెత్తారు. రాకా మనుషులు ఇద్దరూ టపాకుల్లా పేలిపోయారు.

నేలనంటుకుని పడుకున్న మేఘనాధ్ తలెత్తి పైకి చూశాడు. దూరంగా ఆకాశంలో ఎక్కడో వుంది హెలికాప్టర్. అది తమని వదిలిపెట్టదని తెలుసుకున్నాడు. స్టెన్ గన్ తీసి, సేఫ్టీకాచ్ వదులు చేసి, ఆకాశం వేపు గురి పెట్టి సిద్ధంగా కూచున్నాడు, మళ్ళీ వస్తే పేల్చివేసేందుకు. కాలా కూడా ఆ ప్రక్కనే బోర్లగింతలా పడివున్నాడు.

మిగిలినవాళ్ళు దగ్గర్లో ఎవ్వరూ కనిపించలేదు. హెలికాప్టర్ ప్రొపెలర్ చేస్తున్న శబ్దం మళ్ళీ దగ్గరగా వినిపించసాగింది. వాళ్ళున్న ప్రాంతం పైకి రాగానే, కాస్త క్రిందికి దిగింది, వరుసగా నాలుగు బాంబులు పడ్డాయి. అదే క్షణంలో మేఘనాధ్, కాలా లిద్దరూ స్టెన్‌గన్‌లు గురి పెట్టి మీట నొక్కారు. గుండ్లవర్షం మొదలయింది.

పైనుంచిపడ్డ బాంబులు నేలను తాకగానే పగిలి, దట్టమైన పొగ రావటం మొదలయింది. ఆ ప్రాంతాన్నంతా చుట్టుముట్టేసింది. ఆ వాసనకు అక్కడున్న అందరి ముక్కు

అపరాధ పరిశోధన పోటీ-205

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-8-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు '85 నెల సంచికలో ప్రచురిస్తాము.

1. అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయిన ఎయిర్ ఇండియా విమానం ఇది—? (కాదంబరి, కనిష్క)
2. ఈ రాష్ట్రంలో పన్నుల భారం ఎక్కువగా వుంది—? (తమిళనాడు, ఆంధ్రప్రదేశ్)
3. రాజకీయ నాయకులకు ఇవంటే మహా ప్రీతి—? (విదేశీ పర్యటనలు, పదవులు)
4. వీళ్ళంటే అందరికీ హడలే—? (నక్సలైట్లు, టెర్రరిస్టులు)
5. దేశ పురోభివృద్ధిలో వీటి పాత్ర అతి ముఖ్యమైనది—? (పత్రికలు, ప్రతిపక్షాలు)

పుటాలు పగిలిపోయాయి. తల దిమ్మెక్కి స్పృహ కోల్పో యారు. హెలికాప్టర్ దూరంగా వెళ్ళిపోయింది.

47

మేఘనాధ్ కళ్ళు తెరిచి చూశాడు.

పై భాగాన తిరుగుతున్న ఫాను, వెలుగుతున్న లైటు, అతనికి తనేదో భవంతిలో వున్నట్లు గుర్తు చేశాయి. తక్కున లేచి కూర్చున్నాడు. ప్రక్కన తన జట్టువాళ్ళంతా అడ్డదిడ్డంగా పడి నిద్రపోతున్నారు. ఆ గదికున్న ఒకే ఒక తలుపు వెలుపల నుండి గొళ్ళెం పెట్టి వుంది. తన గన్ కోసం చూశాడు. కనుపించలేదు.

మెల్లగా లేచి ఒక్కొక్కరినే తట్టి లేపసాగాడు. అందరూ యింకా మత్తులోనే మునిగివుండిపోవటంతో అతని ప్రయత్నం వ్యర్ధమయింది.

మూలగా నున్న కూజాలోంచి నీళ్ళు వంచుకుని త్రాగి, ఇంకొన్ని నీళ్ళు చేతిలోకి తీసుకుని కళ్ళు, ముఖం తుడుచు కున్నాడు. ఆకలి సంగతి అప్పుడు గుర్తుకొచ్చింది. బాంబులుపడ్డ తర్వాత పొగ క్రమ్ముకు రావడం గుర్తొచ్చింది. తామంతా ఎవరో విరోధుల చేతుల్లో పడిపోయి నట్లు దృఢంగా తెలిసిపోయింది.

నిరాయధులుగా, బందీలుగా మిగిలిన తర్వాత ఆ పంజ రంలోంచి ఎలా తప్పించుకో:దమో అర్ధంకాలేదు.

దాదా మెల్లగా కదిలాడు. మేఘనాధ్ గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చాడు. అవి త్రాగాక "మనం ఎక్కడున్నాం?" అడిగాడు దాదా.

"ఏమో. అర్థం గావటంలేదు. ఈ పర్వతప్రాంతములో ఇలాంటి వసతులున్న ప్రదేశం వుండటం మొదటివిచిత్రం, అందులో మనం బందీలుగా చిక్కడం రెండో విశేషం"

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒకరూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటిసారి పంపేకాపీలు, అటుతర్వాత ప్రతి ఏడాది జనవరి నెల కాపీలు వి.పి.ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు సెట్టుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి. పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్‌పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్‌పై మీ పేరుకు ముందు వుండే క్రొత్త నెంబరును గుర్తించ కోరాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు. మీ నెంబరు వ్రాయకున్నా, 25 తేదీలోపల తెలిపినా— అవి పరిశీలనకు తీసుకోబడవు.

ప్రతినెలా V.P. కావాలనేవారికి

సెట్టు రు. 15/లు చొప్పున పంపబడుతుంది.

అన్నాడు మేఘనాధ్.

"మనల్ని ఎందుకు బంధించి వుంటారంటావ్?"

"పోలీసులనుకున్నారేమో?"

అంతలో అందరికీ స్పృహ వచ్చింది. ఒక్కొక్కరే లేచి నీళ్ళు త్రాగి కూర్చున్నారు. ఎవ్వరి మొహాల్లోనూ వుత్సాహం లేదు.

దూరంగా ఎవరో తమ గదివైపు వస్తున్న చప్పుడయింది. అంతా మౌనంగా కూర్చున్నారు ఎర్రటి యూనిఫాంలో వున్న నలుగురు వ్యక్తులు వచ్చి గది వెలుపల వున్న తాళం తీశారు. అందులో ఇద్దరు కొన్ని రొట్టెలు, జగ్గునిండా వేడి టి. రెండు కప్పులు తెచ్చి లోపల పెట్టారు.

"మీ రెవరు?" అడిగాడు దాదా.

"కనుపించలా? మీలాగే మనుషులం!" అన్నారు వాళ్ళు.

"మమ్మల్ని ఎందుకిలా బంధించారు?"

"ఎందుకో తర్వాత తెలుస్తుంది రొట్టెలు తిని టీ త్రాగండి!" అంటూ తలుపులు దగ్గరగా లాగి తాళం వేసుకుని వెళ్ళిపోయారు.

అందరూ రాకాను నిందిస్తూ, రొట్టె ముక్కలు నమల సాగారు. రాకా నోరు విప్పి సమాధానం చెప్పలేదు. దాదా కూడా మౌనంగానే వుండిపోయాడు. అతని మనస్సంతా, ఆ బందిఖానా నుండి ఎలా తప్పించుకోవడమన్న ఆలోచనతోనే నిండిపోయింది.

అరగంట గడిచింది.

ఇద్దరు యూనిఫాం మనుషులు వచ్చి తలుపులు తెరచి

శ్రీ వెంకటేశ్వరావారి నవలా కుసుమాలు

త్వరలో విడుదల!

1) మాయదారి లోకం — శ్యాంబాబు
(అపన సీరియల్)

2) పొగమంచు — ముద్దా సురేష్
(అపన సీరియల్)

విడుదలైన నవలలు

1) లిటిల్ మాష్టర్	శ్యాంబాబు	16-00
2) అంగారక (అపన సీరియల్)	శ్యాంబాబు	18-00
3) లవ్ మ్యాజిక్	శ్యాంబాబు	16-00
4) టెర్రర్! టెర్రర్!	శ్యాంబాబు	18-00
5) అంతరిక్షయాత్ర (అపవ సీరియల్)	రమణశ్రీ	18-00
6) ఇది ఎలా జరిగింది?	N.S. నాగిరెడ్డి	16-00
7) రుద్రనేత్రం	N.S. నాగిరెడ్డి	15-00
8) వలలో చిక్కిన వనిత	కొమ్మూరి సాంబశివరావు	16-00
9) ఎవరికోసం ఈ త్యాగం	కొమ్మూరి సాంబశివరావు	15-00
10) ప్రేమవాహిని	N. భారతీదేవి	15-00
11) మరో ప్రేమబంధం	N. భారతీదేవి	14-00
12) అర్పణ	N. భారతీదేవి	14-00

వివరములకు:—

శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్

మాజేటివారి వీధి, విజయవాడ-3.

దాదాను, మేఘనాధ్‌ను వెంటబెట్టుకొని వెళ్ళారు. నడవలో దాదాపు వంద అడుగులు నడిచారు. రెండు ప్రక్కలా గదులున్నాయి. అక్కడ్నుంచి మెట్లెక్కి పైకి చేరారు. నాలుగైదు గదులు దాటాక, విశాలమైన గదిలోకి ఇద్దర్నీ తీసుకు వెళ్ళారు.

ఆ గది ద్వారానికి ఎదురుగా ఎత్తైన వేదికపైన సింహాసనంలాటి కుర్చీ వుంది. తలవేపు సింహపు తల వ్రేలాడ దీయబడి వుంది.

కిటికీలకున్న తెరలు. క్రింద పరచిన తివాసీ, కుర్చీలపై వేసిన మెత్తలు, అన్నీ ఎర్ర రంగులో ఉన్నాయి.

దాదాను, మేఘనాధ్‌ను కోర్టులోవుండే బోనులాంటి ప్రదేశంలో నిలబెట్టారు. ఐదు నిమిషాలయ్యాక పది మంది మనుషులు గదిలోకి వచ్చారు. వదులుగావున్న ఎర్రని సిల్కు పైజామా, జుబ్బా వేసుకున్న మనిషి తిన్నగావెళ్ళి సింహాసనంపైన కూర్చున్నాడు. మిగిలిన వాళ్ళంతా ఒకప్రక్కగా నిలచున్నారు.

"నీ పేరేమిటి?" అడిగాడు అధికారిలా, కుర్చీలో కూర్చున్న మనిషి దాదావేపు వ్రేలెత్తిచూపుతూ.

"జ్వాలా?" అన్నాడు మెల్లిగా.

"నీ పేరు?"

"మేఘనాధ్!"

"ప్రభుత్వంలోని ఏ డిపార్టుమెంటులో పనిచేసారు? పోలీసు, సి.బి.ఐ, బి.ఎస్.ఎఫ్, మొదలైన వాటిల్లో దేనికి సంబంధించినవాళ్ళు?"

"ఐదేళ్ళ కొకసారి, ఓటు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకునే తెగకు చెందిన మామూలు మనుషులం" అన్నాడు మేఘ

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-8-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

జూన్ '85 పోటీ ఫలితాలు:

(1) జూన్ '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ముంచుకొస్తున్నది మృత్యువు!
పొంచి చూస్తున్నాడు శత్రువు!!

పంపినవారు: శ్రీ ఇ.టి. రా రావు, పర్చేజ్ అసిస్టెంట్, ఇండియన్ స్పేస్ రిసెర్చి ఆర్గనైజేషన్, శ్రీహరికోట-524124.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

విమానాల హోరులో!
విప్లవాల బాటలో!!

పంపినవారు: శ్రీ రంగా వెంకటేశ్వర్, 6-1-63, గాంధి చౌక్ ఏరియా, బెల్లంపల్లి — 504 251.

నాధ్.

"ఆ జాతివాళ్ళు, యింతదూరం, ప్రాణాలకు తెగించి రారు. బుకాయించి లాభంలేదు. నిజం చెప్పండి. లొంగి పోండి. నా తరపున ఏజంట్లుగా వుంటామని ప్రమాణం చెయ్యండి. లేదంటే. మీ శవాల కీ కొంకల్లో, రాబందులు గండభేరుండాలు, అంత్యక్రియలు చేస్తాయి" అన్నాడతను.

"భయపెడ్తున్నావా?" అడిగాడు దాదా.

"లేదు. మీకు యెదురయ్యే పరిస్థితుల భయంకర స్వరూపాన్ని వివరిస్తున్నాను."

"అసలు నువ్వెవరు? మమ్మల్నెందుకిలా పట్టుకొచ్చావ్? మా త్రోవన మమ్మల్ని పోనీకుండా యెందుకు అపావ్?" అడిగాడు మేఘనాధ్.

"ఇది నా రాజ్యం. ఇందులోకి నా అనుమతి లేకుండా ఎవ్వరూ అడుగుపెట్టగూడదు. అలా పెట్టినవాళ్ళు, తిరిగి వెళ్ళడం, నా మనుషులుగా అయితేనే."

"నీ రాజ్యపు సరిహద్దుల దగ్గర అలాంటి బోర్డు పెట్టించ లేకపోయావా?" అడిగాడు దాదా.

"అవసరం లేదు."

"నీ పేరేమిటి?" అడిగాడు మేఘనాధ్.

"నా పేరు. వ్యాపారం, శక్తి, యుక్తి తెలియకుండానే యింతమంది మనుషుల్ని వెంటేసుకుని నన్ను ముట్టడించడానికి వచ్చారా మీరు?" అడిగాడు కోపంగా.

"నిజంగా నువ్వెవ్వరో మాకు తెలీదు. మేము వేరే పనిమీద దాదాపు రెండు మాసాల నుండి ఈ అడవిలో తిరుగుతున్నాం!" అన్నాడు దాదా.

"ఏమిటా పని?"

శ్రీ మహాలక్ష్మి వారు ప్రచురించిన

'అపన' సీరియల్స్!

1.	కైలాస నగరం	శ్యాంబాబు	15.00
2.	ఖైదీ	ఏ.వీ. మోహన్రావ్	20.00
3.	అతీంద్రియ శక్తులు	రమణశ్రీ	18.00
4.	కాంచన గ్రహం	వాణిశ్రీ	17.00
5.	నరాంతకులు	వసుంధర	13.00
6.	అమానుషం (అడుగు ముందుకు వేస్తే చస్తావ్!)	,,	15.00
7.	మల్లెలు—మందారాలు (రక్తపుటేర్లు)	,,	17.00
8.	నిను వీడని నీడను నేనే (గుడ్డి దర్బారు)	,,	16.00
9.	శాన్యోరా	ముద్దా సురేష్	20.00
10.	సాగరలోయ	బొమ్మిడి అచ్చారావు	17.00
11.	కళ్యాణ దుర్గం	,,	(త్వరలో)

అడ్వాన్సుతో పాటు నేడే మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

"కాంచనజంగా పర్వతశిఖరం ఎక్కడం."

"ప్రభుత్వం పంపిందా?"

"లేదు. సొంతంగా మేమే వచ్చాం."

"నేను నమ్మను. కొండలు ఎక్కేవాళ్ళ దగ్గర వుండే సామగ్రి మీ దగ్గర ఏదీ లేదు. మీరు ఖచ్చితంగా రహస్య గూఢచారి శాఖకు చెందిన పోలీసులే. ఇక్కడ్నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించకండి. నా చిన్నరాజ్యం కాపాడేందుకు దాదాపు రెండువేలమంది సాయుధు లున్నారు" అన్నాడు.

"మీరు నమ్మినా నమ్మకున్నా మేము చెప్పింది నిజం" అన్నాడు మేఘనాధ్.

"మీకు యిరవై నాలుగు గంటలు వ్యవధి యిస్తున్నాను. ఈలోగా ఏదో ఒకటి నిర్ణయించుకోండి" అంటూ ఆసనం దిగి వెళ్ళిపోయాడు.

అతను వెళ్తుంటే అందరూ తలలు వంచి నిల్చున్నారు. దాదాను, మేఘనాధ్‌ను మళ్ళీ యధాస్థానానికి తీసుకు వచ్చారు. లోపలకు త్రోసి తలుపులు మూసి తాళం పెట్టారు.

అందరూ ఆతృతగా అడిగారు ఏమయిందని. జరిగింది వివరంగా చెప్పారిద్దరూ.

హతాశులై కూలిపోయారు.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600001.